ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
3-5-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 91 పేజీలు: 10+4 వెల: 6.50

**ఉగ్రవాదుల అంతానికి భారత్‌కు సహకరించండి**
- పాక్‌కు జెడి వాన్స్ సూచన

**రెండు నెలలపాటు ఆహారం నిల్వ చేసుకోండి: పాక్ హెచ్చరిక**
5లో



## తెలంగాణ కులగణన
# 'కేంద్రానికి దిక్సూచి'
### ఉగ్రదాడి మృతులకు అమరవీరుల హోదా: రాహుల్
### ఉగ్రపోరులో కేంద్రానికి సంపూర్ణ మద్దతు : ఖర్గే
### వర్కింగ్ కమిటీ సమావేశంలో సిఎం రేవంత్ ప్రజెంటేషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే2:** తెలంగాణ ప్రభుత్వం చేసిన కుల గణనను కేంద్ర ప్రభుత్వం ఫాలో కావాలని సిడబ్ల్యూసి సూచించింది. ఇదే సమయంలో పెహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు పరిహారం మాత్రమే కాకుండా దీర్ఘకాలిక పునరావాసం కల్పించాలని డిమాండ్ చేసింది. శుక్రవారం ఢిల్లీలో అత్యవసరంగా సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తెలంగాణ ప్రభుత్వం చేసిన కులగణనను అభినందించింది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తన ప్రభుత్వం చేసిన కులగణన గురించి సమావేశంలో ప్రజెంటేషన్ ఇవ్వగా సిడబ్ల్యూసి హర్షం వ్యక్తం చేసింది. తెలంగాణ ప్రభుత్వం అత్యంత సమర్థవంతంగా పూర్తి వివరాలతో కులగణనను నిర్వహించిందని, కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ మోడల్‌ని ఫాలో కావాలని సిడబ్ల్యూసి సూచించింది. పౌర సమాజం సామాజిక కార్యకర్తలు వివిధ సామాజిక వర్గాల లీడర్లను ప్రక్రియలో భాగస్వాములు చేశారని, అధికారులతో అంతర్గత కసరత్తు కాకుండా బహిరంగంగా ప్రజల నుంచి వివరాలు సేకరించారని సిడబ్ల్యూసి వివరించింది. తెలంగాణ ప్రభుత్వం అనుసరించిన పద్ధతిని కేంద్ర ప్రభుత్వం ఫాలోఅవ్వాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ గట్టిగా కోరింది. కాగా, సిడబ్ల్యూసి సమావేశంలో పెహల్గాం ఉగ్రదాడి మృతులకు సిడబ్ల్యూసి సంతాపం తెలిపింది.
బాధిత కుటుంబాల బాధ.. మొత్తం దేశం బాధ అని పేర్కొంది. ఉగ్రదాడికి దేశం మొత్తం జవాబుదారీతనం అని, న్యాయం కోసం ఎదురు చూస్తోందని తెలిపింది. ఇది రాజకీయాలకు సమయం కాదని, పాకిస్తాన్‌కు గుణపాఠం నేర్పడానికి ఉగ్రవాదాన్ని నిర్ణయాత్మకంగా అరికట్టడానికి ఒక దేశంగా మన సమిష్టి సంకల్పాన్ని ప్రదర్శించాల్సిన సమయం అని సిడబ్ల్యూసి వ్యాఖ్యానించింది. ఉగ్రదాడికి సూత్రధారులు, నేరస్థులు పూర్తి పరిణామాలను ఎదుర్కోవాలని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్‌ను ఒంటరిగా చేసి శిక్షించడానికి భారత ప్రభుత్వం దృఢంగా, వ్యూహాత్మక స్పష్టతతో అంతర్జాతీయ సమన్వయంతో వ్యవహరించాలని కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. బాధితుల కుటుంబాలకు నిరంతర నైతిక, సంస్థాగత మద్దతు ఇవ్వాలని కూడా కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. బాధిత కుటుంబాలకు పరిహారం మాత్రమే కాకుండా, దీర్ఘకాలిక పునరావాసం, మానసిక మద్దతు కల్పించాలని డిమాండ్ చేసింది. భద్రత నిఘాలో తీవ్రమైన లోపాలకు కాలపరిమితితో కూడిన జవాబుదారీతనంఉండాలని కూడా సిడబ్ల్యూసి సూచించింది. పహల్గామ్ ఉగ్ర >>2



శుక్రవారం అమరావతి సభావేదిక నుంచి వర్చువల్‌గా వివిధ పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్న ప్రధాని మోడీ. చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు

## వికసిత్ భారత్‌కు గ్రోత్ ఇంజిన్
# 'అమరావతి'
### రాజధాని పునఃప్రారంభపనుల కార్యక్రమంలో ప్రధాని మోడీ

**విజయవాడ,మే2,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ను అధునాతనప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతికి ఉంది అని, అమరావతిని వికసిత్ భారత్ గ్రోత్ ఇంజిన్‌గా మార్చాలని ప్రధాన మంత్రి మోడీ అన్నారు. రాజధాని అమరావతి పునః నిర్మాణ పనులను ప్రధాని మోడీ ప్రారంభించారు. శుక్రవారం మధ్యాహ్నం అమరావతి పునఃప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి మోడీ విచ్చేశారు. ప్రధాని వర్చువల్‌గాపలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం తెలుగులో ప్రసంగం ప్రారంభించిన ప్రధాని మోడీ దుర్గాభవానీ కొలువైన పుణ్యభూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది. ఇవి కేవలం శంకుస్థాపనలు కాదు.. ఎపి ప్రగతికి, >>2

## ఎప్‌సెట్ ఇంజనీరింగ్‌కు
# 93.8% హాజరు

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఎప్(ఇఎపి) సెట్-2025కి సంబంధించిన పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎప్ సెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్, కో కన్వీనర్, జేఎన్‌టియూ రెక్టార్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మరో రెండు రోజులపాటు పరీక్షలు కొనసాగనున్నాయి. శుక్రవారం జరిగిన పరీక్షలకి 93.87 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇఎపి సెట్-2025కి 3,06,796 మంది దరఖాస్తు చేసుకోగా.. అందులో ఇంజనీరింగ్‌కి 2,20,049 దరఖాస్తులువచ్చాయి. పరీక్షల నిర్వహణ కోసం 124 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను రెండుసెషన్‌లలో >>2



## ఐదుగురితో 'ఎన్‌డిఎస్ఎ'
# అధ్యయన కమిటీ
### నివేదికపై కేబినెట్‌లో చర్చ

**హైదరాబాద్, మే2, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఎన్‌డిఎస్ఏ నివేదిక అధ్యయనం కోసం ఐదుగురు నీటిపారుదల శాఖ అధికారులతో కమిటిని ఏర్పాటు చేసింది. ఇంజనీర్ ఇన్ చీఫ్ జనరల్ జి.అనిల్‌కుమార్, ఇఎన్‌సి ఆపరేషన్ అండ్ మెంటెనెన్స్, సిఇ రామగుండం, సిఇ సెంట్రల్ డిజైన్ అండ్ ఆర్గనైజేషన్, క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్లు ఇందులో సభ్యులుగా ఉంటారని పేర్కొంటూ నీటిపారుదలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్‌బొజ్జ ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటికే కాళేశ్వరం ఇఎన్‌సి హరిరామ్‌ను ఎసిబి అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. మరోవైపు శాఖపరమైన విచారణలు చేపట్టి ఇక మేడిగడ్డ పాపంలో భాగమైన వారిని గుర్తించేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు. క్యాబినెట్‌లో నిపుణుల అభిప్రాయాలు చర్చించే అవకాశం ఉంది. మేడిగడ్డ కుంగుబాటు, అన్నారం సుందిళ్ళ బ్యారేజికి బుంగలు పడటంతో కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖ చంద్రశేఖర్ అయ్యన్నార్ నేతృత్వంలో ఒక నిపుణు కమిటిని వేసి కాళేశ్వరం వైఫల్యంపై అధ్యయనం చేయించింది. ఎన్‌డిఎస్‌ఎ తుది నివేదికను ఇటీవల తెలంగాణ చీఫ్ సెక్రటరీకి అందజేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మూడు బ్యారేజీలు పెను ప్రమా >>2

# డిగ్రీ సీట్లలో 8 వేలు పెంపు
### నేటి నుంచి దోస్త్ దరఖాస్తులు..
### 21 వరకు మొదటి విడత రిజిస్ట్రేషన్
### 10 నుంచి వెబ్ ఆప్షన్లు ప్రారంభం...29న సీట్ల కేటాయింపు
### ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో.. డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)-2025 దరఖాస్తులను నేటి(శనివారం) నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. 10 నుంచి వెబ్‌ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఈ నెల 29న మొదటి విడత సీట్ల కేటాయింపును చేపట్టనున్నారు. గత ఏడాదికంటే ఈ ఏడాది డిగ్రీ కోర్సుల్లో 8,275 సీట్లు పెరిగాయి. గత ఏడాది 1066 కాలేజీల్లో 4,49,449 సీట్లు అందుబాటులో ఉండగా.. ఈ ఏడాది అదికాస్త 1057 కాలేజీల్లో 4,57,724 సీట్లకు పెరిగింది. దోస్త్-2025కి సంబంధించిన నోటిఫికేషన్‌ను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, దోస్త్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, కళాశాల విద్య కమిషనర్ శ్రీదేవసేన, ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, కళాశాల విద్య ఆర్‌జేడీ రాజేంద్ర సింగ్, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ పి బాల భాస్కర్, దోస్త్ అడ్మిషన్ కోఆర్డినేటర్ డాక్టర్ డి వసుంధర, దోస్త్ హెల్ప్‌డెస్క్ కోఆర్డినేటర్ విజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
ఈ ఏడాది దోస్త్ ద్వారా మొదటి విడతల్లో అడ్మిషన్ల ప్రక్రియను నేటి( శనివారం మే3) నుంచి ప్రారంభిస్తున్నట్టు బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈ నెల 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. మొదటి విడత సీట్ల కేటాయింపు 29న చేపట్టి.. మే 30 నుంచి జూన్ 6 వరకు ఆన్‌లైన్ సెల్ఫ్‌రిపోర్టింగ్‌కు అవకాశమిచ్చారు. జూన్ 30 నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం క్లాసులను ప్రారంభించనున్నారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో బిఎ, బికామ్, బిఎస్సీ, బిబిఎ, బిసిఎ, బిబిఎంలలో అడ్మిషన్లు ఇవ్వనున్నారు. రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన, మహిళా యూనివర్సిటీల్లో అడ్మిషన్లను దోస్త్ ద్వారా చేపట్టనున్నారు. రూ. 200తో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రాష్ట్రంలోని 1057 డిగ్రీ కాలేజీల్లో 4,57,724 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిలో 143 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలున్నాయని తెలిపారు. విద్యార్థి ఫోన్ నంబర్ ఆధార్‌తో లింక్ అయి ఉంటే నేరుగా దోస్త్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఆధార్‌తో ఫోన్ నంబర్ లింకు కాకుంటే తల్లి లేదా తండ్రి ఫోన్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి టీ యాప్ ఫోలియో మొబైల్ యాప్ ద్వారా ఫోటో అథెంటికేషన్‌ను >>2

## ఫోన్ ట్యాపింగ్ కేసు
### ప్రభాకరరావు ముందస్తు బెయిల్ పిటిషన్ డిస్మిస్



**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబి మాజీ బాస్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం డిస్మిస్ చేసింది. ఈ విషయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం ప్రభాకర్ రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. రాష్ట్ర పోలీసు శాఖలో దుమారంరేపి, రాజకీయంగాసంచలనంరేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో మొదటి ముద్దాయిగా వున్న నాటి ఎస్ఐబి బాస్ ప్రభాకర్ రావు అమెరి >>2

## వడదెబ్బ మరణాలకు
# పెరిగిన ఎక్స్‌గ్రేషియా
### రూ.50 వేల నుంచి రూ.4 లక్షలకు..
### రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**హైదరాబాద్, మే 2 ప్రభాతవార్త :** రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలు, వడగాలుల నుంచి ప్రజలను రక్షించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆమేరకు సంబంధిత శాఖలు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది 2025లో ఎండలు, వడగాలులు అధికంగావీచే అవకాశం ఉందని, జూన్ వరకుకూడా అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని, ఐఎండి హెచ్చరికల నేపధ్యంలో తీసుకోవలసిన చర్యలపై 12 సంబంధిత శాఖలతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్షాసమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ, ఇండియన్ మెట్రాలాజికల్ శాఖ కలిసి సమగ్ర తెలంగాణ స్టేట్ హీట్‌వేవ్ >>2



## రాష్ట్రంలో గాలి, వాన
# బీభత్సం
### నేలకొరిగిన చేలు, రాలిన మామిడి, విద్యుత్‌కు అంతరాయం

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త :** రాష్ట్రంలో మరో సారి కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులు బీభత్సాన్ని సృష్టించాయి. పలు జిల్లాల్లోని వివిధ ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. గురువారం రాత్రి నుండి శుక్రవారం వరకూ ఈదురు గాలులతో కూడిన వర్షం తెలంగాణలోని మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం తదితర జల్లాల్లోని పలు మండలాలలను కకలావికలం చేసింది. మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో శుక్రవారం తెల్లవారుజామున బీభత్సాన్ని సృష్టించింది. రెండు గంటల పాటు ఈదురు గాలులు, రాళ్లతో కురిసిన వర్షం ప్రజలను అతలాకుతలం చేసింది. గాలుల కారణంగా కొత్తపేట, బయ్యారం, బాలాజీ పేట, వెంకట్రాంపురం, జగ్గు తండా, బంజర తండా, నామలపాడు, నర్సాతండా ఉప్పలపాడు, మిర్యాలపెంట కంబాలపల్లి, కాచనపల్లివంటి గ్రామాల్లో పెద్ద పెద్ద చెట్లు నేలకొరిగాయి. పలు గ్రామాల్లో ఇండ్లపైకప్పులు, రేకులు గాలికి కొట్టుకుపోయాయి. రంగాపురం ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉన్న 150 ఏళ్ల మర్రి వృక్షం వేర్లతో సహా కూలిపోగా, బయ్యారంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న పురాతన మర్రిచెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. పలుచోట్ల స్తంభాలు, వైర్లు తెగిపోవడంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోవ >>2

## ఐదు రోజుల ఎసిబి కస్టడీకి ఇఎన్‌సి హరిరాం



**హైదరాబాద్, మే 2, ప్రభాత వార్త:** ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో అరెస్టయిన కాళేశ్వరం ప్రాజెక్ట ఇంజనీరింగ్ చీఫ్ (ఇఎన్‌సి) భూక్యా హరిరాంను ఐదు రోజుల కస్టడీ విచారణ నిమిత్తం ఎసిబి అధికారులు శుక్రవారం నాడు చంచల్‌గూడ జైలు నుంచి అదుపులోకి తీసుకున్నారు. ఉదయం పది గంటల సమయంలో ఎసిబి అధికారులు చంచల్‌గూడ జైలుకు వెళ్లి హరిరాంను అదుపులోకి తీసుకుని నేరుగా ఉస్మానియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అనంతరం అక్కడ ఆయనకు వైద్య పరీక్షలు చేయించి, >>2


# గ్రూప్-1 నియామకాలకు బ్రేక్
### మధ్యంతర స్టేను కొనసాగిస్తున్నట్టు ప్రకటించిన హైకోర్టు

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** గ్రూప్-1 నియామకాలకు హైకోర్టు తాత్కాలికంగా బ్రేక్ వేసింది. ఏప్రిల్ 17న జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు పొడిగిస్తున్నట్టు ప్రకటించింది. గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయంటూ 20 మంది అభ్యర్థులు దాఖలు చేసిన కేసులో న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ఈ నెల 17న నియామకాల ప్రక్రియను నిలిపివేయాలని, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను కొనసాగించుకోవచ్చని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి)కి సూచిస్తూ ఆదేశాలిచ్చారు. అనంతరం .. సింగిల్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వులను నిలుపుదల చేయాలని.. అలాగే గ్రూప్-1 పిటిషన్లపై సిజె ధర్మాసనం ముందు టిజిపిఎస్‌సి అప్పీలు చేసింది. వాదనలువిన్న సిజె ధర్మాసనం .. విచారణ జరుగు తున్న నేపథ్యంలో తాము >>2



## గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై
# యుద్ధ విమానాలు
### టేకాఫ్, ల్యాండింగ్ ట్రయల్ రన్

**న్యూఢిల్లీ, మే 2:** వాయుసేన యుద్ధవిమానాలు అత్యవసర పరిస్థితుల్లో ఎక్స్‌ప్రెస్‌వేపై టేకాఫ్, లాండింగ్‌ను సాధనచేస్తున్నాయి. శుక్రవారం ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్ పూర్‌లోని గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై ఉన్న దాదాపు 3.5 కిలోమీటర్ల ఎయిర్‌స్ట్రిప్‌పై ఈ సాధన జరుగుతున్నది. దీనిని యుద్ధవిమానాలు ల్యాండింగ్‌కు అనుకూలంగా నిర్మిం చారు. ఎక్స్‌ప్రెస్ రహదారి రన్‌వేకు ప్రత్యామ్నాయంగా ఎంతమేరకు >>2



కేరళలో శుక్రవారం విజింజం అంతర్జాతీయ ఓడరేవును ప్రారంభించిన ప్రధాని మోడీ

# డిగ్రీ సీట్లలో 8 వేలు పెంపు

>> చేసుకోవడానికి వీలవుతుంది. 7901002200 నంబర్‌కు హాయ్ అని పంపిస్తే దోస్త్ మెను రావడమే కాకుండా ఎలా దరఖాస్తు చేసుకోవాలో చెబుతుంది. ఫేస్‌బుక్ అకౌంట్‌తోపాటు, ట్విట్టర్ అకౌంట్‌కూడా ఓపెన్ చేశారు. అలాగే దోస్త్ యూ ట్యూబ్ ఛానల్‌లో హెల్పింగ్ వీడియోలను కూడా చూడవచ్చు.

**రిజిస్ట్రేషన్ వివరాలు..**

మొదటి విడత రిజిస్ట్రేషన్ మే 3 నుంచి 21 వరకు
వెబ్ ఆప్షన్లు మే 10 నుంచి 22 వరకు
మొదటి విడత సీట్ల కేటాయింపు మే 29
ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ మే 30 నుంచి జూన్ 6 వరకు
రెండో విడత రిజిస్ట్రేషన్(రూ.400తో) మే 30 నుంచి జూన్ 8వరకు
వెబ్ ఆప్షన్లు మే 30 నుంచి జూన్ 9 వరకు
సీట్ల కేటాయింపు జూన్ 13
సెల్ఫ్ రిపోర్టింగ్ జూన్ 13 నుంచి జూన్ 18 వరకు
మూడో విడత రిజిస్ట్రేషన్(రూ.400తో) జూన్ 13 నుంచి జూన్ 19 వరకు
వెబ్ ఆప్షన్లున జూన్ 13 నుంచి జూన్ 19 వరకు
సీట్ల కేటాయింపు జూన్ 23
సెల్ఫ్ రిపోర్టింగ్ జూన్ 23 నుంచి జూన్ 28 వరకు
మూడు విడతల్లో ఆన్‌లైన్ సెల్ఫ్‌రిపోర్టింగ్ చేసిన విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో అలాట్ అయిన కాలేజీల్లో జూన్ 24 నుంచి జూన్ 28 వరకు సమర్పించాల్సి ఉంటుంది.
స్టూడెంట్స్ ఓరియంటేషన్ ఇన్ కాలేజెస్‌ను జూన్ 24 నుంచి 28 వరకు నిర్వహించి.. జూన్ 30 నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం క్లాసులు ప్రారంభించనున్నారు.

# రాష్ట్రంలో గాలి, వాన బీభత్సం

>> దంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. విద్యుత్ పునరుద్ధరణకు ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతులు ప్రారంభించారు. ఇల్లందు మహబూబాబాద్ జాతీయ రహదారి బయ్యారం శివారులో చెట్టు రహదారిపై పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొత్తపేట, ఉప్పలపాడు, బయ్యారం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. ధాన్యం భద్రపరచుకునేందుకు పట్టాలు కప్పినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన చెందారు. విపరీతమైన గాలి కారణంగా మామిడికాయలు రాలిపోవడంతో కౌలు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరంగల్ జిల్లాలోని పలు మండలంలో గాలి వాన బీభత్సం సృష్టించింది. సుమారు రెండు గంటలపాటు ఈదురుగాలితో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈదురు గాలులకు వృక్షాలు నేలకొరిగాయి. కరెంట్ స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలలోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో ధాన్యం తడిసి ముద్దయింది. చేతికందిన పంట నీటి పాలు కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షం రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. కల్లాల్లో రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిచిపోగా, చేతికొచ్చిన బొప్పాయి తోటలు విరిగిపోయాయి. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రఘునాథపాలెం మండలంలో బొప్పాయి తోటలు నేలవాలాయి. సూర్యాతండాలో రైతులు సాగుచేసిన బొప్పాయి తోటలు పూర్తిగాదెబ్బతిన్నాయి. పలు ప్రాంతాల్లో అక్కడ క్కడా వరి, మొక్కజొన్న, మిరప తోటలు దెబ్బతిన్నాయి. భారీ వృక్షాలు, పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తిరుమలాయపాలెం మండలం బచ్చోడు ధాన్యం కొనుగోలు కేంద్రంలో పట్టాలు లేకపోవడంతో ధాన్యపు రాసులు తడిచిముద్దయ్యాయి. చుట్టుపక్కల గ్రామాల రైతులు సుమారు 3,500 క్వింటాళ్ల ధాన్యం విక్రయానికి తేవడంతో అకాల వర్షానికి తడిసిపోయాయి.

# 93.8% హాజరు

>> ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నాం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నారు. శుక్రవారం ప్రారంభమైన ఇంజనీరింగ్ పరీక్షకి ఉదయం సెషన్‌లో 37,041 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 34,618 మంది హాజరయ్యారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో 93.46 శాతం మంది హాజరయ్యారు. రెండో సెషన్‌లో 37,164 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 35,040 మంది హాజరయ్యారు. రెండో సెషన్‌లో పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో 94.28 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు.

# ఇఎన్‌సి హరిరాం

>> ఆరోగ్యం బాగుందని వైద్యులు సిఫార్సు చేశాక నేరుగా బంజారాహిల్స్‌లోని ఎసిబి ప్రధాన కార్యాలయానికి తరలించారు. వచ్చే మంగళవారం వరకు హరిరాం ఎసిబి కస్టడీలో వుండనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల మార్పు వ్యవహారంలో భారీగా అకవతవకలు జరిగాయని, ఇందులో హరిరాం పాత్ర వుందని కొంత కాలంగా ఆరోపణలు వస్తుండడం తెలిసిందే. దీనిపై ఎసిబికి అందిన అనేక ఫిర్యాదుల నేపథ్యంలో ఆయనపై ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన అంశంపై దాడులు జరిగాయి. దాడుల సందర్భంగా ఎసిబి అధికారులు ఆయన కార్యాలయంతో పాటు ఇల్లు, బంధువులు, సన్నిహితుల ఇళ్లపై సోదాలు చేశారుజ మొత్తం 14 చోట్ల సోదాలు చేయగా 200 కోట్ల రూపాయలకు పైగా అక్రమాస్తులు వెలుగు చేశాయి. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలలో హరి రాం పాత్ర వుందని భావిస్తున్న ఎసిబి అధికారులు ఆయనను మరింతగా విచారించేందుకు పది రోజుల పాటు కస్టడీ ఇవ్వాలని ఎసిబి అధికారులు కోర్టును కోరగా న్యాయస్థానం మాత్రం ఐదు రోజులు మాత్రమే అనుమతి ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు ఎసిబి అధికారులు హరిరాంను కస్టడీలోకి తీసుకుని విచారణ మొదలు పెట్టారు. మంగళవారం సాయంత్రం తిరిగి ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలిస్తారు.

# యుద్ధ విమానాలు

>> ఉపయోగపడుతుందనే అంశాలను ఈసందర్భంగా పరిశీలిస్తున్నారు. ఇవి రెండు భాగాలుగా జరగనున్నాయి. ఉదయం రాత్రి ల్యాండింగ్ టేకాఫ్ చేస్తారు. ఉదయం సాధారణ వేళల్లోనే ఈపరీక్షలు జరుగుతున్నాయి. కానీ రాత్రి వేళల్లో మాత్రం ఏడు గంటలనుంచి 10 గంటలమధ్యలో టేకాఫ్, ల్యాండింగ్ చేస్తున్నారు. ఓవక్క భారత్‌పాక్‌మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరినవేళ ఈపరీక్షలు జరగడం గమనార్హం. యుద్ధవిమానాల రాకనేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం పూర్తి జాగ్రత్తలు తీసుకుంది. సుమారు 250 సిసి కెమేరా లను అక్కడ ఏర్పాటుచేసింది. ముందురోజునుంచే ఈ మార్గం పూర్తిగా వాయుసేన నియంత్రణలోకి వెళ్లిపోయింది. యూపిలోయుద్ధవిమానాలు దిగేలా నిర్మించిన నాలుగో ఎక్స్‌ప్రెస్‌వేగా ఇది రికార్డుసాధిం చింది.

# పెరిగిన ఎక్స్‌గ్రేషియా

>> యాక్షన్ ప్లాన్ (హెచ్‌ఎపి) 2025 ను రూపొందించాయని ఇందులో భాగంగా ప్రతి జిల్లాకు ఒక నోడల్ అధికారిని నియమించారని తెలిపారు. ఈ సందర్భంగా హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ 2025ను మంత్రి విడుదల చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పుల దృష్ట్యా చలివేంద్రాలలో త్రాగునీరుతోపాటు ఓఆర్‌ఎస్, మజ్జిగ ప్యాకెట్ల సరఫరా చేయాలని, సిఎస్‌ఆర్ కింద వివిధ కంపెనీలు వీటిని సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, హైదరాబాద్, వరంగల్, ఖమ్మం,మహబూబ్‌నగర్, నిజామాబాద్, కొత్తగూడెం, మెదక్, కరీంనగర్ తదితర పట్టణ ప్రాంతాల్లో ప్రధానంగా దృష్టిసారించాలని సూచించారు తెలంగాణలో 612 మండలాల్లో 588 మండలాలను వడగాలుల ప్రభావిత ప్రాంతాలుగా వర్గీకరించామని తెలంగాణ రాష్ట్రం గతనెల 15న హీట్‌వేవ్‌ను స్టేట్ స్పెసిఫిక్ డిజాస్టర్‌గా నోటిఫై చేశామన్నారు.మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియోను రూ. 50 వేల నుంచి నాలుగు లక్షలకు పెంచినట్లు తెలిపారు.తెలంగాణలో 612 మండలాల్లో 588 మండలాలను వడగాలుల ప్రభావిత ప్రాంతాలుగా వర్గీకరించామని తెలంగాణ రాష్ట్రం గతనెల 15న హీట్‌వేవ్‌ను స్టేట్ స్పెసిఫిక్ డిజాస్టర్‌గా నోటిఫై చేశామని తెలిపారు. మృతులకుటుంబాలకు ఎక్స్ గ్రేషియోను రూ. 50 వేల నుంచి నాలుగు లక్షలకు పెంచినట్లు తెలిపారు.వడగాలుల ప్రభావం సామాన్యప్రజలపై పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అయినా కూడా అనుకోని పరిస్థితులలో ఎవరైనా చనిపోతే మానవతా దృక్పథంతో వ్యవహరించి తక్షణం ఎక్స్ గ్రేషియో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండలకు సంబంధించిన సమాచారం, అధిక ఉష్ణోగ్రతల వేళ ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు, కూల్ వార్డుల ఏర్పాటు,ఆసుపత్రులలో ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహణ వంటి అంశాలపై చర్యలు చేపట్టాలని ప్రజా ఆరోగ్య కేంద్రాలు,ఆస్పత్రులలో ఓఆర్‌ఎస్ ప్యాకట్లను అందుబాటులో ఉంచాలని,ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా వేడి ప్రదేశాలలో పనిచేసే కార్మికులను రెండు బృందాలుగా విభజించి కనీసం గంట లేదా రెండు గంటల విశ్రాంతి ఇచ్చేలా రొటేషన్ పద్ధతి అవలంభించేలా పరిశ్రమలకు సూచించాలని పరిశ్రమలు, వాణిజ్య శాఖకు సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణా కార్మికులకు అవసరమైన విశ్రాంతి, త్రాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, నీడ సదుపాయం వంటి వైద్య సౌకర్యాల అందుబాటు వంటి విషయాలలో దృష్టిసారించాలని కార్మిక సంక్షేమ శాఖకు సూచించారు. బస్టాండ్లు, మార్కెట్లు, పర్యాటక కేంద్రాలు, ప్రార్ధనా స్థలాల వంటి పబ్లిక్ ప్రాంతాలలో అవసరమైన షెల్టర్లు, త్రాగునీరు, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పబ్లిక్ అడ్రస్ సిస్టమ్,ఎల్ ఇ డి స్క్రీన్ల ద్వారా ప్రచారం కల్పించాలని స్థానిక సంస్థలు, మున్సిపాల్టీలు ముందుజాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా పార్కుల వద్ద పక్షులు,వీధి జంతువుల కోసం నీటి సరఫరాను సమకూర్చాలని చెప్పారు. రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి.పంచాయితీరాజ్ శాఖల తరపున ప్రజలకు క్లోరినేట్ చేసిన త్రాగునీటిని సరఫరా చేయాలని, అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. అదేవిధంగా సమాచార శాఖ, మత్స్య, పశుసంవర్ధక శాఖ, రక్షిత మంచినీటి సరఫరా, అటవీ, విద్యుత్ శాఖల అధికారులకు మార్గదర్శనం చేశారు. ఈ సమావేశంలో విపత్తుల నిర్వహణాశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, ప్రణాళికా శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఫైర్ సేఫ్టీ డీజీ నాగిరెడ్డి, ఐ పిఆర్ కమీషనర్ వినయ్‌కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ ,గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ ,మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శి శ్రీదేవి, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ సృజన,తెలంగాణ ఐఎండి విభాగాధిపతి డాక్టర్ నాగరత్న,జిహెచ్ ఎం సీ కమీషనర్ ఆర్‌వి కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రానికి దిక్సూచి

>> దాడి జరిగి చాలా రోజులు గడుస్తున్నప్పటికీ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా నిరోధించేందుకు ప్రభుత్వం వద్ద స్పష్టమైన వ్యూహం కొరవడిందని ఎఐసిసి అధ్యక్షుడు మల్లి కార్జున ఖర్గే అన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన సిడబ్ల్యూసి సమావేశంలో ప్రధానంగా రెండు అంశాలపై చర్చించినట్లు ఖర్గే తెలిపారు.
జనగణనతో పాటు కులగణనపై తమ డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం అంగీకరించడంపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు. ప్రజా సమస్యలపై నిజాయతీగా పోరాడితే, మొండి ప్రభుత్వమైనా తలవంచక తప్పదని రాహుల్ గాంధీ నిరూపించారని పేర్కొన్నారు. అయితే, కులగణన ప్రక్రియ పూర్తయ్యేంత వరకు పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతించినప్పటికీ, దానిని ప్రకటించిన సమయం మాత్రం ఆశ్చర్యానికి గురిచేసిందని ఖర్గే వ్యాఖ్యానించారు. తమ పార్టీ డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గిందని, అయితే ఈ నిర్ణయం వెనుక ఉద్దేశాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన అన్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతర పరిస్థితులు, భద్రతా వైఫల్యాలపై కూడా సమావేశంలో చర్చించినట్లు వెల్లడించారు.దేశ ఐక్యత,సమగ్రతకు భంగం కలిగించే ఉగ్రవాద చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని,ఉగ్రవాదంపై పోరులో కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీతో పాటు విపక్షాలన్నీ మద్దతుగా నిలుస్తాయని మరోసారి స్పష్టం చేశారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను రాహుల్ గాంధీ పరామర్శించారని గుర్తుచేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని, మృతులకు అమరవీరుల హోదా కల్పించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేసినట్లు ఆయన తెలిపారు. దేశ భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఉగ్రవాదాన్ని సమష్టిగా ఎదుర్కోవాలని సీడబ్ల్యూసీ అభిప్రాయపడినట్లు ఖర్గే వివరించారు.
జన గణనలో కుల గణనకు తెలంగాణ మోడల్ ను పరిగణనలోకి తీసుకోవాలని అఖిల భారత కాంగ్రెస్ అత్యున్నత నిర్ణాయక మండలి అయిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సిడబ్ల్యుసి కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానం చేసిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ట్విట్టర్ వేదికగా తెలిపారు.నాలుగు గోడల మధ్య, నలుగురి ఆలోచనలతో కాక, మొత్తం పౌర సమాజం, తెలంగాణ మేధావులు, వివిధ కుల సంఘ నాయకులు, విద్యావేత్తల నుండి అత్యంత పారదర్శకంగా సలహాలు, సూచనలు స్వీకరించి శాస్త్రీయంగా తెలంగాణ ప్రభుత్వం కుల గణన చేపట్టిన విషయాన్ని సిడబ్ల్యుసి తన తీర్మానంలో ప్రస్తావించిందని తెలిపారు. ఇది తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం ఒక గొప్ప సామాజిక విప్లవానికి నాంది పలికే ప్రక్రియ విషయంలో దేశానికే తెలంగాణ రోల్ మోడల్‌గా నిలవడం నాకెంతో గర్వంగా ఉంది' అని పేర్కొన్నారు. అత్యద్భుతంగా, అత్యంత పారదర్శకంగా కుల గణన నిర్వహించి తెలంగాణ ప్రతిష్ఠను దేశ స్థాయిలో చాటిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా మరొక్కసారి అభినందనలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

# 'అమరావతి'

>> వికసిత్ భారత్‌కు నిదర్శనం. అమరావతి స్వప్నం సాకారం అవుతున్నట్లు కనిపిస్తోంది. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభ సంకేతం. అమరావతి ఒక నగరం కాదు, అమరావతి ఒక శక్తి. ఒక కొత్త అమరావతి, కొత్త ఆంధ్రప్రదేశ్. ఇప్పుడు నేను పుణ్యభూమి అమరావతిపై నిలబడి ఉన్నా. చంద్రబాబు నా టెక్నాలజీ వాడకం గురించి చెప్పారు. మొత్తంగా రూ.57,962 కోట్ల ప్రాజెక్టులకు ప్రధాని మోడి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. గత పదేళ్లలో భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటిగా నిలిచింది. ఎపిలో కనెక్టివిటీకి ఒక కొత్త అధ్యాయం మొదలవ్వబోతోంది. అమరావతిని వికసిత్ భారత్ గ్రోత్ ఇంజిన్‌గా మార్చాలి. అమృత్ భారత్ కింద చాలా రైల్వే స్టేషన్లను ఆధునీకరించాం. పోలవరాన్ని వేగంగా పూర్తి చేయడానికి సహకారమందిస్తాం. శ్రీహరికోట నుండి జరిగే ప్రయోగాలు, దేశం మొత్తాన్ని గర్వపడేలా చేస్తున్నాయి. రైతులకు ఎలాంటి సమస్య ఉండకూడదనేది మా ఉద్దేశం 2009-14 వరకు ఉమ్మడి ఎపికి రూ.900 కోట్ల కంటే తక్కువ బడ్జెట్ ఉండేది. ఇప్పుడు ఒక్క ఎపి రైల్వే బడ్జెట్ రూ.9 వేల కోట్లపైనే ఉంది. ఎన్టీఆర్ వికసిత ఏపీ కోసం కలగన్నారని దానిని మనందరం నిజం చేయాలి ప్రధాని మోడీ అన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలిచిందని అన్నారు. ఒకప్పుడు ఆంధ్రా, తెలంగాణ రైల్వే ప్రాజెక్టులకు కలిపి కేవలం 900 కోట్లలోపే అన్నారు.ఇప్పుడు కేవలం ఏపీకే 9వేల కోట్ల నిధులు ఇచ్చాం అన్నారు. గతానికంటే పది రెట్లు అధికంగా నిధులు కేటాయించామన్నారు. గత పదేళ్ల లో ఏపీలో 750రైల్వే బ్రిడ్జిలు, అండర్ పాస్‌లు నిర్మించాం అన్నారు. ఏపీలో 70కి పైగా రైల్వేస్టేషన్లను అమృత్ భారత్ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేస్తున్నామన్నారు. మౌలిక వసతుల కల్పనతో ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందన్నారు.

**ప్రధానికి ఘన సన్మానం:**

అమరావతి రాజధాని పునః నిర్మాణ పనులకు విచ్చేసిన ప్రధాని నరేంద్రమోడీకి సభా వేదికపై ఘన సన్మానం జరిగింది. ఆయనకు ధర్మవరం నేసిన పట్టుకండువాను ఏపీ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ కప్పి సత్కరించారు. అమరావతి నగర నేపథ్యం ఉన్న కలంకారీ జ్ఞాపికనుఅందజేసారు. ఈ సభావేదికపై మంత్రులు పి,నారాయణ, సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్, కేంద్ర మంత్రులు కె.రామ్మోహననాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖం, శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ(సుజన) చౌదరి, తెనాలి శ్రావణ్‌కుమార్,వేదికపైకి వచ్చే ముందు మండలి బుద్దప్రసాద్ తదితరులతో ప్రధాని కరచాలనం చేసారు.అమరావతి పునర్ నిర్మాణ పనులు అనంతరం ఆయన విజయవాడ విమానాశ్రయం చేరుకున్నారు.ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లారు.

## వారం - వర్జ్యం

తేదీ : 03-05-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
షష్ఠి ఉ.7.54
పునర్వసు మ.12.39
వర్జ్యం రా.8.45-10.22
దు.ఠ.5.42-ఉ.7.21
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం** : దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం సంతోషం కలి గిస్తుంది. ఆకస్మిక ధన, వస్తు, లాభాలు పొందుతారు.

**వృషభం** :వ్యవహారాలు విజయవంతంగా పూర్తిచేస్తారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు.

**మిథునం**: వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో మరింత ప్రోత్సాహం పొందుతారు.

**కర్కాటకం**: బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆలయాలు సందర్శిస్తారు.

**సింహం**: పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు.

**కన్య** :ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. వృత్తి, వ్యాపారాలలో తొందరపాట వద్దు..

**తుల** : ఉద్యోగాలలో గందరగోళంగా ఉంటాయి. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**వృశ్చికం**: ఆర్థిక ఇబ్బందులు తొలుగుతాయి. చిన్ననాటి మిత్రుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు.

**ధనుస్సు**:వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పొందుతారు.

**మకరం**: వ్యవహారాలలో స్వల్ప అవాంతరాలు ఏర్పడిన అధిగమించి ముందుకు సాగుతారు. వస్తుకొనుగోలు.

**కుంభం**: అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**మీనం** : బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగాలలో చిన్న చికాకులు తప్పవు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



చార్‌ధామ్ యాత్రలో భాగంగా శుక్రవారం ఉత్తరాఖండ్‌లో కేదార్‌నాథ్ మందిర్‌లో ప్రత్యేక పూజల అనంతరం యాత్రికులకు అభివాదం చేస్తున్న సిఎం పుష్కర్‌సింగ్ థామీ దంపతులు

# రాష్ట్ర రహదారులను హైవేలుగా ప్రకటించండి: కేంద్ర మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, మే 2 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్యమైన కొన్ని రాష్ట్ర రహదారులను జాతీయ రహదారి హోదాను ప్రకటించాల్సిన అవసరం ఉందని కేంద్రం హోంశాఖ సహాయ మంత్రి కేంద్ర మంత్రి నితిన్ గడ్కారిని కోరారు. ఈమేరకు శుక్రవారం నితిన్ గడ్కారికి ఒక లేఖ రాసారు. తన లోక్‌సభ నియోజకవర్గమైన కరీంనగర్‌లో ఈ మార్పు అవసరం ఉందన్నారు. ప్రాంతీయ అనుసంధానాన్ని, ఆర్థిక అభివృద్ధిని, ప్రజలకు, వస్తు రవాణా మెరుగుపరచడానికి కీలకమైందన్నారు. పలు రహదారులను కొత్త జాతీయ రహదారులుగా ప్రకటించాలని కోరారు. కరీంనగర్ (ఎన్‌హెచ్-563 (అంతర్‌ముఖం) - సిరిసిల్ల -కామారెడ్డి - ఎల్లారెడ్డి - పిట్లం (ఎన్‌హెచ్161) రహదారి (మొత్తం పొడవు: 165 కిమీ), సిరిసిల్ల (ఎన్‌హెచ్ 365బి) - వేములవాడ - కోరుట్ల రహదారి (మొత్తం పొడవు: 65 కిమీ), రాయపూర్ నుంచి హైదరాబాద్ వరకు గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌పై సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్)ను అత్యుత్తమ ప్రాధాన్యతతో సిద్ధం చేయాల్సిందిగా లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య అనుసంధానాన్ని గొప్పగా మెరుగుపరుస్తుందన్నారు. (తెలంగాణలో ప్రతిపాదిత పొడవు-280 కిమీ) ఈ రహదారులు ముఖ్యమైన ఆర్థిక, తీర్థ యాత్రప్రాంతాలకు ప్రాధాన్యతగా ఉంటుంది. వీటిని జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయడం వలన మెరుగైన మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల ఆకర్షణ, లక్షల మంది పౌరులకు లాభం కలుగుతుందని లేఖలో పేర్కొన్నారు. వీటికి డిపిఆర్ సిద్ధం చేయడం, ప్రాజెక్టుల అమలుకు సంబంధిత పరిపాలన ఆమోదాలు తక్షణమే మంజూరు చేయాలని కోరుతున్నాను. ఈ ప్రతిపాదనను వేగవంతం చేయాలంటూ లేఖలో పేర్కొన్నారు.

# గ్రూప్-1 నియామకాలకు బ్రేక్

>> జోక్యం చేసుకోలేమని.. సింగిల్ బెంచ్ దగ్గరే విచారణ కొనసాగించుకోవాలని సూచించారు. దీంతో గురువారం సింగిల్ బెంచ్ దగ్గర వాదనలు జరిగాయి. అయితే గురువారం వాదనలు పూర్తి కాకపోవడంతో.. శుక్రవారం వాదనలు కొనసాగాయి. శుక్రవారం పిటిషనర్ల తరఫు న్యాయవాది రచనా రెడ్డి, టిజిపిఎస్‌సి తరఫున న్యాయవాది రాజశేఖర్ తమ వాదనలు వినిపించారు. రీకౌంటింగ్‌లో ఒక అభ్యర్థికి 60 మార్కులు తగ్గాయని రచనా రెడ్డి కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అందుకు స్పందించిన హైకోర్టు ఆ అభ్యర్థి పత్రాలు కోర్టుకు సమర్పించాలని టిజిపిఎస్‌సిని న్యాయమూర్తి ఆదేశించారు. తదుపరి విచారణలో పత్రాలు సమర్పిస్తామని కమిషన్ తరఫు న్యాయవాది కోర్టుకి తెలిపారు. సమ్మర్ వెకేషన్‌లోగా స్టేపై నిర్ణయం తీసుకోవాలని డివిజన్ బెంచ్ చెప్పిందని టిజిపిఎస్‌సి తరఫున న్యాయవాది కోర్టుకు తెలిపారు.. అందుకు విచారణను వేగంగా ముగించలేమని జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు తెలిపారు. వేలాది మందికి సంబంధించిన విషయం కాబట్టి తొందరపడవద్దని, వెంటనే తీర్పు కావాలని ఒత్తిడి చేయవద్దని టిజిపిఎస్‌సికి సూచించారు. తదుపరి విచారణను జూన్ 11వ తేదీకి వాయిదా వేసింది. జూన్ 11 వరకు మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది.

# అధ్యయన కమిటీ

>> దంలో ఉన్నాయని జాతీయ ఆనకట్టల భద్రత అథారిటీ (ఎన్‌డీఎస్‌ఎ) స్పష్టం చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల యథాతథంగా పనికిరావు అని పేర్కొంది. నష్టం అంచనాకు ఏలాంటి వీలు లేకుండా గ్రౌటింగ్ చేసి క్షేత్రస్థాయిలో కృత్రిమంగా మార్పులు చేయడం పట్లకూడా ఇరిగేషన్ శాఖపై ఆగ్రహం వ్యక్తంచేసింది. సమగ్ర పునరుద్ధరణ, రీడిజైన్ చేయాల్సిందేజియో ఫిజికల్ పరీక్షలు చేయకుండానే నిర్మించారని నివేదించారు. మేడిగడ్డలో ఏడో బ్లాకును పూర్తిగా తొలగించాలని సూచించారు. కుంగడానికి ప్రధాన కారణం నిర్మాణ, నాణ్యతా లోపాలే అని పేర్కొన్నారు. సీకెంట్ పైల్స్ అమరిక సరిగాలేకే ఇసుక జారిందని మెల్‌ఫిమేల్ బ్లాకులు సరిగా పెనవేసుకోలేదని వాటిని 24 గంటల్లో నిర్మించాల్సి ఉండగా అత్యధిక సమయం తీసుకొన్నారని సూచించారు. భూ పరీక్షలు లేకుండానే అన్నారం, సుందిళ్ల స్థలాల మార్పుజాతీయ డ్యామ్ భద్రత ప్రాధికార సంస్థ నివేదికలో వెల్లడించారు. ఈ బ్యారేజీలకు జరిగిన విస్తృత, పెను నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని...సమగ్ర పునర్‌నిర్మాణం, రీడిజైన్ చేయాలని పేర్కొంది. నిర్మాణ లోపాలు, డిజైన్ లోపాలు, నాణ్యత తనిఖీ లేకపోవడం, నీటి ఒత్తిడి ఎంత అన్నదానిపై తప్పుడు అంచనాలు... అన్నీ కలిసి సీకెంట్ పైల్స్ కూలిపోవడం, బ్యారేజ్ ఎగువ, దిగువల్లో రంధ్రాలు పడ్డాయని తేల్చింది. మూడు బ్యారేజీలకు విస్తృత, పెను నష్టం జరిగిందని పేర్కొంది. ఈ నష్టం ఇక్కడితోనే ఆగదని, నీటి ఒత్తిడి ఎక్కువైతే మొత్తం పూర్తి బ్యారేజీలకే ప్రమాదమని పేర్కొంది.
మూడు బ్యారేజీల్లోని ప్రతి ఒక్కటి ఈ ప్రమాదపుటంచులో ఉంటాయని తెలిపింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు దెబ్బతిన్న నేపథ్యంలో ఏం చేయాలన్న దానిపై ఎన్‌డీఎసఏను నివేదిక ఇవ్వాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం గతంలో కోరిన సంగతి తెలిసిందే. పలు పరీక్షలు చేసిన అనంతరం, దాదాపు 14 నెలల అధ్యయనం తర్వాత ఎన్‌డిఎస్‌ఎ తన నివేదికను ఏప్రిల్24న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి పంపించింది. నివేదికలో అనేక కీలక సిఫార్సులు చేసింది. సమగ్ర పునర్ నిర్మాణ డిజైన్ చేయాలని, జియో ఫిజికల్ పరీక్షలు, జియో టెక్నికల్ పరీక్షలు చేసి, ఆధునిక హైడ్రాలిక్ నమూనాను ఉపయోగించి ఈ పునర్ నిర్మాణ రీడిజైన్ చేయాలని చెప్పింది. కాళేశ్వరం ప్రాజెక్టు స్థిరత్వం, స్థితిస్థాపకతను నిర్ధారించేందుకు... అన్ని విభాగాల మధ్య సహకారం చాలా కీలకమని స్పష్టం చేసింది. నిర్మాణ సమయంలో నాణ్యతను తనిఖీ చేసే మంచి వ్యవస్థ లేదని, ప్రత్యేకించి కటాఫ్ గోడలు నీటి ఒత్తిడిని తట్టుకునేలా నిర్మించలేదని తెలిపింది. ర్యాఫ్ట్‌కు, కటాఫ్ వాల్స్‌కు నేరుగా సంబంధం ఉందని చెప్పింది. బ్యారేజీలు దెబ్బతినడానికి ఈ రెండూ ప్రధాన కారణాలని తెలిపింది. బ్యారేజీపై అదే ఒత్తిడి పడితే మొత్తం బ్యారేజీ అంతా ప్రమాదంలో పడుతుందని వెల్లడించింది. మిగతా రెండు బ్యారేజీల పరిస్థితి కూడా అదే విధంగా ఉన్నట్లు తెలిపింది. కేబినెట్‌లో చర్చించి బాధ్యులపై చర్యలు ఉంటాయని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కూడా ఇప్పటికే స్పష్టంచేశారు.

# ముందస్తు బెయిల్ పిటిషన్ డిస్మిస్

>> కాలో వుంటూ దాఖలు చేసిన ముందస్తు బెయిల్‌ను హైకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. గత ఏడాది మార్చి నెలలో వెలుగు చూసిన ఈ కేసులో ముగ్గురు పోలీసు అధికారులతో పాటు మరో మాజీ పోలీసు అధికారి అరెస్టయి పది నెలల పాటు జైల్లో వుండి బెయిలుపై విడుదలవడం తెలిసిందే. అయితే ఈ కేసులో మొదటి ముద్దాయిగా వున్న ప్రభాకర్ రావు, ఆరవ ముద్దాయిగా వున్న మీడియా అధినేత శ్రవణ్ రావులు ముందుగానే అమెరికాకు వెళ్లిపోవడం విదితమే. వీరిద్దరిని అమెరికా నుంచి భారత్‌కు రప్పించేందుకు రాష్ట్ర పోలీసులు సిబిఐ సహకారంతో ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించి రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయించినా ఫలితం లభించలేదు. చివరగా నెల రోజుల క్రితం శ్రవణ్‌రావుకు సుప్రీం కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో ఆయన అమెరికా నుంచి భారత్‌కు వచ్చి నాలుగుసార్లు పోలీసుల విచారణకు హాజరయ్యారు. శ్రవణ్ రావుకు ముందస్తు బెయిల్ ఇచ్చినట్లే తనకు కూడా ఇవ్వాలని ప్రభాకర్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన ఆరోగ్యం సవ్యంగా లేదని, తాను క్యాన్సర్ బాధితుడినని, ఫోన్ ట్యాపింగ్ కేసులో తాను నిరపరాధినని, అన్యాయంగా తనను ఇందులో ఇరికించారని ప్రభాకర్ రావు వాపోయారు. అయితే ప్రభాకర్ రావు తరపున దాఖలైన పిటిషన్‌ను డిస్మిస్ చేయాలని పోలీసు శాఖ తరపున వాదించిన పబ్లిక్ ప్రా సిక్యూటర్ వాదించారు. ఈ కేసులో ప్రభాకర్ రావు ముమ్మాటికీ దోషి అని, పోలీసు శాఖ వద్ద దీనికి సంబంధించిన అన్ని ఆధారాలు వున్నాయని ఆయన వాదిం చారు. దీనిపై దాదాపు నెల రోజులుగా హైకోర్టులో సాగిన వాదనలు శుక్రవారం ముగిశాయి. చివరగా దీనిపై హైకోర్టు తుది తీర్పు ఇస్తూ ప్రభాకర్ రావు ముంద స్తు బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ప్రభాకర్ రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడంతో ఆయనను అరెస్టు చేసే విషయంలో పోలీసులకు మరింత ఊతం లభించింది. ఈ విషయంలో పోలీసులు ఎలా వ్యవహరిస్తారనేది చూడాల్సి వుంది.

## రెండు కేసుల్లో 2.78 కేజీల గంజాయి పట్టుకున్న ఎస్‌టిఎఫ్ అధికారులు

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** పురానాపూల్ ప్రాంతం జియాగూడ ప్రాంతాల్లో ఎస్టీఎఫ్ ఏ టీమ్ నిర్వహించిన దాడుల్లో 2.078 కేజీల గంజాయిని పట్టుకున్నారు. స్కూటీపై గంజాయిని అమ్మడానికి తీసుకెళుతుండగా ఎస్టీఎఫ్ టీమ్ పట్టుకున్నారని టీమ్‌లీడర్ అంజిరెడ్డి తెలిపారు. గంజాయితోపాటు టీవీఎస్ స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సంజయ్‌సింగ్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో ముగ్గురిపై కూడ కేసు నమోదు చేశామన్నారు.ఈ ముగ్గురిలో ఠాకూర్ అజిత్ సింగ్, లక్ష్మణ్‌సింగ్, నిరంజన్‌రెడ్డి ఉన్నారు.మరో కేసులో..ముసాపేట్ జేపీ, భరత్‌నగర్ ప్రాంతాల్లో ఎస్టీఎఫ్ డి టీమ్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కొంపల్లి యశ్వంత్‌సాయి షణ్ముఖ వద్ద 1.20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీ టీమ్ ఎస్సై జ్యోతి తెలిపారు. నిందితుడి వద్ద నుంచి గంజాయి, ఒక బైక్, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. నిందితుడు గతంలో కారునాలా అనే వ్యాపారం చేసేవాడని ఆ వ్యాపారం బంద్ చేసి వారి బంధువుల ఇంట్లో ఉంటూ అరకు వెళ్లి గంజాయి తీసుకొని వచ్చి హైదరాబాద్‌లో అమ్మకాలు జరుపుతుంటాడని ఎస్సై తెలిపారు.

## పత్తి కొనుగోళ్లలో అక్రమాలు

### విచారణలో వెలుగులోకి వ్యవసాయ అధికారుల పాత్ర

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** పత్తి కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో తీగ లాగితే డొంక కదులుతోంది. రాష్ట్రంలోని ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో పెద్దఎత్తున పత్తి అక్రమ కొనుగోళ్లు జరిగిన ఉదంతంపై విజిలెన్స్‌అధికారులు ఆధారాలను సేకరిస్తున్నారు. సస్పెన్షన్‌కు గురైన మార్కెటింగ్‌శాఖ అధికారులను విచారించి అక్రమాలు జరిగిన తీరును తెలుసుకుంటున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులతోపాటు పలువురు వ్యవసాయాధికారులు, విస్తరణాధికారుల పాత్ర ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. రైతులకు తెలియకుండా వారి పేర్లపై పత్తి అమ్మకాలు చేసి అక్రమాలకు పాల్పడిన విషయమై వచ్చిన ఫిర్యాదులపై దృష్టిసారించింది. పత్తి సాగు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంతో పాటు, నకిలీ టీఆర్ తాత్కాలిక రిజిస్ట్రేషన్ పుస్తకాలు ముద్రించి జిన్నింగ్ మిల్లర్లకు అప్పజెప్పటం, ఒక మండలంలో పనిచేస్తూ మరో మండలానికి చెందిన రైతుల పేరిట ధ్రువపత్రాలు ఇవ్వడం వంటి పలు అక్రమాలు జరిగినట్లు గుర్తించింది. ఈ అవినీతి అక్రమాల్లో కొందరు వ్యవసాయ శాఖ ఏఈవోలు, ఏవోల పాత్ర ఉన్నట్లు బయటపడింది. వ్యవసాయ శాఖ జారీ చేసిన వేలాది సాగు ధ్రువీకరణ పత్రాలతో రైతుల నుంచి తక్కువ ధరకు పత్తి కొని, కనీస మద్దతు ధరకు సీసీఐకు అమ్మి అక్రమాలకు పాల్పడ్డారు. ఆదిలాబాద్ జిల్లాలో పత్తి సాగు చేసిన విస్తీర్ణానికి మించి విక్రయాలు జరిగాయి. పంటల నమోదు పోర్టల్‌లో పేర్లు లేని రైతులు సీసీఐకి పత్తి విక్రయించాలంటే వ్యవసాయ విస్తరణాధికారులు టీఆర్ ధ్రువపత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే ఆదిలాబాద్ జిల్లాలో రైతులతో సంబంధం లేకుండా కొందరు మిల్లర్లు పత్తిని సీసీఐకి విక్రయించుకునేందుకు వీలుగా వివిధ ప్రాంతాల్లోని రైతుల పేరిట టీఆర్‌లు జారీ చేసినట్లు ప్రాథమికంగా విచారణలో తేలింది. అలాగే కొత్తగూడెం జిల్లాలోని ఒక ఏఈవో ప్రభుత్వం పంపిన తాత్కాలిక రిజిస్ట్రేషన్ పుస్తకాలు కాకుండా, స్థానిక ప్రింటింగ్ ప్రెస్‌లో తానే టీఆర్ పుస్తకాలు ముద్రణ చేయించి, జిన్నింగ్ మిల్లర్లకు సంతకాలు చేసి ఇచ్చినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. కొత్తగూడెం జిల్లాకు చెందిన రైతుల పేరుతో సిద్దిపేట జిల్లాలో పత్తి అమ్మకాలు జరిగాయి.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న స్టేట్ నోడల్ ఆఫీసర్ చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్.

## ప్రజావాణికి అందిన దరఖాస్తులు 251

**హైదరాబాద్ (బేగంపేట) మే 2, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 251 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 75 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు సంబంధించి 23 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 46 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణికి 5, ఇందిరమ్మ ఇళ్ల కోసం 41 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 61 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# వ్యవసాయ కార్పొరేషన్లకు చెక్

### ఒకే గొడుగు కిందకు తెచ్చే ఆలోచన

### కొన్నింటిని మూసివేసే అవకాశం

### వ్యవసాయ సంస్థలపై సర్కార్ అసంతృప్తి

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వివిధ కార్పొరేషన్ల న్నింటినీ కలిపి ఒకే కార్పొరేషన్‌గా చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే వ్యవసాయ శాఖ కసరత్తు మొదలు పెట్టింది. ఈ జాబితాలో ఆగ్రోస్, హాకా, హార్టి కల్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడ్ కార్పొరేషన్, సీడ్ సర్టిఫికేషన్, గిడ్డంగుల కార్పొరేషన్ ఉన్నట్లుగా సమాచారం. కాగా వ్యవసాయ శాఖ అనుబంధ కార్పొరేషన్ల పనితీరుపై రాష్ట్ర సర్కార్ తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని కార్పొరేషన్లతో రాష్ట్ర ఖజానాకు నయా పైసా లాభం లేదని, దీ సమయంలో రైతులకు కూడా పెద్దగా ఉపయోగపడినా దాఖలాలు లేవనే అభిప్రాయంలో ఉంది. మరీ ముఖ్యంగా ఆగ్రోస్, హాకా, సీడ్ కార్పొరేషన్, సీడ్ సర్టిఫికేషన్, గిడ్డంగుల కార్పొ రేషన్ల పనితీరుపై ప్రభుత్వం సంతృప్తికరంగా లేదు. ఈ సంస్థలు అవినీతికి అడ్డాలుగా మారుతున్నాయనే అభిప్రాయము ప్రభుత్వంలో ఉన్నట్టు సమాచారం. దీంతోనే ఆయా సంస్థలను ప్రక్షాళన చేసేందుకు సిద్ధమవు తోంది. ఆయా సంస్థల లాభాలనష్టాలు, వాటి లావాదేవీల నిర్వహణ తదితర వాటిని పరిశీలిస్తోంది. ఒకవేళ వీటిని మూసివేస్తే వాటి పరిధిలో చేపట్టే పనులను ఏ కార్పొ రేషన్లకు అప్పగించాలనే అంశాన్ని పరిశీ లిస్తున్నట్లు సమాచారం. మరోపక్క ఈ ఆరు కార్పొరేషన్లు ఒక్కోటి ఒక్కో చట్టం ప్రకారం ఏర్ప డ్డాయి. దీనికి తోడు ఇప్పటికే వీటిలో కొన్నింటికి ఛైర్మన్లను కూడా నియమించారు. ఈ నేపథ్యంలో వీటి మూసివేత అంత సులువు కాదనే పలువురు అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడైంది. వ్యవసాయ శాఖ అనుబంధ కార్పొరేషన్ల పనితీరుపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. కొన్ని కార్పొరేషన్లతో ప్రభుత్వానికి నయా పైసా లాభం లేదనే అభిప్రాయం ఆయనలో ఉన్నట్టు తెలిసింది. దీంతో ఆయన తొలి నుంచి వ్యవసాయ శాఖ పరిధిలో ఇన్ని కార్పొరేషన్లు అవసరమా అంటూ ప్రతి సమావేశంలోనూ బహిరంగంగానే ప్రశ్నిస్తూ వస్తున్నారు. ఒకే రకమైన పనిని వివిధ కార్పొరేషన్లు చేయడంపైనా ఆయన అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది. దీనికి తగినట్లుగా ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఏ కార్పొరేషన్ కూడా సరిగ్గా పని చేయడం లేదని గుర్తించారు. మరీ ముఖ్యంగా ఆగ్రోస్, హాకా, సీడ్ కార్పొరేషన్, సీడ్ సర్టిఫికేషన్, గిడ్డంగుల కార్పొరేషన్‌పై అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది. పనితీరు మార్చుకోవాలని ఆయా సంస్థలకు మంత్రి పలుమార్లు హెచ్చరించారు, అయినా సదరు సంస్థలు మారకపోవడంతో మంత్రి ఆగ్రహంగా ఉన్నట్టు తెలిసింది.

ఈ సంస్థలు అవినీతికి అడ్డాలుగా మారుతున్నాయనే అభిప్రాయము ప్రభుత్వంలో ఉన్నట్టు తెలిసింది. దీంతోనే ఆయా సంస్థలను ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఆయా సంస్థల లాభానష్టాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఒకవేళ వీటిని మూసివేస్తే వాటి పరిధిలో చేపట్టే పనులను ఏ కార్పొరేషన్లకు అప్పగించాలనే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు సమాచారం.

# బలహీనవర్గాల అభ్యున్నతికి కులగణనతో బాటలు

### పిసిసి అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మంత్రి ప్రభాకర్‌గౌడ్

### గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసి

### ధన్యవాదాలు తెలిపిన కాంగ్రెస్ నేతలు



**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా బలహీనవర్గాల అభ్యున్నతికి కులగణనతో బాటలు వేయడమే కాకుండా సామాజిక న్యాయం,వనరుల పంపకంలో న్యాయమైన వాటా పొందడానికి వీలవుతోందని పిసిసి చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, బిసి సంక్షేమశాఖ మంత్రి ప్రభా కం "గౌడ్ అన్నారు. శుక్రవారంన పిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ నాయకత్వంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ విజయశాంతి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఇతర ప్రజా ప్రతినిధులు నాయకులు గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మను కలిసి ధన్యవాదాలు తెలిపారు. మహేష్‌కుమార్ మాట్లాడుతూ కులగణన క్రెడిట్ రాహుల్ గాంధీకే దక్కుతుంది. కేంద్రం జనగణనతో పాటు కులగణన చేపట్టాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తూ వచ్చారని ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వ విజయం అని అన్నారు. తెలంగాణ మోడల్ ను కేంద్రంలోని బీజేపీ అనిఅసరిస్తోందని మహేష్‌గౌడ్ అన్నారు. కుల గణన పై కేంద్రం నిర్ణయం తో రాహుల్ ఆశయం నెరవేరిందని తెలిపారు రాహుల్ గాంధీ ఆశయం మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల బృందం కులగణనను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించిందని తెలిపారు. బిసి సంక్షేమం రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలోని కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వం దేశానికి రోల్ మోడల్ గా బీసీ లకు రాజకీయ విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు చట్టం చేసిందిచట్టం కన్నా ముందు ఎంపెరికల్ డేటా ప్రామాణికమైన సమాచారాన్ని సేకరించి సబ్ కమిటీ వేసి కేబినెట్ అప్రూవల్ తీసుకొని శాసనసభ ఆమోదించుకొని చట్టాన్ని ప్రభుత్వానికి అనుమతి కొరకు కేంద్రానికి పంపే సందర్భంలో గవర్నర్ న్యాయ పరమైన అంశాలను పరిశీలించి రాష్ట్రపతికి పంపడం జరిగింది .తెలంగాణ లో తీసుకున్న కుల గణన రోల్ మోడల్ దేశ వ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం 2025 జన గణన లో కుల గణన చేస్తామని చెప్పడాన్ని స్వాగతిస్తున్నాం. దీనిపై విమర్శిస్తున్నారు ఆత్మ విమర్శ చేసుకోవాలి. గతంలో వ్యతిరేకించిన వారు ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వ ఆలోచనను కేంద్రం మార్గదర్శకత్వంగా తీసుకుంటే జీర్ణించుకోలేక విమర్శిస్తున్నారని అన్నారు.

## ఎరువుల సరఫరాకు ఒకే బిడ్

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** తెలంగాణలో ఎరువులకు సంబంధించి టెండర్లు వేసేందుకు సంస్థలు ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలోనే ఎరువుల స్టోరేజీ, రవాణాకు సంబంధించి టెండర్లు పిలువగా అందుకు ఒకే టెండర్ దాఖలైనట్లుగా సమాచారం. దీంతో ఈ ఒక్క టెండర్‌ను రద్దు చేయాలని తెలంగాణ మార్కెటింగ్ ఫెడరేషన్ (మార్క్‌ఫెడ్) నిర్ణయం తీసుకుంది. టెండర్లకు సంబంధించి తొలుత నిబంధనలు కఠినంగా పెట్టిన అధికారులు, ఆ తర్వాత కమిటీ సూచన, సంస్థల అభ్యర్థనతో సడలించింది. అయినప్పటికీ టెండర్లు వేసేందుకు సంస్థలు ముం దుకు రాకపోవడం గమనార్హం.

రాష్ట్రంలో 2025-26, 2026-27 సంవత్సరాలకు సంబంధించి రైతులకు ఎరువులు అందించేందుకుగానూ అవసరమైన నిల్వ, క్షేత్రస్థాయిలోకి రవాణాకు 22 రేక్ పాయింట్లకు మార్క్‌ఫెడ్ అధికారులు టెండర్లు పిలిచింది. ఇందులో భాగంగా వచ్చిన టెంబర్లకు సంబంధించి టెక్నికల్ బిడ్ ఓపెన్ చేయగా రెండు రేక్ పాయింట్లకు ఒక్క సంస్థ కూడా టెండర్ వేసేందుకు ముందుకు రాలేదని తెలుస్తోంది. మిగిలిన 20 రేక్ పాయింట్లకు కలిపి ప్రస్తుతం కొనసాగుతున్న ఒకే సంస్థ మళ్లీ టెండర్ దక్కించుకునేందుకు బిడ్‌ను దాఖలు చేసినట్టుగా తెలుస్తోంది.

నిబంధనల ప్రకారం ఒకే టెండర్ దాఖలైతే దానిని రద్దు చేయాల్సి ఉండడంతో దానిని రద్దు చేసి మరోసారి టెండర్‌కు వెళ్లాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించినట్టుగా అధికారవర్గాల ద్వారా వెల్లడైంది.



గుండెపోటుకు గురైన ప్రయాణికుడికి సిపిఆర్ చేస్తున్న వైద్యులు

## విమానాశ్రయంలో గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

**హైదరాబాద్ (శంషాబాద్) మే 2, ప్రభాతవార్త :** రాంచి నుండి శంషాబాద్‌కు వచ్చిన ప్రయాణికుడు శంషాబాద్ విమానాశ్రయంలో గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమా నాశ్రయంలో విమానం నుండి దిగి బయటకు వచ్చిన ప్రయాణికుడు పిల్లర్ నెంబర్ రెండు దగ్గర నిలబడి అక్కడికక్కడే గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడిని హైదరాబాద్‌లోని గోల్కొండ ప్రాంతానికి చెం దిన ఆజాద్‌గా పోలీసులు గుర్తించారు. ఆజాద్‌ను వెంటనే విమానాశ్రయంలోని అపోలో ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఆర్.జి.ఐ.ఏ పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో నూతన సిఎస్ రామకృష్ణారావు భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 2:** శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మర్యాద పూర్వకంగా కలిశారు. బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లోని స్పీకర్ నివాసానికి వెళ్లి రామకృష్ణారావు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి స్పీకర్ అభినందనలు తెలిపారు. తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ డా. వి నరసింహాచార్యులు కూడా ఈ మర్యాద పూర్వక భేటీలో పాల్గొన్నారు.



## నగరానికి చేరుకున్న మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్‌పర్సన్

### ఘనస్వాగతం పలికిన అధికారులు

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** మిస్‌వరల్డ్ పోటీలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్న విషయం తెలిసిందే. వీటిలో భాగంగా ఈ నెల 7 నుంచి 31 వరకు ఇందుకు సంబంధించిన పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో మొత్తం 120 దేశాల నుంచి యువతులు పాల్గొననున్నారు. ఈ క్రమంలోనే మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్పర్సన్, సీఈవో జూలియా ఈవేలిన్ మోర్లీ శుక్రవారర ఉదయం హైదరబాద్‌కు చేరకున్నారు. ఈ మేరకు ఆమెకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆమెకు అధికారులు సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. శనివారం నుంచి ఆమె మిస్ వరల్డ్ పోటీల ఏర్పాట్లను సమీక్షించనున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంతో ఈ భాగస్వామ్యం కుదుర్చుకోవడం ప్రపంచ ప్రేక్షకులకు రాష్ట్ర అద్భుత వారసత్వాన్ని చూపించడానికి ఉపయోగపడుతుందన్నారు. మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించడం గురించి మాత్రమే కాదు, మహిళలకు సాధికారత కల్పించడం, అందం పట్ల ఐక్యంగా ఉండే మన నిబద్ధత, స్థిరమైన ప్రభావాన్ని చూపుతాయని జూలియా అన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
బండ్లగూడ జాగీర్ మునిసిపల్ కార్పొరేషన్ యొక్క కార్యాలయం, రంగారెడ్డి జిల్లా
No. B/MC/E1/ADD/03/2025-26, కొటేషన్ ప్రకటన తేది: 02.05.2025
బండ్లగూడ జాగీర్ మునిసిపల్ కార్పొరేషన్‌లో మునిసిపల్ సాధారణ నిధుల క్రింద, క్రింది పనుల కొరకు ఏజెన్సీలు/ఫరమ్‌లు/కాంట్రాక్టర్‌ల నుండి కొటేషన్‌లు కోరబడుతున్నవి. 1) ఆ కార్పొరేషన్‌లో BJMC కార్యాలయం యొక్క మునిసిపల్ వాహనాల నిర్వహణ. 2) ఆ కార్పొరేషన్‌లో BJMC కార్యాలయం యొక్క మునిసిపల్ వాహనాలకు ఇన్సూరెన్స్ (రిన్యూయల్ / కొత్త). 1) కొటేషన్ దాఖలు ప్రారంభ తేది: 03.05.2025 ఉ.11.00 గం. 2) కొటేషన్ దాఖలు ముగింపు తేది: 05.05.2025 మ.03.00 గం. తదుపరి వివరాలు మరియు స్పష్టతలను బండ్లగూడ జాగీర్ మునిసిపల్ కార్పొరేషన్ మునిసిపల్ ఇంజనీర్ నుండి అన్ని పని రోజులలో కార్యాలయ వేళలలో పొందవచ్చును.
AEE 9121106496. సం/- కమిషనర్, బండ్లగూడ జాగీర్ మునిసిపల్ కార్పొరేషన్
DIPR.No.1251-PP/CL/Advt/1/2025-26, తేది: 02.05.2025

తెలంగాణ ప్రభుత్వం
ప్రభుత్వ ENT ఆసుపత్రి, కోటి, హైదరాబాద్ సూపరింటెండెంట్ వారి కార్యాలయం
Rc.No. T1/A1/ENT/2025/356, టెండర్ ప్రకటన తేది: 01.05.2025
ప్రభుత్వ ENT ఆసుపత్రి, కోటి, హైదరాబాద్ వద్ద AMC's యొక్క డెస్క్‌టాప్స్ కంప్యూటర్లు మరియు ల్యాప్‌టాప్స్ కొరకు పేరొందిన సర్వీస్ ప్రొవైడర్‌ల నుండి దిగువ సంతకందారులచే సీల్డ్ టెండర్లు కోరబడుతున్నవి. టెండర్ ఫారాలు నియమాలు మరియు నిబంధనలతోసహా సూపరింటెండెంట్ ప్రభుత్వ ENT ఆసుపత్రి, కోటి, హైదరాబాద్ వారి కార్యాలయం నుండి పొందవచ్చును. ఒక్కొక్క ఫారానికి 2000/- (రెండు వేలు మాత్రమే) (నాన్ రిఫండబుల్) చెల్లింపుపై ఏ పని రోజులలో అయినా ఉ.11.00 గం.కు సా.04.00 గం. మధ్య 05.05.2025 నుండి 12.05.2025 వరకు టెండర్ ఫారాలు విక్రయించబడును. టెండర్ యొక్క దాఖలకు చివరి తేది: 12.05.2025 సా.4.00 గం. వద్ద టెండర్లు తెరచు తేది: 13.05.2025 మ.2.00 గం. వద్ద.
సం/- సూపరింటెండెంట్, ప్రభుత్వ ENT ఆసుపత్రి, కోటి, హైదరాబాద్
DIPR.No.1183-PP/CL/Advt/1/2025-26, తేది: 02.05.2025

# అన్ని వర్సిటీల్లో డిగ్రీ పరీక్షలకు చర్యలు తీసుకోవాలి

### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

### ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌కు ఎస్‌ఎఫ్ఐ విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల సమస్యతో ఆగిన డిగ్రీ పరీక్షలను వెంటనే జరిగేలా చూడాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ రెడ్డి ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కాకతీయ, పాల మూరు, తెలంగాణ, శాతవాహన, మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ విద్యార్థుల పరిస్థితి గందరగోళంగా ఉందదని.. పరీక్షలు ఏప్రిల్ చివరి నాటికి పూర్తి కావాల్సి నప్పటికీ ఇంకా పూర్తి కాలేదన్నారు. ఇప్పటికే రెండు సార్లు వాయిదాలు వేసి.. మరలా పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించక పోవడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే జోక్యం చేసుకుని పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాల కిష్టారెడ్డిని కోరారు. ప్రభుత్వం స్కాలర్‌షిప్స్, ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకుంటే డిగ్రీ పరీక్షలకు సహకరించమని ఆయా యూనివర్సిటీ వైస్ ఛాన్సర్లకు ప్రైవేట్ డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు విన్నవించాయని.. కానీ ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో వారు మళ్ళీ పరీక్షలు జరపలేమని తెలిపారన్నారు. ఇటూ ప్రభుత్వం, అటూ యాజమాన్యాల వైఖరి వల్ల పేద విద్యార్థులు చదువులు నష్టపోతున్నారని ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోని ఈ 5 యూనివర్సిటీల పరిధిలో 4.80లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని.. వారిలో ఫైనల్ ఇయర్ వారు లక్ష మందికిపైగా చదువుతున్నారు. ఈ పరీక్షలు జరగకుంటే చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు నష్ట పోయే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో వివిధ ప్రవేశ పరీక్షలకు తేదీలు ప్రకటించిన నేపథ్యంలో.. డిగ్రీ ఫైనల్ ఇయర్ పరీక్షలు పూర్తి కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. తెలుగు యూనివర్శిటీలో ఈ మధ్యకాలంలో భర్తీ చేసిన పిహెచ్‌డి అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని.. వాటిని తక్షణమే రద్దు చేసి తిరిగి అర్హులైన వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలుగు యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్.. అర్హత లేనివారికి, ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఫుల్ టైం పిహెచ్‌డి అడ్మిషన్లు ఇచ్చారని ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# సామాజిక న్యాయం కవితకు ఇప్పుడు గుర్తుకువచ్చింది!

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** పందికొక్కుల్లా మీ పార్టీ నేతలు రాష్ట్రంపై పడి పది ఏళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకుంటున్నప్పుడు ఎమ్మెల్సీ కవిత కు సోయి రాలేదని సామాజిక న్యాయం ఇప్పుడు గుర్తుకు రావడం అధికారం దిగిపోయాక గుర్తుకు రావడం బాధాకరమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య విమర్శించారు. శుక్రవారం సిఎల్‌పి కార్యాయలంలో బీర్ల అయిలయ్య, విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రులు అన్ని మీ సామాజిక వర్గానికి రాలేదా అని ప్రశ్నించారు. కల్వకుంట్ల కవిత కు తెలంగాణ రాష్ట్రం పైనఇప్పటికైనా సోయివచ్చిందని ఆయన అన్నారు, కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా కవిత నిజాలు మాట్లాడారని కవితను కొనియాడారు. సామాజిక తెలంగాణ ఇంకా రాలేదని కవిత వ్యాఖ్యానించింది..రాష్ట్ర తలసరి ఆదాయం కవితకు ఇప్పుడు గుర్తుకు వచ్చింది.10 ఏళ్ల లో తన తండ్రి కేసీఆర్ చేసిన తప్పులు, అప్పులు ను కవిత ఏ నాడు ఎత్తి చూపించలేదుని విమర్శించారు. 10 ఏళ్ల రైతు బంధు పైన కవిత మాట్లాడలేదు అని ఆయన అన్నారు, నిజమైన రైతులకు రైతు బంధు అందడం లేదని ప్రతిపక్షంగా ఆ నాడు కాంగ్రెస్ మొత్తుకుంది భూమి లేని వారికి సాయంచేయాలని మేం ఆ నాడు అడిగితే పట్టించుకోలేదు. మా ప్రభుత్వం భూమి లేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సాయం అందిస్తోంది అని గుర్తుచేశారు. సామాజిక తెలంగాణ కోసం కులగణన చేస్తుంటే మీ నాన్న, అన్న ఎందుకు సర్వేలో పాల్గొనలేదని ప్రశ్నించారు. 10 ఏళ్లలో కార్మికులకు కవిత ఎందుకు అండగా నిలబడలేదు. ఆర్టీసీ కార్మికులు 50 రోజులు సమ్మె చేసి 30 మంది చనిపోతే ఎందుకు కవిత ఆ నాడు స్పందించలేదని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కులగణన పైన సోయి లేకుండా మాట్లాడుతున్నాడు!కాంగ్రెస్ గురించి తన స్థాయిని తగ్గించుక కిషన్ రెడ్డి మాట్లాడు తున్నారు. కులగణన చేయాలని ప్రధాని మోదీ నిర్ణయించడంతో తెలంగాణ బీజేపీ నేతలకు దిమ్మ తిరిగిపోయింది. రేవంత్ రెడ్డిని ప్రధాని మోదీ హీరో చేశారు. అందుకే బీజేపీ నేతలు బాధపడుతున్నారు..కులగణన తో దేశంలోనే రేవంత్ రెడ్డి హీరోలా నిలబడటాన్ని బీజేపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. బసి బిల్లును గవర్నర్ ఆమోదించి రాష్ట్రపతికి పంపడం మా తొలి విజయం అని ఆయన చెప్పారు.

GOVERNMENT OF INDIA : MINISTRY OF DEFENCE
EX-SERVICEMEN CONTRIBUTORY HEALTH SCHEME,
STATION HQ (ECHS CELL), SECUNDERABAD
Ph.: 7382361574 | E-mail : echsstnhqsecbad@gmail.com

EMPLOYMENT NOTICE

1. ECHS CELL, Headquarters Telangana and Andhra Sub Area invites applications to engage Medical, Para-Medical & Non-Medical Staff on contractual basis for a period of 12 Months for ESMs and Widows of Service Personnel and 11 Months for Civilian candidates at given locations of ECHS Polyclinics in Telangana and Andhra Pradesh.

| Appointment | Minimum Qualification | Salary (Rs) | Vacancies | Location of Vacancies (ECHS Polyclinics) |
|---|---|---|---|---|
| OIC Polyclinic | Graduate (Retired Defence Officers Drawing Pension from CDA) | 75,000/- | 02 | Eluru & Secunderabad-II |
| Medical Specialist | MD/MS in General Medicine | 1,00,000/- | 04 | Chittoor, Gidaluru, Gunturu & Secunderabad-I |
| Medical Officer | MBBS | 75,000/- | 07 | Chittoor, Eluru, Gunturu, Karimnagar, Secunderabad-I, Secunderabad-II & Vijayawada |
| Dental Officer | BDS | 75,000/- | 03 | Giddalur, Kadapa & Secunderabad-II |
| Dental Hygienist | Diploma in Dental Hyg/Class-I DH/DORA Course (Armed Forces) | 28,100/- | 12 | Anantapur, Eluru, Giddaluru, Golconda, Guntur, Kadapa, Khammam, Kurnool, Nellore, Secunderabad-I, Secunderabad-II & Sainikpuri |
| Pharmacist | B Pharmacy OR 10+2 with Science and Diploma in Pharmacy | 28,100/- | 03 | Eluru, Giddalur & Kurnool |
| Lab Technician | B Sc (Medical Lab Tech (MLT) OR 10+2 with Science and Diploma in Medical Lab Tech (DMLT) | 28,100/- | 07 | Chittoor, Eluru, Giddalur, Kadapa, Kurnool, Khammam & Nellore |
| Lab Assistant | DMLT/Class-I Lab Tech Course (Armed Forces) | 28,100/- | 03 | Giddalur, Secunderabad-I & Sainikpuri |
| Nursing Assistant | BSc Nursing, GNM/ Diploma/Class-I Nursing Assistant Course Cert from (Armed Forces) | 28,100/- | 01 | Nellore |
| Female Attendant | Literate | 16,800/- | 02 | Golconda & Secunderabad-II |
| Chowkidar | 8th Class or GD Trade for Armed Forces personnel | 16,800/- | 06 | Chittoor, Secunderabad-I, Secunderabad-II Vijayawada & Mahabubnagar |
| Driver | 8th Class/Class-I MT Driver (Armed Forces) | 19,700/- | 02 | Golconda & Sainikpuri |
| Safaiwala | Literate | 16,800/- | 04 | Guntur, Kurnool, Nellore & Vijayawada |
| Peon | 8th Class or GD Trade (Armed Forces) | 16,800/- | 01 | Vijayawada |

PLEASE READ ALL INSTRUCTIONS CAREFULLY

**(2) For Terms & Conditions, Application Form & Remuneration**: For qualifications, work experience and age limits, kindly see website www.echs.gov.in. Application Form can be downloaded from the website under **EMPLOYMENT OPPORTUNITIES.** For additional details, contact on Tele No 07382361574 & email ID : echsstnhqsecbad@gmail.com during working hours. Preference will be given to the Ex-Servicemen. **(3) Last Date of Receipt of Application as per Format Given at our Website.** Application as per format alongwith self attested photocopies of testimonials for educational qualification (with Mark Sheets), work experience, Registration Certificates, Discharge book & PPO) will be submitted to Officer-in-Charge, Station HQ ECHS Cell, HQ TASA, Near Rastrapati Nilayam, Secunderabad 500010, Telangana by **16 May 2025 (1800hours).** Any application received after **16 May 2025** will not be accepted. **Online applications will not be accepted.** (4) Interview Date, Timing & Venue : Date & Time of interview will be intimated to all Accepted applicant through email. (5) Candidates meeting the Qualitative Requirements will only be called for interview. Candidates must bring all the original educational certificates, along with work experience and discharge book, PPO, Service Records and two PP size colour photographs at the time of interview. No TA/DA is admissible.

**NOTE : CANDIDATES NOT SUBMITTING COMPLETE / INCORRECT DOCUMENT WILL NOT BE CALLED FOR INTERVIEW.**

వార్త

ధనం లేకపోయినప్పటికీ ఏవో కోర్కెలు కలవాడు, సమర్థత లేనప్పటికీ కోపించేవాడు వీరిరువురూ తమను తామే నాశనం చేసుకుంటారు.

-జి.ఇలియట్

# పునరంకితం

ఆరు కోట్ల ఆంధ్రుల కలలు సహకారమైన వేళ అమరావతికి మంచి రోజులు వచ్చాయి. ఆ ప్రాంత రైతులు ఇప్పుడు సంబరాలు చేసుకుంటున్నారు. ముక్కారు పంటలు పండే సుభిక్షమైన నేల ఎన్నో వాణిజ్య పంటలు పండుతూ పదేళ్ల క్రితం వరకు రైతుకు మంచి ఆదాయం తెచ్చిపెట్టింది. నవ్యాంధ్రను స్వర్ణాంధ్ర సంకల్పంతో 9ఏళ్లనాడు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాని మోడీ చేత శంకుస్థాపన చేయించారు. ఆ రోజు ప్రధాని దేశంలోని అన్ని నదుల నుండి పవిత్ర జలాలు, సుక్షేత్రాల మట్టినీ తీసుకొచ్చి సంకల్ప బలాన్ని అందించారు. ఎన్నో శుభసంకల్ప ప్రమాణాలతో నేల నింగీతుళ్ళిపడేలా కార్యక్రమాన్ని నిర్వహించినా, ఆ తర్వాత వచ్చిన పాలకులు మూడు రాజధానుల ప్రతిపాదన చేసి అమరావతి రైతురంగాన్నిఆందోళనలో ముంచారు. ఇటురైతుకు పంటలు పండించుకునే అవకాశమూ లేదు అలాఅని అంతకుముందు సంకల్పాలను నెరవేర్చనూ లేదు. ఏమైతేనే అమరావతిని అత్యంత వైభవ నగరంగా తీర్చిదిద్దాలన్న తపనతో ఆనాడు ప్రధాని మోడీ వేసిన శంకురాయిని పట్టించుకునేవారు లేకపోయారు. అమరావతి ప్రాంత యావత్ ప్రజానీకం ముక్తకంఠంతో అమరావతి నిర్మాణం కోసం సుక్షేత్రాలనిచ్చినా తమ త్యాగఫలాన్ని ఊరికేపోరాదని 1631 రోజులు సుదీర్ఘకాలం నిరాహార దీక్షలు చేపట్టారు. ఆంధ్ర దేశప్రజలు అదృష్టం ఏమోకానీ మళ్ళీ అమరావతి కలలు నిజమయ్యే రోజు రానే వచ్చింది. శుక్రవారం సాయంత్రం ప్రధాని మోడీ అమరావతి సంకల్పానికి పునఃప్రతిష్టంగావించారు. అమరావతి నిర్మాణంలో అత్యంత కీలకమైనవిగా భావిస్తున్న కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపన చేశారు. చారిత్రక పరంపర, ప్రగతి కలిసి ప్రయాణిస్తోందని, అమరావతి స్వప్నం సాకారమవుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సందర్భంగా మాట్లాడుతూ అన్నారు. ఇకపై కొత్త అమరావతిని, కొత్త ఆంధ్రప్రదేశ్‌ను చూడబోతున్నామన్న ఆశాభావాన్ని వ్యక్తం వేశారు. అమరావతి ఒక సమ్మిళిత శక్తిగాఉండడం స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి శుభ సంకేతంగా పేర్కొన్నారు. అమరావతికి ఇక ఎటువంటి ఆటంకం ఉండబోదని కేంద్రం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని, వికసిత్ భారత్‌కు అమరావతే గ్రోత్ ఇంజిన్‌గా పనిచేస్తుందని ప్రధాని భరోసా ఇచ్చారు.ఇరుగు పొరుగు దాయాది దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్న తరుణంలో కూడా అమరావతి సంకల్పాన్ని ప్రధాని పక్కన పెట్టలేదు. దేశ పురోగతి అనగానే అన్ని రంగాల అభివృద్ధిగా నమ్మే ప్రధాని మోడీ ఈ ఉదయం కేరళ రాష్ట్రంలోని విలింజమ్ ఎయిర్పోర్ట్‌ను ప్రారంభించారు. దాదాపు రూ.1.07 లక్షల కోట్ల పనులకు శుక్రవారం ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. వాటిలో ఒక్క అమరావతిలోనే ప్రధాన రూ.49,040 కోట్ల విలువైన పనులకు ప్రారంభం శంకుస్థాపనలు చేశారు. డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో నాగాయలంక మండలం గుల్లలమోదలో క్షిపణి టెస్టింగ్ రేంజ్‌ను కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు. సభావేదికపై నుంచి ఒకేసారి వర్చువల్ విధానంలో బటన్‌నొక్కి ప్రారంభించారు. జాతీయ రహదారులు రైల్వే విస్తరణ పనులు రూ.57వేల 962కోట్లతో చేపట్టారు. వీటిలో శాసనసభ, హైకోర్టు, సచివాలయం న్యాయమూర్తుల,పరిపాలన భవనాలు నిర్మిస్తారు. అంతేకాక 5200కుటుంబాలకు నివాస భవనాలు కూడా నిర్మించే ప్రతిపాదన ఉంది. వాటి నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాలు అన్నీ ఒకేసారి ఒకే వేగంతో పూర్తవుతాయని జనం విశ్వసిస్తున్నారు. తొలిసారి గతంలో 2015 అక్టోబర్ రెండో తేదీన ఉద్దండరాయునిపాలెంలో అమరావతి రాజధాని పనుల నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈసారి వెలగపూడిలో ఈ కార్యక్రమం చేపట్టటం విశేషం. ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతి నిర్మించాలని సంకల్పం నెరవేరితే ఆంధ్రప్రదేశ్‌అగ్రభాగాన ఉన్నట్లే. ఇప్పటికే రూ.30వేల కోట్ల పెట్టుబడులను అమరావతి నిర్మాణ కోసం ఆకర్షించారు. అమరావతి పున్నిర్మాణానికి ప్రపంచ బ్యాంక్ ద్వారా రూ.15 వేలకోట్లు ద్వారా అందింది.అప్పట్లో అమరావతి కోసం 58రోజుల్లోనే34,281 ఎకరాల భూసమీకరించారు. ఇవన్నీ ఇలా ఉండగా అమరావతికి అధీకృత గుర్తింపే లేదన్న విపక్ష ఆరోపణలను కొట్టిపారేస్తూ తాజాగా మరో ఆలోచన ఎవరికీ రానీయకుండా ఈసారి పాలకులు పకడ్బందీగా అమరావతిని శాశ్వతం చేస్తోంది. ఇక ఆంధ్రా జనానికి అమరావతిని దూరం చేసే ఏ ప్రయత్నానికి అవకాశం ఉండదు. సాక్షాత్తూ ప్రధాని నీళ్లు నిధులు ఇచ్చి పునఃప్రతిష్ట చేస్తున్న ఈ కార్యక్రమంలో అమరావతికి భూములిచ్చిన ఆయా గ్రామ సీమల రైతాంగం ఆకుపచ్చ కండువాలతో తండోపతండాలుగా వచ్చి సంఘీభావం ప్రకటించారు. శాతవాహనులు, ఇక్ష్వాకులు వంటి చారిత్రిక రాజవంశాలు పాలించిన ఈ ప్రాంత చరిత్రలో నేటి పాలకుల చిత్తశుద్ధి కూడా చిరస్థాయిగా నిలిచిపోయింది. గుంటూరు కృష్ణా జిల్లాలోని 29 గ్రామాల రైతులు తన సారవంతమైన భూములను రాజధాని నగర నిర్మాణానికి స్వచ్ఛందంగా ఇచ్చారు. అది నిజంగా వాళ్లు చేసిన త్యాగమే. 18 ప్రధాన ప్రాజెక్టులకు రెండు రైల్వేలైన్లను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎపి విధ్వంసం నుంచి విజయాల బాట పడుతోందని ఆనందం వ్యక్తం చేసారు. మూడేళ్ల తర్వాత అమరావతి పూర్తి కాగానే ప్రధాని నరేంద్ర మోడీ మళ్లీ వచ్చి ప్రారంభిస్తారని చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రపంచంలోని తొలి ప్రసిద్ధ రాజధానులలో అమరావతిని ఒకటిగా తీర్చిదిద్దాలన్న పాలకుల ఆకాంక్షలు తీరితే ఆంధ్రులను అదృష్టం వరించినట్లే!

చదరంగంలో మాదిరిగానే జీవితంలో కూడా ముందుచూపు ఎంతో అవసరం.



ఐ.జాన్సన్

జీవితంలో విజయం సాధించాలంటే మెట్లవైపు చూస్తూ ఉండక, వాటివైపు పయనం సాగించాలి.



మార్షల్

# ప్రజావాక్కు



### కుల గణనకు అధినాయక జయహే

కేంద్ర అధినాయకత్వం దేశవ్యాప్త కులగణనకు ఆమోదం తెలిపింది. చాలాఏళ్లగా బీజేపీ మినహా మిగతా పక్షాలన్నీ కులగణన చేపట్టాలని కోరుతూ వస్తున్నాయి.అయితే అధికార పక్షం అందుకు వ్యతిరేకంకావడంతో అది కార్యరూపందాల్చలేదు.తమ రాష్ట్రవిభాగాలు అందుకు సరేఅన్నా, రాష్ట్రీయ స్వయం సేవక్ కూడా సానుకూలంగా మాట్లాడినా, కేంద్రంలో బీజేపీ అధినాయకత్వం మాత్రం ఇన్నాళ్లు ససేమిరా అంది. ఇప్పుడు అనూహ్యంగా కులగణన చేపట్టాలనికేబినెట్ నిర్ణయంతీసుకోవడంవిశేషం. రాబోయే జనగణన (సెన్సస్,జనాభా లెక్కలు) స్వాతంత్ర్యం అనంతరం జరగబోయే తొలి కులగణనగా ఉండబోతోంది. ఈ నిర్ణయం ద్వారా బీజేపీ, ప్రతీ ఎన్నికల్లో కులగణనకు హామీ ఇస్తున్న ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ చేతి నుండి బలమైన ఎన్నికల ఆయుధాన్ని తీసుకున్నట్టే.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### పెరుగుతున్న కులాల పిచ్చి

నాడు కులాలు తమతమ వృత్తులను బట్టి ఏర్పడ్డాయి. నేడు పరిస్థితులు మారడంతోపాటు ప్రజల మనస్తత్వాలు కూడా మారిపోయాయి.కులాలను స్వీకరించే సాంప్రదాయం మరుగునపడిపోయింది. దాంతో ఆనాటి ఆచార వ్యవహారాలను, సాంప్రదాయాలను విశిష్టతలను విస్మరించి ఆధునిక వాదానికి ప్రజలు మొగ్గు చూపుతున్నారు. నేడు వృత్తుల దృష్ట్యా కులాల ప్రాధాన్యత తగ్గిపోయినా, ఇంకాకులాలను వినియోగించుకోవడం ఆత్మవంచనే అవుతుంది.అలాంటప్పుడు కొందరు ఇంకా ఈ కులాలను పట్టుకొని వేళ్లాడుతున్నారు. రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడం కోసం ఈ కులాలను వజ్రాయుధాలుగా వాడుకుంటున్నారు. కులాలపిచ్చిన రూపుమాపాలంటే, రాజకీయ పార్టీలు కులమతాలను తెరపైకి తీసుకురాకుండా ఉండాలి.

-కాయల నాగేంద్ర, హైదరాబాద్

### చక్కదిద్దాలి

జాతీయ స్థాయిలో సగటున 12 శాతం చిన్నారులు బడి చదువులకు మధ్యలోనే దూరమవుతున్నారు. కారణాలేమిటో పాలకులు గ్రహించి, పరిస్థితులు చక్కదిద్దాలి. చదువులకు దూరమవుతున్న చిన్నారులు పాఠశాలకు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

-మా. శ్రీ.రాజు, పాల్వంచ

### అవినీతిని నిరోధించలేమా?

నీతి ఎక్కడున్నదో ఎంత వెదికినా కానరాదు.కాని అవినీతి ఎందెందు వెతికి చూసినా అందందే కలదు. ఈ రోజుల్లో అవినీతి మాత్రమే రాజ్యమేలుతోంది. ప్రభుత్వాధికారులు అటు ప్రభుత్వాన్ని ఇటు ప్రజలను మోసంచేస్తున్నారు. ఇటువంటి అవినీతి తిమింగలాలుఎన్నోవలలో చిక్కుకున్నకొద్దీ మళ్ళీమళ్ళీ దొరకుతున్నాయి. కాళేశ్వరం ఇంజినీర్‌ఇన్ చీఫ్‌హరిరామ్ అవినీతి బరువు 200 కోట్లని తేలింది. రెండు తెలుగురాష్ట్రాల లోనూ ఈయన ఆస్తులు కూడబెట్టారట. కాళేశ్వరం పాజెక్ట వ్యయంలో దాదాపు ఏభైవేల కోట్లవిలువైన పనులు ఈయన పర్యవేక్షణలోనే జరిగాయని ప్రభుత్వం గుర్తించింది. ఈమెగా ప్రాజెక్టు బీటలు వారిందంటే నాణ్యమైన పని జరగనట్టే కదా. ఇందులో కాంట్రాక్టర్లకు కూడా భాగస్వామ్యం లేనిదే ఇంత అవినీతికి తావుండదు కదా. పూర్వ ప్రధాని రాజీవ్‌గాంధీ ఓ మాటన్నారు.ప్రజల కోసం వినియోగించమని ఇచ్చే రూపాయిలో వారికి చేరేది పది పైసలు మాత్రమేనని అన్నారు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### డాక్టరేట్ ఉద్యోగులు

గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయివరకు,అటెండర్ నుండి ఐఎఎస్ అధికారి వరకు, డాక్టరేట్ పట్టా పొందిన వారిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఆయాశాఖల పరిధిలోశాఖ అభివృద్ధికి సలహా సూచనలు స్వీకరించాలి. జిల్లావ్యాప్తంగా ఉన్న డాక్టరేట్ పట్టా పొందిన వారిని గుర్తించి ఒక టీమ్‌గా ఏర్పాటు చేసి ఆయా శాఖ పరిధిలో ఉన్నసమస్యలుఅధికారులకు తెలియజేసి పరిష్కరించే విధంగానిత్యం నివేదికలు తయారుచేయాలి. జిల్లా స్థాయి పర్యవేక్షణ చేయడానికిగాను వాహన సదుపాయాలు కల్పించాలి. ఆయాశాఖ పరిధిలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై అమలు విధానంపై అవగాహన చైతన్య కార్యక్రమాలను వీరి ద్వారా ప్రజలకు తెలియజేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

### ఉపాధి దొరకని గ్రామాలు

ఈ మధ్య కాలంలో పురపాలికల్లో ఎక్కువ గ్రామాలు విలీనం కావడంవల్ల ఉపాధిహామీ ఆపురపాలికల చుట్టూ పక్కల గ్రామాలలో ఉండడం లేదు. అయితే పట్టణాలలో కూడా పెద్ద నీటి కుంటల ఏర్పాటు చేయాలి. అలాగే ప్రభుత్వం సెర్ప్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ సెంటర్స్ ఫామ్ చేసి యువతకు అందులో శిక్షణ ఇస్తూనే రోజు వారి కూలి చెల్లించాలి.

-భారత అవినాష్, జనగామ

మన విని ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వికలాంగమో వీరస్వర్గమో!

**దేశవ్యాప్తంగా వేలాదిమంది అసువులు బాస్తుండగా, కోట్లాదిమంది అంగవైకల్యంతో జీవనాధారంకోల్పోయి జీవచ్ఛవాలుగా బతుకీడుస్తున్నారు. చేతికి అందివస్తున్న పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రుల గర్భశోకం, తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారినపిల్లల పరిస్థితి వర్ణనాతీతం. ఇప్పటికైనా ఆదాయమే లక్ష్యంగా కాకుండామానవతా దృక్పథంతో నడుం కట్టాలి. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ఉక్కుపాదం మోపాలి. ప్రమాదాలకు కారకులైన డ్రైవర్ల లైసెన్సులను పాశ్చాత్య దేశాల్లోగా రద్దుచేయాలి. వారు జీవితంలో మళ్లీ స్టీరింగ్ పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. అవసరమైతే చట్టాన్నిసవరించాలి. త్రికరణశుద్ధిగా ఆ కోణంలో ప్రయత్నాలు జరగక్కపోతే వాహనాలు మృత్యు దేవతల్లా రోడ్లపై వీరవిహారం చేయకమానవు. వేలాది మంది జీవితాలు అర్థాంతరంగా ముగియక తప్పదు.**

దామెర్ల సాయిబాబ

మానవుడి సుఖానికి, సంతోషానికి, అభివృద్ధి దోహదం కావాలి. సుఖం కోసం అభివృద్ధి మార్గాలను అన్వేషిస్తాం. రోడ్లు అభివృద్ధికి సోపానాలు అనేది అందరికి తెలిసిందే. మరి ఆ సోపానాలు మృత్యువుమార్గాలైతే ఎవరికి చెప్పుకోవాలి? ఏమని చెప్పుకోవాలి? దేశవ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. మరొకపక్క అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వాహనాలు తయారు చేస్తున్నారు. భద్రతకు మరెంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. అయినా దేశవ్యాప్తంగా ప్రమాదాలు ఏమాత్రం తగ్గడంలేదు. రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మనిషి క్షేమంగా ఇంటికి వచ్చే గ్యారంటీ లేని పరిస్థితులు దాపురించాయి. అభద్రతా భావం రోజురోజుకు పెరిగిపోతున్నది. ఏ నిమిషానికి ఏమి జరుగునో అన్నట్లు ఎప్పుడు, ఏప్రమాదం ముంచుకొచ్చి ప్రాణాలు పోతాయో, వికలాంగులమవుతామోననే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలు మరింత పటిష్టం చేస్తున్నా, జరిమానాలు భారీగా పెంచుతున్నా, ప్రమాదాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నది. ప్రమాదాల్లో మరణించిన వారికి సంబంధించిన సన్నిహితులు, బంధువులు, గుండెలు బాదుకొని ఏడ్చేవారిని చూసి కన్నీరు సైతం ఘనీభవించే స్థితికి చేరుకున్నదేమోననిపిస్తున్నది. మొన్న బుధవారం నెల్లూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక కారు రోడ్డుపక్కనున్న పూరింట్లోకి దూసుకుపోవడంతో ఐదుగురు మెరికల్లాంటి వైద్యవిద్యార్థులతో పాటు ఆ ఇంట్లో నిద్రిస్తున్న ఒక వృద్ధుడు కూడా మృత్యువాతపడ్డాడు. నెల్లూరుజిల్లా కోవూరు మండలం పోతిరెడ్డి పాలెం సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం ఈ విషాద సంఘటన చోటు చేసుకున్నది. ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీలో రెండో సంవత్సరం ఎంబిబిఎస్ చదువుతున్న ఈ విద్యార్థి బృందం ఒక నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా కారు అదుపుతప్పి పక్కనున్న పూరింట్లోకి దూసుకువెళ్లింది.ఇంట్లో మంచంపై పడుకొని ఉన్న అరవైఐదేళ్ల వృద్ధుడిపైకి కారు దూసుకుపోవడంతో ఆయన అక్కడికక్కడే మరణించాడు. కారులో ఉన్న ఐదుగురు మెడికోలను గ్రామస్తుల సహాయంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఐదుగురు మరణించారు. మొన్న తెలంగాణలో ఒకే రోజు జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాల్లో పదకొండు మందికిపైగా మరణించారు. ఇందులో ఇద్దరు నర్సింగ్ విద్యార్థులున్నారు.అంతకు ముందు జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు అసువులుబాశారు. అన్నెంపున్నెం ఎరుగని వేలాది మంది అమాయకులు ఈ రోడ్డు ప్రమాదాలకు బలైపోతున్నారు. లక్షలాది మంది వికలాంగులుగా మారి కుటుంబానికి భారమై జీవితాంతంనరకం అనుభవిస్తున్నారు. ఒకరుకాదు, ఇద్దరు కాదు, ఒక రోజుకాదు, రెండు రోజులు కాదు నిత్యం ప్రమాదాల పరంపర కొనసాగుతూనే ఉన్నది. ఇలా ప్రమాదాలకు గురై అసువుల బాస్తున్న వారిలో అధికశాతం ముప్పై, ముప్పైఐదేండ్ల లోపు యువకులే. దేశవ్యాప్తంగా 2001 నుండి 2020 వరకు తొంభైఆరు లక్షల, అరవైరెండు వేల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటే ఇరవైమూడు లక్షల ఇరవైఐదువేల మందికిపైగా మృత్యువాత పడ్డట్టు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. క్షతగాత్రులైన వారి సంఖ్యకోట్లలో ఉంది. రోడ్లపై ఏర్పడిన గుంతలు కారణంగా గతనాలుగేళ్లలో దాదాపు ఇరవైతొమ్మిదివేలకుపైగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.అంతేకాదు ప్రమాదాలకు గురై ప్రాణాపాయ స్థితిలో సకాలంలో ప్రాథమిక చికిత్స

## ఒక్క మాట

అందక మృత్యువుతో పోరాడి రోడ్లపైనే ప్రాణాలు వదులుతున్నవారు వేల సంఖ్యలో ఉన్నారు. అమెరికాలో రోడ్డు ప్రమాదాలకు గురైన ప్రతి రెండు వందల మందిలో ఒకరు మరణిస్తుంటే భారత్‌లో ప్రతి ఆరుగురిలో ఒకరు మరణిస్తున్నట్లు అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. అభివృద్ధికి సోపానాలైన రోడ్లే మృత్యువు మార్గాలై మానవాళిని కబళిస్తుంటే ఈ ప్రమాదాలను నివారించలేమా? ఇందుకు ఎవరు బాధ్యులు? లోపం ఎక్కడున్నదనే ప్రశ్నలకు జవాబు అందరికి తెలిసినా ఆ కోణంలో చర్యలు తీసుకోలేకపోతున్నారు. సమావేశాలకు, సమీక్షలకు కొదవలేకపోయినా ఆచరణకు వచ్చేసరికి ప్రశ్నార్థకంగా మారిపోతున్నది. రోడ్డు భద్రతా వారోత్సవాలు ఘనంగానే నిర్వహించుకుంటుంటారు. ఒకపక్క ఈ కార్యక్రమాలు జరుగుతుంటేనే మరొకపక్క ప్రమాదాలు యధేచ్ఛగా జరుగుతుంటాయి. చట్టంలో కూడా మార్పులు తీసుకువస్తున్నారు. నిబంధనలను అతిక్రమించినవారిపై భారీ జరిమానాలు విధిస్తున్నారు. అంతేకాదు ప్రమాదాలకు గల కారణాలు, కారకులు ఎవరు అనే విషయంలో అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీని కూడా నియమించారు. ఎంతో మంది నిపుణులుఎన్నో వ్యయప్రయాసలకోర్చి క్షేత్రస్థాయిలోఅధ్యయనాలు చేసి నివేదిక రూపొందించారు. ఆ నివేదికలను అటకెక్కించారు. ఎవరు ఎలా పోయినా, ఎంత మంది ప్రాణాలు అర్థాంతరంగా గాలిలో కలిసిపోయినా ఎన్ని లక్షల కుటుంబాలు వీధిన పడినా ధనార్జనే ధ్యేయంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదనే విమర్శలను కొట్టివేయలేం. ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు చేపట్టని ప్రభుత్వం నిర్లక్ష్యంగానో, మద్యం మత్తులోనో వాహనాలు నడిపి అమాయకులను బలితీసుకుంటున్నా, జరిమానాలు వసూలు చేయాలని లక్ష్యాలుగా నిర్ణయించడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. ప్రభుత్వ ఖజానాకు రాబడి ఇబ్బడి, ముబ్బడిగా పెంచడమే నిర్దేశంగా ప్రభుత్వం అడుగులు వేయాలనుకోవడం దురదృష్టకరం. నెలనెలా ఎన్ని కేసులుపెట్టాలో, ఎంత వసూలు చేయాలి? లక్ష్యాలు నిర్ణయిస్తున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు కొందరు అధికారులు ఈ పేరుతో సొంత ఖజానాలు నింపుకుంటున్నారు. వాహనాల కట్టడి అనే లక్ష్యం నీరుగారిపోగా కాలంచెల్లిన వాహనాలకుపర్మిట్లు, లైసెన్సులు ఇష్టానుసారంగా జారీ అవుతున్నాయి. అధిక శాతం ప్రమాదాలు చోదకుల నిర్లక్ష్యం, తప్పిదం వల్లనే జరుగుతున్నాయని నిపుణుల అధ్యయనంలో తేలింది. ఇక మద్యపానం కూడా ఈ ప్రమాదాలను పెంచుతున్నదనే విషయం జగమెరిగిన సత్యం. కొందరు డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండడం వల్ల ప్రమాదాల సంఖ్య పెరిగిపోతున్నది. మద్యాదాయమే మహాప్రసాదం అన్నట్లు పాలకులు జాతీయ రహదారిపైకూడా మద్యం విక్రయకేంద్రాలకు అనుమతులు ఇవ్వడం ఈ ప్రమాదాలకు మరింత ఊతం ఇస్తున్నాయి. మద్యంతో ఆదాయం వస్తుండవచ్చు. కానీ జరుగుతున్న అనర్థాలను పట్టించుకోకపోవడం దురదృష్టకరం. ఇదిలావుంటే రోజురోజుకు వాహనాల సంఖ్య పెరిగిపోతున్నది. అందుకు తగినట్లుగా రోడ్లను విస్తరించలేకపోతున్నారు. ఏవో కమిటీలు, సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌లు అంటూ కాలం గడుపుతున్నారే తప్ప నిర్దిష్టమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అంతెందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదాలను నివారించడం కోసం మూడు దశాబ్దాల క్రితమే రోడ్ సేఫ్టీ ఆథారిటీని ఏర్పాటు చేసినా ఆ విభాగానికి నిధులు, విధులు అప్పగించకుండా మూలన కూర్చోబెట్టారు. చివరకు పరిస్థితి ఎలావచ్చిందంటే తమ మాట వినని, తమకు నచ్చని సీనియర్ అధికారులను అక్కడ పనిష్మెంట్ కింద పోస్టింగ్‌ఇచ్చి పనిలేకుండా కూర్చోబెట్టి నెలనెలా జీతభత్యాలు ఇస్తున్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత రెండు రోడ్ సేఫ్టీ ఆథారిటీలు ఏర్పడ్డాయి.దీంతో ఆ ఆథారిటీ అలంకరప్రాయంగా నిలిచిపోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆదాయం పెంచుకోవడంలో ఉన్న శ్రద్ధాశక్తులు ప్రమాదాలు నివారించడంలో చూపించలేకపోతున్నారు. ఫలితంగా నిత్యం రహదారులు రక్తసిక్తం అవుతున్నాయి. దేశవ్యాప్తంగా వేలాదిమంది అసువులు బాస్తుండగా, కోట్లాదిమంది అంగవైకల్యంతో జీవనాధారంకోల్పోయి జీవచ్ఛవాలుగా బతుకీడుస్తున్నారు. చేతికి అందివస్తున్న పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రుల గర్భశోకం,తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారినపిల్లల పరిస్థితి వర్ణనాతీతం.ఇప్పటికైనా ఆదాయమే లక్ష్యంగా కాకుండామానవతా దృక్పథంతో నడుం కట్టాలి. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ఉక్కుపాదం మోపాలి. ప్రమాదాలకు కారకులైన డ్రైవర్ల లైసెన్సులను పాశ్చాత్య దేశాల్లోగా రద్దుచేయాలి. వారు జీవితంలో మళ్లీ స్టీరింగ్ పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. అవసరమైతే చట్టాన్నిసవరించాలి. త్రికరణశుద్ధిగా ఆ కోణంలో ప్రయత్నాలు జరగక్కపోతే వాహనాలు మృత్యు దేవతల్లా రోడ్లపై వీరవిహారం చేయకమానవు. వేలాది మంది జీవితాలు అర్థాంతరంగా ముగియక తప్పదు. ●

# పత్రికా మర్యాదలతోనే స్వేచ్ఛకు నెలవు

రామ కిష్టయ్య సంగన భట్ల

జర్నలిస్టుల నిరసనగా గుర్తుగా మే 3వ తేదీని ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవంగా జరుపుకుంటాము. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోని 19 ఆర్టికల్‌కు అనుగుణంగా పాలకులు పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, వారికి పత్రికా స్వేచ్ఛ ప్రాధాన్యతను గుర్తు చేస్తూ ఐక్యరాజ్య సమితి 1993లో అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛ దినంగా మే 3వ తేదీని ప్రకటించింది. అప్పటినుంచి ప్రతి సంవత్సరం మే 3వ తేదీన పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు, పత్రికా స్వేచ్ఛపై అవగాహన కల్పించటానికి ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవంను జరుపుకుంటున్నారు. భారత స్వాతంత్ర్యానికి ముందు కూడా మీడియాలో రెండు తరగతులు వుండేవి. ఒకటి స్వాతంత్ర్య లక్ష్యం కోసం ప్రధానంగా పని చేసినవి, రెండవ తరగతి బ్రిటీష్ సామ్రాజ్య వాదులతో ఘర్షణపడకుండా స్వామికార్యం, స్వకార్యం నెరవేర్చుకొనేవి. తరువాత దేశ మీడియాలో ఆ గీత చెరిగిపోయింది. ప్రజల కోసం, ప్రజల సమస్యల మీద కేంద్రీకరణ లేదు. ఎవరు అధికారంలో వుంటే వారికి అనుకూలంగా, పెట్టుబడిపై లాభాలను ఆర్జించే వ్యాపకంగా మారింది. అందుకోసం వార్తను, దృశ్యాన్ని వ్యాపార సరకులుగా మార్చి వేశారు. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ వారిని వ్యతిరేకిస్తూ పత్రికలు పెట్టిన ఎందరో తమ ఆస్తులను పణంగా పెట్టారు. ప్రస్తుతం అధిక సంఖ్యాక పత్రికలు, చానళ్లు లాభాల కోసం నడుస్తున్నవే. మా పత్రిక ధర మీరు కొనే సమోసా కంటే తక్కువే అని గతంలో ఒక మీడియా సంస్థ ప్రచారం చేసుకోవడం తెలిసిందే. ఒక్క పత్రికలు తప్ప ప్రపంచంలో ఏ వస్తువూ తయారీ ధరకంటే తక్కువకు లభ్యం కావటంలేదు. ప్రకటనలే పత్రికలను గటెక్కిస్తాయనడంలో సందేహంలేదు. వార్తా ప్రచురణ, ప్రసారం లాభదాయకమా కాదా? అన్నది అటుంచితే ఎందుకోకానీ నేడు నూటికి తొంబై తొమ్మిది సంస్థలు మాకేమిటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయనే అపప్రద ఉంది. అలాంటి వాటికి భావప్రకటనా స్వేచ్ఛ వుంటేనే లేకపోతేనేం. నేడు మీడియా సంస్థలను డబ్బులు సంపాదించే పెట్టుబడిదారులు నడుపుతున్నారు తప్ప సంపాదకులకు ఎలాంటి స్వేచ్ఛ లేకుండాపోతోంది. మీడియా స్వేచ్ఛకు కలుగుతున్న హాని గురించి ఒక్కమాట కూడా రాయలేని నిస్సహాయత నేడు మనం చూస్తున్నాం. ఫోర్త్ ఎస్టేట్‌గా మన్ననలను పొందిన మీడియా రియలెస్టేట్‌గా మారిపోయిందనే ఆరోపణలు నిత్యం వినాల్సివస్తోంది. మీడియా యజమానులు, రాజకీయ నేతలకు మధ్య వున్న గీత దాదాపుగా చెరిగిపోయింది. ఒకరిప్రయోజనాలను ఇంకొకరు కాపాడుకుంటున్నారు. లేదా వారే వీరవుతున్నారు. దేశంలోని గుత్త పెట్టుబడిదారీ సంస్థలు మీడియా రంగంలో ప్రవేశించటంతో పత్రికా స్వేచ్ఛ హరించుకుపోతున్నది. పాలక పక్షాలు స్వార్థమే పరమార్థంగా వ్యవహరిస్తున్నాయన్నది స్పష్టం. గతంలో కాంగ్రెస్ అత్యవసర పరిస్థితిని ప్రకటించి మీడియా వార్తలపై ప్రత్యక్ష సెన్సార్‌షిప్ విధించింది. ఇప్పుడు అదే కాంగ్రెస్ లేదా బిజెపి వాటితో జట్టు కట్టే పాలకవర్గ ప్రాంతీయ పార్టీలు మీడియా మీద పరోక్ష సెన్సార్‌ను అమలు జరుపుతున్నాయి. మన దేశంలో గత కొన్నేళ్లుగా కుహనావార్తలు సామాజిక మాధ్యమాన్ని ముంచెత్తుతున్నాయి. హిట్లర్ ప్రభుత్వంలో మంత్రిగా వున్నగోబెల్స్ ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజమైకూర్చుంటుంది అన్న సూత్రంతో పని చేశాడు. ఇప్పుడు మనిషి మనిషికీ ఇంటర్నెట్ అందుబాటులోకి రావటంతో గోబెల్స్‌లు వికటాట్టహాసంచేస్తున్నారు. నిజమైనవార్తలు, నిజమైన పత్రికా, మీడియా స్వేచ్ఛ విషయంలో జనం కూడా గందరగోళానికి గురవుతున్నారు.మన దేశంలో 1956లో ఏర్పాటు చేసిన తొలి ప్రెస్ కమిషన్ సిఫార్సుల మేరకు 1966 నవంబరు 16న ప్రెస్‌కౌన్సిల్ ఏర్పడింది. ఆరోజును జాతీయ పత్రికాదినంగా పాటిస్తూ 1997నుంచి ప్రెస్‌కౌన్సిల్ ప్రతిఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. భారతదేశంలోనే కాకుండా చాలా ప్రపంచ దేశాలలో ప్రెస్‌కౌన్సిళ్లు ఉన్నాయి.అయితే భారతదేశకౌన్సిల్‌కు ఉన్న ప్రత్యే కత, గుర్తింపు ఏమంటే ప్రభుత్వ శాఖలపై కూడా తన అధికారాన్ని వినియోగించేఅవకాశంలభించడమే. స్వేచ్ఛాయుత,జవాబుదారీమీడియా కోసం జనం పరితపిస్తున్నారు.మీడియా సంస్థలనూ సరైనదారిలో పెట్టే సంకల్పంతో ప్రెస్‌కౌన్సిల్ ముందుకు సాగాలని కోరుకుందాం. ●

# కులగణన బడుగు జనహితమే!



డాక్టర్
సంగని మల్లేశ్వర్

దేశానికి స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినప్పటికీ బిసిల విషయంలో మేమునగం, మాకునగం అనే నినాదంఎండమావిగానే నిలిచింది. ఓబీసీల సంక్షేమం కోసం పాటు పడినపాలకులు బహుఅరుదు. అలాంటి వారిలో వీపీ సింగ్, బిపి. మండల్, కరుణానిధి, కర్పూరి ఠాకూర్, ఆ తరువాత తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వారి సరసన నిలుస్తారు. అనేక ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఊదరగొట్టి 50శాతం పైగా ఉన్న బిసి జనాభాకు కులగణన చేయని కారణంగా ఏరంగంలో కూడా న్యాయం జరగలేదు. రాష్ట్రప్రభుత్వం చారిత్రాత్మకంగా తెచ్చిన రిజర్వేషన్ల బిల్లు మోడీ కోర్టులో వేయడం, దేశంలో కులగణన దిశగా 80 కోట్ల ప్రజలు మొగ్గడం, రాహుల్ నాయకత్వంలోనిఇండియా కూటమి దూకుడుగా వ్యవహరించడంవల్ల అపవాదు మూట గట్టుకుంటామనే భయంతో ఎన్డీఏ ప్రభుత్వం కులగణనకు పచ్చజెండా ఊపడం చరిత్రలో లిఖించదగ్గరోజు. దేశంలో రెండు పార్టీలు ఓబీసీలను ఇన్నాళ్లు నయవంచనకు గురిచేసినారనేది బడుగుల ఆర్థిక విధ్వంసానికి కారణమనే భావించాలి. బ్రిటీష్ కాలంలో 1931లో జరిగిన కులగణన దిక్కు అయింది. తర్వాత 1951లో నిర్వహించిన కులగణనను అంటరానిదిగా ముట్టుకోలేదు. ఈరోజు ప్రధానిగా బీసీ మోడీ ఉండడం వల్లనే తన వర్గానికి జరిగిన అన్యాయాన్ని ఆలస్యంగా అయిన గుర్తించడం వల్ల కాంగ్రెస్ ఆశలు ఆవిరి అయ్యే ప్రమాదం ఉంది. అయితే కులగణనతోనే జబ్బలు చేర్చుకుంటే సరిపోదు, సామాజిక న్యాయం జరగాలంటే ప్రభుత్వం చిత్తశుద్ధి కూడా అవసరం. ఓబీసీల తిరుగుబాటు చవిచూడక ముందే పార్లమెంట్‌లో రిజర్వేషన్ల బిల్లు రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవశ్యకత ఉంది. నాడు బీసీ కమిషన్‌కు 123వ రాజ్యాంగసవరణ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదింప చేసి రాజ్యాంగ హోదా కల్పించింది. అయితే ఇప్పుడు వచ్చే ముప్పును పసిగట్టి ముందస్తు చర్యలకు అడుగులు వేసిందనడంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. ఉమ్మడి పాలనలో గడిచిన 77సంవత్సరాల కాలంలో ఓబీసీల అభివృద్ధికి ఏ ప్రభుత్వం పాటు పడలేదు.నాడు వీపీ సింగ్ ప్రభుత్వం ఉండడం మూలాన 27శాతం విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లకు నోచుకుంది. నేటికీ మన సమాజంలో అనేక కులాలు ఇంకా పాలితులుగానే ఉండడం మన వెనుకబాటు తనానికి సూచిస్తున్నది. దీంతో రాజ్యాధికారం అనే భావ నను ఏ మాత్రం అనుభవించకుండా ఐదేండ్లకోసారి ఓటేసే ఓటర్లుగా మాత్రమే బతుకుతున్న జనాభాకు కులగణన ఊపిరిపోసింది. స్థానికసంస్థల ఎన్నికలకు బీసీల సామాజిక అంశమేముఖ్య అజెండాగా పోయేందుకు కాంగ్రెస్ పార్టీతోపాటు భారతీయ జనతాపార్టీ, బారాస పార్టీలు కొంగజపం కాకుండా విద్య,ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల అమలుకోసం,సమన్యాయం కోసం పార్లమెంటులో రిజర్వేషన్ల బిల్లు ఆమోదించే విధంగా మేల్కొంటే అన్ని పార్టీలు బట్టకడతాయంటే అతిశయోక్తి కాదు. విద్య, ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడానికి అన్నిపార్టీలు ఎలాం టి అరమరికాలు లేకుండా కృషి చేయవలసిన పరిస్థితులు ఏర్పడినాయి.



దేశంలో కులగణన అంశంనాయకులకు నిద్రపోనివ్వడం లేదంటే అతిశయోక్తి కాదు. కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 2011లో సామాజిక, ఆర్థిక సర్వే చేపట్టింది కానీ, లెక్కలు బయటపెట్టలేదు.ఎన్నికల ముందు రాహుల్ హామీ ఇచ్చిన మాదిరిగానే అసెంబ్లీలో తీర్మానం చేసి యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన కులగణన రాష్ట్రప్రభుత్వాన్ని విమర్శలకు తావిచ్చింది. అందులో పిహెచ్‌డికి సరిపోయే 53 ప్రశ్నావళికి బడుగులు స్పందించలేదు.తదుపరి అవకాశం ఇచ్చినా ఆదరణకు నోచుకోలేదు. కేంద్రంచేపట్టనున్న కులగణనలో స్పష్టంగా ఒక పేజీకి మించకుండాసామాజిక, విద్య, ఉద్యోగ అంశాలపై దృష్టిసారిస్తే 100శాతం ఫలితాలు రాబట్టవచ్చుననే భావం ఏర్పడింది. ఈనేపథ్యం లో అనేక విషయాలు జవాబు లేని ప్రశ్నలుగా మనముందుంటున్నాయి. కుటుంబాలవారీగా ఆదాయ గణన ఒకశాస్త్రీయ పద్ధతిలో జరగనప్పుడు అర్హత గల పేద కుటుంబాలను ఎలాగుర్తిస్తారు? నిజానికి అందరికి ఆమోదయోగ్యమైన విధంగా దశాబ్దాలుగా శాస్త్రీయంగా పేదలను గుర్తించే అధ్యయనం జరుగలేదు.అలాంటప్పుడు దుడ్డు ఉన్నోడిదే బర్రె అన్నమాదిరిగా ఇలాంటి పథకాలుతప్పుదారి పట్టడం మామూలే. ప్రభుత్వాలకు సైతం అమలు చేయడం సమస్య గా మారుతుంది. ఇంకా చెప్పాలంటే మన దేశంలో వ్యక్తిగతంగా వార్షికాదాయం లెక్కించడం మరిక్లిష్టతరమైనది. పనికి తగ్గ వేతనం లేదు.స్వయం ఉపాధి మీద ఆధారపడి జీవిస్తున్న సగటు ప్రజల వార్షికాదాయం లెక్కించడం సాధ్యమయ్యే పనికాదు. అందుకే కులగణన సమస్యాత్మకంగా మారింది.దేశంలో కులగణనకు తెలంగాణ, బీహార్ ,కర్ణాటక ఆదర్శంగా నిలిచాయని,అందులో కాంగ్రెస్‌పాలిస్తున్న రాష్ట్రాలు ముందడుగు వేయడంతో ఆలస్యంఅమృతం విషం అన్ననానుడి గుర్తుకొచ్చి బీజేపీ నిర్ణయం తీసుకోవడం తప్పలేదు. సుప్రీంకోర్టు విధించిన 50శాతం పరిమితి దాటడానికి రాజమార్గంఏర్పడ్డది. ఏదిఏమైనా రాహుల్‌ఇచ్చిన కులగణన హామీతో బెంబేలెత్తి పచ్చజెండా ఊపడం ముదావహం. ●

# సుంకాల విషయంలో నిజాయితీయే ముఖ్యం

## డొనాల్డ్ ట్రంప్ చర్చల ప్రతిపాదనపై చైనా



**బీజింగ్, మే 2:** అమెరికా, చైనాల మధ్య పరస్పర సుంకాల నేపథ్యంలో వాణిజ్య యుద్ధం నెలకొన్న విషయం తెలిసిందే. టారిఫ్‌లపై విస్తృతస్థాయిలో చర్చలు జరిపేందుకు అమెరికా అధికారుల బృందం చైనా అధికారులను సంప్రదించింది. తాజాగా ఈ విషయంపై బీజింగ్ స్పందిస్తూ.. వాషింగ్టన్ ఇటీవల తీసుకున్న వాణిజ్య విధాన నిర్ణయాలు, సుంకాల తగ్గింపు విషయమై అగ్రరాజ్యంతో చర్చలు జరపాలా? వద్దా అని యోచి స్తున్నట్లు వెల్లడించింది. 'టారిఫ్ సమస్యలపై బీజింగ్‌తో చర్చలు జరపాలనే ఆశను వ్యక్తంచేస్తూ అమెరికా సంబంధిత వర్గాల ద్వారా అనేకసార్లు సందేశాలను పంపింది. దీంతో చర్చల విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకో వాలనే విషయాన్ని అధికారులతో సంప్రదించి ఓ అంచనాకు వస్తాము' అని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. అయితే తమపై టారిఫ్ విధిస్తూ వాణిజ్య యుద్ధాన్ని అమెరికా ఏకపక్షంగా ప్రారంభించిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధి అన్నారు. ఇప్పుడు ఆ దేశం తమతో చర్చలు జరపాలంటే తమతో నిజాయితీగా ఉండాలని తెలిపారు. బీజింగ్‌తో వ్యవహరిస్తున్న తప్పుడు పద్ధతులను సరిదిద్దుకొని తమపై విధించిన ఏకపక్ష సుంకాలను ఎత్తివేయడానికి చర్చలు తీసుకోవాలన్నారు. అప్పుడే అమెరికాతో బీజింగ్ సానుకూల చర్చలు చేపడుతుందని తెలిపారు. మరోవైపు చైనానే టారిఫ్‌లపై చర్చల కోసం తీవ్రస్థాయిలో యత్నిస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్నారు. బుధ వారం కూడా ఆయన మాట్లాడుతూ డీల్ కుదు ర్చుకోవడానికి బలమైన అవకాశాలున్నాయని చెప్పారు. 'చర్చల్లో మా నిబంధనలకు లోబడే ఒప్పందం చేసుకోనున్నాం. అదే మంచిది' అని ఆయన న్యూస్‌నేషన్ టౌన్‌హాల్ కార్యక్రమంలో వెల్లడించారు. దాదాపు వారం రోజుల క్రితం ట్రంప్ ఇటువంటి ప్రకటనే చేయగా చైనా బహిరంగంగానే ఖండించింది. నాడు బీజింగ్ ప్రతినిధి గువో జియాకున్ మాట్లాడుతూ 'ఇరుదేశాల మధ్య సంప్రదింపులు ఏమీ జరగడం లేదు. వాణిజ్య ఒప్పందం కుదరలేదు' అని చెప్పారు. అయితే ఈ అంశంపై భవిష్యత్తులో చర్చలకు సిద్ధమే అని చెప్పడం విశేషం. అయితే తాము చేసిన కొత్త వాణిజ్య ఒప్పందాల గురించి తమతో చర్చించడానికి 75 కంటే ఎక్కువ దేశాలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని వైట్‌హౌస్ పేర్కొంది.
అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చైనాపై టారిఫ్‌ల కొరడా విసురుతున్న ట్రంప్ బీజింగ్ నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై సుంకాన్ని 145 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. దీనికి ప్రతిగా చైనా కూడా అగ్రరాజ్య ఉత్పత్తులపై 125 శాతం టారిఫ్‌లు ప్రకటించింది. దీంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య విభేదాలు భగ్గుమన్నాయి.

# శశిథరూర్‌తో నాఫోటో చూసి కాంగ్రెస్‌కు నిద్రపట్టదు

## తిరువనంతపురంలో ప్రధాని మోడీ ఛలోక్తులు



**తిరువనంతపురం, మే 2:** దేశాభివృద్ధిలో ఓడరేవులుద్వారా వాణిజ్యం ఇప్పుడు కీలకం అవుతున్నందున కేరళలోని ఒక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడిన ప్రధాని మోదీ ప్రతిపక్ష పార్టీపై వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. శశిథరూర్‌తో కలిసి ఒక్క ఫోటో చాలామందికి నిద్రలేకుండా చేస్తుందని కాంగ్రెస్‌ను ఉద్దేశించి శశిథరూర్, విజయన్ ముందే మోదీ వ్యాఖ్యానించారు. ఈ రోజు శశి థరూర్ ఇక్కడ ఉన్నారు. ఈ కార్యక్రమం కొందమందికి నిద్రలేని రాత్రిని మిగులుస్తుంది. సందేశం ఎక్కడి వెళ్లాలో అక్కడికి వెళ్లిపోయింది అని మోదీ చమత్కరించారు. అంతకు ముందు గురువారం రాత్రి కేరళ చేరుకున్న ప్రధానిని శశి థరూర్ వ్యక్తిగతంగా వెళ్లి స్వాగతించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో విమానాల ఆలస్యంగా నడుస్తున్నప్పటికీ సమయానికి తిరువనంతపురం చేరుకోగలిగాను. నా నియోజకవర్గానికి వచ్చిన ప్రధాని మోదీని సాదరంగా స్వాగతించా అని థరూర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అయితే, కాంగ్రెస్ అధినాయకత్వంతో ఎంపీ శశి థరూర్ బంధం బీటలు వారుతున్నట్లు ఊహాగానాలు విని పిస్తున్నాయి. గత కొన్ని నెలలుగా థరూర్ తన సొంత పార్టీపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆ మధ్య ఓ కేంద్రమంత్రితో ఆయన సెల్ఫీ దిగడంతో థరూర్ పార్టీ మారనున్నట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత భారత విదేశాంగ విధానాన్ని ప్రశంసిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ పరిణామాల వేళ థరూర్ మోదీతో వేదిక పంచుకోవడం చర్చనీయాంశంగా మారింది. గడిచిన 10 ఏళ్లలో భారత ఓడరేవుల సామర్థ్యం రెట్టింపు అయిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. పోర్టుల సామర్థ్యం గణనీయంగా మెరుగుపడిందని వివరించారు. నావికా సంబంధాల్లో ప్రపంచంలోని తొలి మూడు దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచిందన్న ప్రధాని, టర్నరౌండ్ సమయం 30శాతం తగ్గిందని తెలిపారు. ఇంతకుముందు 75 శాతం భారత షిప్‌మెంట్ కార్యకలాపాలు విదేశీ ఓడరేవులలో నిర్వహించడం వల్ల దేశం చాలా ఆదాయాన్ని నష్టపోయిందని తెలిపారు. తిరువనంతపురంలో రూ. 8వేల867 కోట్లతో నిర్మించిన విజింజం అంతర్జాతీయ ఓడరేవును పినరయి విజయన్, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ సమక్షంలో మోదీ ప్రారంభించారు. అంతర్జాతీయ వాణిజ్యం, షిప్పింగ్ కోసం భారతదేశానికి ఈ ఓడరేవు కీలకమవుతుందని ప్రధాని తెలిపారు. దేశాభివృద్ధిలో పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడించారు. జి20 శిఖరాగ్ర సమావేశంలోనే మేము భారత్‌మధ్యప్రాచ్యయూరప్ కారిడార్‌పై అనేక పెద్దదేశాలతో ఒప్పందం చేసుకున్నాము. ఓడరేవులకు సంబంధించి కేరళ చాలా ముఖ్య స్థానంలో ఉంది. విజింజం ఓడరేవు నుంచి కేరళ కూడా పెద్ద ఎత్తున ప్రయోజనం పొందబోతోంది. మన దేశంలోని సముద్ర రంగాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడంలో ప్రైవేట్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని మోడీ అన్నారు.

# ఉగ్రవాదుల అంతానికి భారత్‌కు సహకరించండి

## పాక్‌కు యుఎస్ వైస్‌ప్రెసిడెంట్ జెడి వాన్స్ సూచన

**వాషింగ్టన్, మే 2:** పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడితో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ పరిణామాలపై తాజాగా అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ దాడి విషయంలో భారత్ ప్రతిస్పందన ప్రాంతీయ సంఘర్షణలకు దారి తీయకుండా ఉండాలని కోరారు. అంతేగాక, ఉగ్రవేటలో న్యూఢిల్లీకి పాక్ సహకరించాలని పిలుపునిచ్చారు. 'పర్యాటకులపై ఉగ్రదాడిపై ఘటన తీవ్ర దిగ్భ్రాంతికరం. అయితే, దీనికి భారత్ ప్రతిస్పందించడం సరైనదే. అయితే, అది విస్తృత ప్రాంతీయ సంఘర్షణలకు దారితీయని విధంగా ఉంటుందని మేం విశ్వసిస్తున్నాం. ఇక, పాకిస్థాన్ కూడా ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆశిస్తున్నాం. కొన్నిసార్లు పాక్ భూభాగం నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాదులను వేటాడటంలో భారత్ చేస్తున్న ప్రయత్నాలకు వారు సహకరించాలి' అని జెడి వాన్స్ ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో వెల్లడించారు.



జెడి వాన్స్ సతీసమేతంగా భారత పర్యటనలో ఉన్న సమయంలోనే పహల్గాం ఉగ్రదాడి ఘటన జరిగిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఈ దాడిని వాన్స్ తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేసే పోరాటంలో అమెరికా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన భరోసా నిచ్చారు. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా పలు అగ్రరాజ్య నేతలు ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ భారత్‌కు మద్దతుగా నిలిచారు.
ఇదిలా ఉండగా.. భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో అలజడి కొనసాగుతూనే ఉంది. నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైన్యం మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కవ్వింపులకు పాల్పడింది. కుప్వారా, బారాముల్లా, పూంఛ్, నౌషెరా, అఖ్నూర్ సెక్టార్లలో దాయాది బలగాలు కాల్పులకు తెగబడ్డాయి. వీటిని భారత ఆర్మీ సమర్థంగా తిప్పికొట్టింది. సరిహద్దుల్లో పాక్ ఇలాంటి దుశ్చర్యకు పాల్పడటం వరుసగా ఇది ఎనిమిదో సారి కావడం గమనార్హం. ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

# ఐదో తరగతి స్టూడెంట్‌తో టీచర్ జంప్,అరెస్టు



**సూరత్, మే 2:** నాలుగు రోజుల క్రితం 11 ఏళ్ల విద్యార్థితో పారిపోయిన మహిళా ఉపాధ్యాయురాలిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. గుజరాత్‌లోని సూరత్‌లో ఉన్న పూనాగం ప్రాంతం నుంచి ఐదో తరగతి విద్యార్థితో పారిపోయిన సదరు ఉపాధ్యాయురాలిని రాజస్థాన్ సరిహద్దులోని షామ్లాజీ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థితో కలిసి బస్సులో వెళ్తుండగా అరెస్టు చేశారు. మొబైల్ టవర్ లొకేషన్ ఆధారంగా వారు ఉన్న స్థలాన్ని పోలీసులు గుర్తించారు. బాధిత విద్యార్థిని అతడి కుటుంబానికి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టీచర్, విద్యార్థి కలిసి వడోదర, అహ్మదాబాద్, జైపూర్, ఢిల్లీ, బృందావన్ వంటి వివిధ ప్రదేశాల్లో తిరిగారు. వారిద్దరు దాదాపు 2,200 కిలోమీటర్లు మేర ప్రయాణించారు. ఈ ప్రయాణం చేసే క్రమంలో బాలుడిని సదరు ఉపాధ్యాయురాలు శారీరకంగా వేధించిందని పోలీసులు తెలిపారు. ఉపాధ్యాయురాలు తన వాంగ్మూలంలోనూ విద్యార్థిని శారీరకంగా వేధించినట్లు అంగీకరించిందని సూరత్ సిటీ డీసీపీ భగీరథ్ గర్వి చెప్పారు. ప్రయాణించే క్రమంలో ఉపాధ్యాయురాలు, టీచర్ కలిసి రెండుహోటళ్లలో రాత్రి బస చేశారని చెప్పారు. దీంతో ఆమెపై పోక్సో చట్టం, భారత న్యాయ సంహితలోని సెక్షన్ 127 కింద కేసు నమోదు చేశామన్నారు. ఇద్దరికీ వైద్య పరీక్షలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. సూరత్ నుంచి పారిపోయే క్రమంలో రైలు ఎక్కేముందు టీచర్ తన మొబైల్ ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసిందన్నారు. ఆ టీచర్‌కు చెందిన రెండో మొబైల్‌ను ట్రాక్‌చేయగా లొకేషన్ వివరాలు తెలిశాయని డీసీపీ పేర్కొన్నారు. ఈ టీచర్ సూరత్‌లోని పూనాగం ప్రాంతంలో ఉన్న ఒక హిందీ మీడియం పాఠశాలలో పనిచేసేది. ఈ క్రమంలోనే ఒక విద్యార్థికి ఆమె చేరువైంది. సదరు విద్యార్థికి మూడు సంవత్సరాల పాటు ప్రైవేట్ ట్యూషన్ కూడా చెప్పింది. దీంతో ఇద్దరి మధ్య సంబంధం మరింత పెరిగిందని వెల్లడైంది. ఏప్రిల్ 25న మధ్యాహ్నం ఐదో తరగతి విద్యార్థి తన ఇంటి బయట ఆడుకుంటూ అకస్మాత్తుగా అదృశ్యమయ్యాడు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలించగా అసలు విషయం బయటపడింది.ఈ విద్యార్థి అదృశ్యం కావడానికి కొన్ని క్షణాల ముందు, తనకు ట్యూషన్ చెప్పే ఉపాధ్యాయురాలితో మాట్లాడినట్లు వెల్లడైంది. దీనిపై అదే రోజున సూరత్‌లోని పూనా పోలీస్ స్టేషన్‌లో కిడ్నాప్ కేసు నమోదైంది. సూరత్ రైల్వే స్టేషన్‌లో రికార్డయిన సీసీటీవీ ఫుటేజీని పోలీసులు ప్రాథమిక ఆధారంగా సేకరించారు. మహిళా టీచర్, బాలుడు కలిసి అక్కడే రైలు ఎక్కినట్లు సీసీటీవీ ఫుటేజీలో స్పష్టంగా రికార్డయింది. బుక్ మై ట్రిప్ యాప్ ద్వారా ఉపాధ్యాయురాలు టూర్‌కు సంబంధించిన బుకింగ్స్ అన్నీ చేసినట్లు తేలింది.

# ఐదేళ్లలో 119 మంది వైద్యవిద్యార్థుల ఆత్మహత్య



**న్యూఢిల్లీ, మే 2:** దేశవ్యాప్తంగా గత ఐదేళ్లలో 119 మంది వైద్య విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో 64 మంది ఎంబీబీఎస్ అండర్ గ్రాడ్యుయేట్లు, 55 మంది పీజీ మెడికల్ విద్యార్థులు. అలాగే గత ఐదేళ్లలో 1,116 మంది వైద్య విద్యార్థులు చదువును మధ్యలోనే వదిలేశారు. వీరిలో 160 మంది అండర్ గ్రాడ్యుయేట్లు, 956 మంది పీజీ విద్యార్థులు. యునైటెడ్ డాక్టర్స్ ఫ్రంట్ (యూడీఎఫ్) నుంచి సమాచార హక్కు (ఆర్టీఐ) ద్వారా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) ఈ సమాచారాన్ని సేకరించింది. యువ వైద్య విద్యార్థుల ఆత్మహత్యలు, వైద్య విద్యను మధ్యలోనే వదిలేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కాగా, 2018 నుంచి 2022 వరకు 64 మంది ఎంబీబీఎస్, 58 మంది పీజీ విద్యార్థులు సూసైడ్ చేసుకున్నట్లు గత ఆర్టీఐ డాటా ద్వారా వెల్లడైంది. అలాగే 2020-2022 మధ్య 531 వైద్య కాలేజీల్లో సుమారు 68 మంది వైద్య విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎన్‌ఎంసీ గతంలో నివేదించింది. మరోవైపు యువ వైద్యులపై విద్య, పరీక్షల ఒత్తిడి, తగినంత విశ్రాంతి లేకపోవడం, ప్రతికూల పని వాతావరణం, పని భారం, ఎక్కువ అంచనాలు, తీవ్రమైన మానసిక ఒత్తిడి వంటివి ఆత్మహత్యలు, డ్రాపవుట్‌కు ప్రధాన కారణంగా తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో పని గంటలు తగ్గించడం, వైద్య విద్యార్థులను పర్యవేక్షించడం, కౌన్సెలింగ్ ఇవ్వడం వంటి చర్యలు చేపట్టాలని సీనియర్ వైద్యులు సూచించారు. కాగా, మెడికల్ కాలేజీల నిర్వహణ, నిర్లక్ష్యంపై ఎంబీబీఎస్, పీజీ వైద్య విద్యార్థులు సుమారు 1680 ఫిర్యాదులు చేసినట్లుఈ సమాచారం ద్వారా వెలుగులోకి వచ్చింది. దీంతో మెడికల్ కాలేజీల్లో వేధింపులు, ర్యాగింగ్‌ను నిరోధించాల్సిన అవసరాన్ని ఇది స్పష్టం చేస్తున్నదని సీనియర్ డాక్టర్లు వెల్లడించారు.

# ఒడిశా కిట్‌లో విద్యార్థిని అనుమానాస్పద మృతి



**కటక్, మే 2:** ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని ప్రతిష్ఠాత్మక కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కిట్)లో మరో విషాదం చోటుచేసుకుంది. యూనివర్సిటీకి చెందిన బాలికల హాస్టల్ గదిలో నేపాల్ విద్యార్థిని గురువారం సాయంత్రం విగతజీవిగా కనిపించింది. మూడు నెలల వ్యవధిలో ఇదే క్యాంపస్‌లో నేపాల్ విద్యార్థిని మృతి చెందడం ఇది రెండోసారి కావడంతో తీవ్ర కలకలం రేపుతోంది. పోలీసుల కథనం ప్రకారం మృతురాలు కంప్యూటర్ సైన్స్ బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె స్వస్థలం నేపాల్ రాజధాని కఠ్మాండుకు సుమారు 135 కిలోమీటర్ల దూరంలో ఉన్న బీర్‌గంజ్. గురువారం రాత్రి 8 గంటల సమయంలో బాలికల హాస్టల్‌లోని తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్న స్థితిలో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే యూనివర్సిటీ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు. భువనేశ్వర్‌కటక్ పోలీస్ కమిషనర్ సురేష్ దేవ్‌దత్తా సింగ్ మాట్లాడుతూ, 'కిట్ యూనివర్సిటీలో నేపాల్‌కు చెందిన విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్టు మాకు సమాచారం అందింది. మేం సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించాం. శాస్త్రీయ బృందం వచ్చి అవసరమైన ఆధారాలు సేకరించింది. సమగ్ర విచారణ జరుపుతాం. మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎయిమ్స్‌కు తరలించాం' అని తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతికి గల స్పష్టమైన కారణాలు తెలుస్తాయని, ప్రస్తుతానికి దీనిని అనుమానాస్పద మృతి గా పరిగణిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గత మూడు నెలల్లో కిట్ యూనివర్సిటీలో నేపాల్ విద్యార్థిని మరణించడం ఇది రెండోసారి. ఫిబ్రవరి 16న బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న ప్రకృతి లమ్సాల్ అనే నేపాల్ విద్యార్థిని కూడా ఇదే విధంగా హాస్టల్ గదిలో విగతజీవిగా కనిపించింది. ఆ సమయంలో సహచర విద్యార్థి ఒకరు తనను లైంగికంగా వేధించారని యూనివర్సిటీ ఇంటర్నేషనల్ రిలేషన్స్ ఆఫీస్ కు ఫిర్యాదు చేసినట్టు తర్వాత వెలుగులోకి వచ్చింది. అయితే, యూనివర్సిటీ యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోలేదని, ఇది 'తీవ్ర నిర్లక్ష్యం' అని జాతీయ మానవ హక్కుల కమిషన్ ఎన్‌హెచ్‌ఆర్‌సీ వ్యాఖ్యానించింది. విద్యార్థి సంఘాలు, పౌర సమాజం తీవ్రంగా స్పందించడంతో, ఆమె మరణించిన మరుసటి రోజే నిందితుడిని అరెస్టు చేశారు. బీజేడీ నేత, మాజీ ఎంపీ అచ్యుత సమంత స్థాపించి, నిర్వహిస్తున్న ఈ యూనివర్సిటీపై అప్పట్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.నేపాల్ విదేశాంగ మంత్రి అర్జు రాణా దేవ్బా ఈ ఘటనపై స్పందించారు. నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు భారత ప్రభుత్వం, ఒడిశా ప్రభుత్వం, ఢిల్లీలోని నేపాల్ రాయబార కార్యాలయ ఉన్నతాధికారుల ద్వారా దౌత్యపరమైన చర్యలు ప్రారంభించినట్టు సోషల్ మీడియా వేదిక ఎక్స్ ద్వారా తెలిపారు. 'ప్రిసా సాహ్ మరణం మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని ఆమె పేర్కొన్నారు.

# నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా రాహుల్‌కు నోటీసులు


**న్యూఢిల్లీ, మే 2:** నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఢిల్లీ కోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. నేషనల్ హెరాల్డ్ కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ ఛార్జిషీట్‌ను రౌస్ అవెన్యూ కోర్టు విచారణకు స్వీకరించింది. చార్జిషీట్‌కు సంబంధించిన కేసును విచారించడానికి నిందితులైన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా ఇతర నిందితులు కోర్టుకు హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు తదుపరి విచారణను ఈ నెల 8వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 2025 ఏప్రిల్ 9న మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్లు 3మరియు 4 కింద చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో సోనియా గాంధీని ఏ1గా, రాహుల్ గాంధీని ఏ2గా ఈడీ చేర్చింది. కాంగ్రెస్ నాయకులు సామ్ పిట్రోడా, సుమన్ దూబే వంటి వారు కూడా నిందితులుగా ఉన్నారు. నేషనల్ హెరాల్డ్ అనేది 1938లో జవహర్‌లాల్ నెహ్రూ స్థాపించిన చారిత్రక వార్తాపత్రిక. యంగ్ ఇండియన్ లిమిటెడ్ వైఐఎల్ ద్వారా ఏజేఎల్‌కుచెందిన రూ.2,000 కోట్ల విలువైన ఆస్తులను కేవలం రూ.50లక్షలకు సోనియా, రాహుల్‌గాంధీ కొనుగోలు చేశారని ఈడీ అభియోగాలు మోపింది. వైఐఎల్‌లో రాహుల్‌కు 38శాతం,



సోనియాకు 38శాతం షేర్లు ఉన్నాయి. ఏజేఎల్‌కు చెందిన 99శాతం షేర్లను యంగ్ ఇండియన్ లిమిటెడ్‌కు బదిలీచేశారు. ఈ లావాదేవీ మనీలాండరింగ్ లో భాగమన్నది ఈడీ ప్రధాన ఆరోపణ.

# రెండునెలలపాటు ఆహారం నిల్వచేసుకోండి

## పీవోకే యంత్రాంగం ప్రజలకు సూచనలు



**ఇస్లామాబాద్, మే 2:** పహల్గాం ఉగ్రదాడితో భారత్ పాకిస్థాన్‌లమధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కశ్మీర్ వివాదాన్ని పూర్తిగారూపుమాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పూర్తిగా స్వాధీనంచేసుకోవాలని అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు సూచనలు వినిపిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ఆహారం నిల్వచేసుకోవాలంటూ స్థానికులను పీవోకే యంత్రాంగం అప్రమత్తంచేసింది. రెండునెలలకు సరిపగా ఆహారం నిల్వచేసుకోవాలని వాస్తవాధీన రేఖకు సమీపంలో ఉన్న 13 నియోజకవర్గాలప్రజలకు సూచనలు చేసామని చౌద్రీ అన్వర్ ఉల్‌హక్ స్థానిక అసెంబ్లీలో శుక్రవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వం రూ.100 కోట్లతో ఎమర్జెన్సీ ఫండ్‌ను ఏర్పాటుచేసింది. ఆహారం ఔషధాలు ఇతర కనీస అవసరాల సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగకుండాచూసుకునేందుకు ఈమొత్తం కేటాయించినట్లు ఉల్‌హక్ తెలిపారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలోనే దొంగదెబ్బతో పీవోకేను తన నియంత్రణలోకి తీసుకున్న పాకిస్థాన్ ఆప్రాంత అభివృద్ధిని గాలికొదిలేసింది. ఇండియాపై విద్రోహచర్యలకు పాల్పడేందుకు ఉపయోగించే ప్రదేశంగానే పీవోకేను పాక్‌చూస్తోంది. పీవోకే ప్రధానమంత్రి పీఠం అధిరోహించినవారు ఇస్లామాబాద్ సర్కారు చేతుల్లో కీలుబొమ్మగానే మిగిలిపోతున్నారు. ఫలితంగా స్థానికుల హక్కులకు రక్షణ లేకపోతోంది. దివాలా అంచున ఉన్న పాకిస్థాన్‌ను స్థానిక తిరుగుబాట్లు, వరుస ఉగ్రదాడులు సతమతంచేస్తున్నాయి. ఈపరిస్థితుల్లో అక్కడ భారత్ అనుకూల వాదం పెరుగుతోంది. భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఎంపి లార్డ్ మేఘనాథ్ ఇటీవల మాట్లాడుతూ కాశ్మీర్ వివాదం రూపుమాపాలంటే ఆక్రమిత కాశ్మీర్‌ను పూర్తిగా భారత్ స్వాధీనంచేసుకోవాలని భారత ప్రభుత్వానికి సూచించారు. అదొక్కటే అన్ని సమస్యలకు పరిష్కారం అన్నారు. ఉగ్రవాదులను శిక్షించేందుకు ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే భారత్ కఠినంగా జవాబివ్వాలనికోరారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి చాలాక్రూరమైనదని ఆవేదన వ్యక్తంచేసారు. కశ్మీర్ వివాదంలో ఈఘటనే చివరిది కావాలని ఆశాభావం వ్యక్తంచేసారు. ప్రధాని మోడీ నాయకత్వంలో భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్న ధీమా వ్యక్తం చేసారు.

# కేంద్ర మాజీ మంత్రి గిరిజా వ్యాస్ మృతి

## ఆమె లేని లోటు కాంగ్రెస్ పూడ్చుకోవడం కష్టం: టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్

**హైదరాబాద్,మే 2,ప్రభాతవార్త:** రాజస్థాన్‌కి చెందిన కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు గిరిజా వ్యాస్ (79) గురువారం సాయంత్రం మృతి చెందారు. గత మార్చి 31న ఆమె నివాసంలో పూజా కార్యక్రమం నిర్వహిస్తుండగా దురదృష్టవశాత్తూ ఆమె చీరకు మంటలు అంటుకున్నాయి. మంటల్లో తీవ్రంగా గాయపడిన గిరిజా వ్యాస్‌ను అత్యవసరంగా అహ్మదాబాద్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుండి ఆమె చికిత్స పొందుతున్నారు. తీవ్రంగా కాలిన గాయాల ప్రభావంతో ఆమె ప్రాణాలను కోల్పోయారు. ఆమె పివి నరసింహారావు మంత్రివర్గంలో కేంద్రమంత్రిగా సేవలందించారు. మహిళల హక్కుల కోసం, సామాజిక న్యాయ స్థిరీకరణ కోసం ఆమె ఎంతో కృషి చేశారు. ఆమె నిఖార్సైన నాయకత్వం, పార్లమెంటరీ విధానాలపై ఉన్న లోతైన అవగాహన రాజకీయ వర్గాల్లో విశేష గౌరవాన్ని పొందింది. గిరిజా వ్యాస్ రచయితగా కూడా ప్రసిద్ధి చెందారు, ఆమె రచనల ద్వారా సమాజంలో అభివృద్ధి, మార్పు సాధ్యమని నమ్మకం కలిగించారు. రాజస్థాన్ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా సమర్థవంతంగా పనిచేసిన నాయకత్వం కలిగిన గిరిజవ్యాస్ మరణం కాంగ్రెస్ కటుబానికి తీరని లోటని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ గిరిజా వ్యాస్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ గిరిజా వ్యాస్ మరణం బాధాకరం డాక్టర్ గిరిజా వ్యాస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ కేంద్ర మంత్రి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా అని అన్నారు. 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆమె 1991, 1996, 1999లో ఉదయపూర్ నుంచి హ్యాట్రిక్ విజయాలతో లోక్‌సభ ఎంపీగా ఎన్నికయ్యారని గుర్తుచేసుకొన్నారు. పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ హయాంలో ఆమె కేంద్ర మంత్రిగా బాధ్యతలను నిర్వహించారు. రాజస్థాన్ కాంగ్రెస్ చీఫ్‌గా పనిచేసి కాంగ్రెస్‌పార్టీ గెలుపునకు దోహదపడ్డారని కొనియాడారు.

GOVERNMENT OF INDIA : MINISTRY OF DEFENCE
EX-SERVICEMEN CONTRIBUTORY HEALTH SCHEME,
STATION HQ (ECHS CELL), SECUNDERABAD
Ph.: 7382361574 | E-mail : echsstnhqsecbad@gmail.com

EMPLOYMENT NOTICE

1. ECHS CELL, Headquarters Telangana and Andhra Sub Area invites applications to engage Medical, Para-Medical & Non-Medical Staff on contractual basis for a period of 12 Months for ESMs and Widows of Service Personnel and 11 Months for Civilian candidates at given locations of ECHS Polyclinics in Telangana and Andhra Pradesh.

| Appointment | Minimum Qualification | Salary (Rs) | Vacancies | Location of Vacancies (ECHS Polyclinics) |
|---|---|---|---|---|
| OIC Polyclinic | Graduate (Retired Defence Officers Drawing Pension from CDA) | 75,000/- | 02 | Eluru & Secunderabad-II |
| Medical Specialist | MD/MS in General Medicine | 1,00,000/- | 04 | Chittoor, Gidaluru, Gunturu & Secunderabad-I |
| Medical Officer | MBBS | 75,000/- | 07 | Chittoor, Eluru, Gunturu, Karimnagar, Secunderabad-I, Secunderabad-II & Vijayawada |
| Dental Officer | BDS | 75,000/- | 03 | Giddalur, Kadapa & Secunderabad-II |
| Dental Hygienist | Diploma in Dental Hyg/Class-I DH/DORA Course (Armed Forces) | 28,100/- | 12 | Anantapur, Eluru, Giddaluru, Golconda, Guntur, Kadapa, Khammam, Kurnool, Nellore, Secunderabad-I, Secunderabad-II & Sainikpuri |
| Pharmacist | B Pharmacy OR 10+2 with Science and Diploma in Pharmacy | 28,100/- | 03 | Eluru, Giddalur & Kurnool |
| Lab Technician | B Sc (Medical Lab Tech (MLT) OR 10+2 with Science and Diploma in Medical Lab Tech (DMLT) | 28,100/- | 07 | Chittoor, Eluru, Giddalur, Kadapa, Kurnool, Khammam & Nellore |
| Lab Assistant | DMLT/Class-I Lab Tech Course (Armed Forces) | 28,100/- | 03 | Giddalur, Secunderabad-I & Sainikpuri |
| Nursing Assistant | BSc Nursing, GNM/ Diploma/Class-I Nursing Assistant Course Cert from (Armed Forces) | 28,100/- | 01 | Nellore |
| Female Attendant | Literate | 16,800/- | 02 | Golconda & Secunderabad-II |
| Chowkidar | 8th Class or GD Trade for Armed Forces personnel | 16,800/- | 06 | Chittoor, Secunderabad-I, Secunderabad-II Vijayawada & Mahabubnagar |
| Driver | 8th Class/Class-I MT Driver (Armed Forces) | 19,700/- | 02 | Golconda & Sainikpuri |
| Safaiwala | Literate | 16,800/- | 04 | Guntur, Kurnool, Nellore & Vijayawada |
| Peon | 8th Class or GD Trade (Armed Forces) | 16,800/- | 01 | Vijayawada |

PLEASE READ ALL INSTRUCTIONS CAREFULLY

**(2) For Terms & Conditions, Application Form & Remuneration**: For qualifications, work experience and age limits, kindly see website www.echs.gov.in. Application Form can be downloaded from the website under **EMPLOYMENT OPPORTUNITIES.** For additional details, contact on Tele No 07382361574 & email ID : echsstnhqsecbad@gmail.com during working hours. Preference will be given to the Ex-Servicemen. **(3) Last Date of Receipt of Application as per Format Given at our Website.** Application as per format alongwith self attested photocopies of testimonials for educational qualification (with Mark Sheets), work experience, Registration Certificates, Discharge book & PPO) will be submitted to Officer-in-Charge, Station HQ ECHS Cell, HQ TASA, Near Rastrapati Nilayam, Secunderabad 500010, Telangana by **16 May 2025 (1800hours).** Any application received after **16 May 2025** will not be accepted. **Online applications will not be accepted. (4)** Interview Date, Timing & Venue : Date & Time of interview will be intimated to all Accepted applicant through email. (5) Candidates meeting the Qualitative Requirements will only be called for interview. Candidates must bring all the original educational certificates, along with work experience and discharge book, PPO, Service Records and two PP size colour photographs at the time of interview. No TA/DA is admissible.

**NOTE : CANDIDATES NOT SUBMITTING COMPLETE / INCORRECT DOCUMENT WILL NOT BE CALLED FOR INTERVIEW.**

# పార్టీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు.. పురుమళ్లను బహిష్కరించండి

## గాంధీభవన్‌కు చేరిన కరీంనగర్ కాంగ్రెస్ రాజకీయం

## పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు నాయకుల ఫిర్యాదు

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** కరీంనగర్ కాంగ్రెస్‌లో రెండు భిన్నధ్రువాలు సంఘర్షించుకోవడంతో గాంధీభవన్ వరకు ఫిర్యాదుల పరంపర మొదలైంది. శుక్రవారం గాంధీభవన్‌కు వచ్చి పురుమళ్ల శ్రీనివాస్‌ను పార్టీ నుంచి బహిష్కరించాలని పిసిసి ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. పురుమళ్ళ శ్రీనివాస్ విషయంలో గత నెల 28న ఎపిసిసి కార్యదర్శి విశ్వనాథ్ సమక్షంలో గొడవ జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ పట్ల ఆయన అనుచిత వ్యాఖ్యలు చేయడం కూడా కలకలం కలిగించింది.
కిరాయి గూండాలను పిలించుకొని దాడి చేయడానికి ప్రయత్నం చేశారని ఫిర్యాదులో వారు పేర్కొ న్నారు. కరీంనగర్ లోకసభ ఇన్‌ఛార్జి వెలిచాల రాజేందర్ రావు నేతృత్వంలో మరో బృందం కూడా పిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్‌ను కలిసింది. పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్న పురుమళ్ల శ్రీనివాస్‌పై తక్షణమే చర్యలు తీసు కోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు పిసిసి చీఫ్‌కు వినతిపత్రం సమర్పించింది. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో పురు మళ్ల శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నా యని, ఆయనను బహిష్కరిస్తేనే కరీంనగర్‌లో పార్టీ బలో పేతం అవుతుందని వివరించారు.
గత ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్‌కు అమ్ముడు పోయారని, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులతో లోపాయి కారి ఒప్పందం చేసుకున్నారని కరీంనగర్ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. టీపీసీసీ చీఫ్‌ను కలిసిన వారిలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్, పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ జనద్ రహమాత్ హుస్సేన్, బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, డీసీసీ పార్టీ వైస్‌ప్రెసిడెంట్ మడుపు మోహన్ తదితరులున్నారు.

**నివేదిక తెప్పించుకుంటా: పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్**

కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులు, ఇటీవల జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఇన్‌ఛార్జి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన అంశాలపై పూర్తి స్థాయిలో నివేదిక తెప్పించుకుంటానని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కరీంనగర్ కాంగ్రెస్ నాయకులకు మాట ఇచ్చారు. పార్టీ పరువు తీసే విధంగా వ్యవహరిస్తూ, గీత దాటిన వారెవరైనా సరే కఠినంగా వ్యవహరిస్తామని, అధిష్టానం సూచనలు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పై వ్యక్తిగత దూషణలకు దిగడం సరైంది కాదని, ఈ విషయంలో ఎంతటివారు సహించేది లేదన్నారు.
ఏప్రిల్ 28న జరిగిన సమావేశానికి హాజరైన ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ పెరుమాళ్, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్య నారాయణలతో పాటు ఇతర పార్టీ బాధ్యుల నుండి నివేదికలు తెప్పించుకుంటానని హామీ ఇచ్చారు. స్థానికంగా ఎదురైన ఇబ్బందులను అధిష్టానం దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలి తప్ప పార్టీ పరువు బజారుకీడ్చే విధంగా వ్యవహరించే వారిని ఉపేక్షించేది లేదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.
పార్టీ నాయకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పార్టీలో అధిష్టానమే సుప్రీం అన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని వ్యాఖ్యానించారు. పురుమళ్ళ శ్రీనివాస్ వ్యవహారంపై పార్టీ నేతల ద్వారా తెలుసుకున్నానని, వెలిచాల రాజేందర్‌రావు కూడా తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

# డీమ్డ్ వర్సిటీల గుర్తింపులో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర ఉండేలా చర్యలు!

## కోర్టులో కౌంటర్ దాఖలు చేయనున్న సర్కార్

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న డీమ్డ్ యూనివర్సిటీలపై రాష్ట్ర ప్రభుత్వ అజమాయిషీ లేకుండా పోతుందని.. డీమ్డ్ యూనివర్సిటీల మంజూరులో రాష్ట్ర ప్రభుత్వం పాత్ర ఉండేలా చూడాలని రాష్ట్ర సర్కార్ భావిస్తోంది. ఇందుకు సంబంధించిన ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించిన రాష్ట్ర ప్రభుత్వం త్వరలో కౌంటర్ దాఖలు చేయనున్నట్టు తెలుస్తోంది. తెలంగాణలోని విద్యా సంస్థలకు యూజీసీ మంజూరు చేసే డీమ్డ్ యూనివర్సిటీ హోదా తుది తీర్పునకు లోబడి ఉంటుందని హైకోర్టు ఈ నెల 24న స్పష్టం చేసింది. ఇకపై విద్యా సంస్థలకు ఈ హోదా కల్పించే ఉత్తర్వుల్లో ఇదే విషయాన్ని పేర్కొనాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండా ప్రైవేటు విద్యా సంస్థలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజిసి) ఈ హోదా కల్పించడాన్ని సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సందర్భంగా కోర్టు పై విధంగా వ్యాఖ్యానించింది. రాష్ట్ర సర్కార్ దాఖలు చేసిన పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ యారా రేణుకలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టగా.. అడ్వొకేట్ జనరల్(ఏజి) సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. డీమ్డ్ యూనివర్సిటీలకి గుర్తింపు ఇచ్చే అంశంలో రాష్ట్ర ప్రభుత్వ పాత్రను యూజిసి పరిమితం చేస్తున్నాయని.. డీమ్డ్ యూనివర్సిటీ హోదాకు సంబంధించి నియమాలను రూపొందించే అధికార పరిధి కేంద్రానికి లేదని వాదించారు. ఆ యూనివర్సిటీల వల్ల ఏదైనా జరిగితే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉంటుందని.. దానికితోడు ఆఫ్ క్యాంపస్ పేరుతో పలుప్రాంతాల్లో వాటి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. విశ్వవిద్యాలయాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనివని రాజ్యాంగంలో స్పష్టంగా ఉందని కోర్టుకు తెలిపారు. కొత్త నియమాల ప్రకారం డీమ్డ్ సర్టిఫికెట్‌ను ప్రభుత్వం ధ్రువీకరించాలని.. అయితే 60 రోజుల్లో ధ్రువీకరించకపోతే అది ఆమోదం పొందినట్లుగా బావించాలనే నిబంధన ఉందన్నారు. మెరుగైన రేటింగ్ కోసం న్యాక్ అధికారులతో కుమ్మక్కై సీబీఐ దర్యాప్తును ఎదుర్కొంటున్న డీమ్డ్ యూనివర్సిటీలున్నాయన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఏజి కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. రాజ్యాంగం 7వ షెడ్యూలులోని 66వ ఎంట్రీ ద్వారా అధికారం ఉందన్న యూజీసీ వాదన సరికాదని.. యూజిసి నిబంధనల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని హైకోర్టును కోరారు. అయితే యూనివర్సిటీల తరపు న్యాయవాదులు .... నిబంధనల ప్రకారమే యూజిసి ఉత్తర్వులు జారీ చేసిందని.. నిబంధనలను రద్దు చేయనంతవరకు అవి అమల్లో ఉన్నట్లేనని.. అందువల్ల ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయరాదని హైకోర్టుకి విజ్ఞప్తి చేశారు. విద్యా సంస్థలకు మంజూరు చేసిన డీమ్డ్ యూనివర్సిటీ హోదా తుది తీర్పునకు లోబడి ఉంటుందని, ఇదే విషయాన్ని ఇకపై మంజూరు చేసే ఉత్తర్వుల్లో ప్రస్తావించాలని యూజిసిని హైకోర్టు ఆదేశించింది. ప్రతివాదులైన యూజీసీ, డీమ్డ్ యూనివర్సిటీలకు హైకోర్టు నోటీసులు జారీ చేస్తూ.. జూన్ 30లోగా కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తుది విచారణను జులై 30కి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో జూన్ 30లోపుగా ప్రభుత్వం తరపున కౌంటర్ దాఖలు చేయాలని.. డీమ్డ్ యూనివర్సిటీల ఆగడాలను అరికట్టేలా వాటిపై రాష్ట్ర ప్రభుత్వ అజమాయిషీ ఉండేలా చూడాలని రాష్ట్ర సర్కార్ భావిస్తోంది.

# దూపదీప నైవేద్య పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** దూపదీప నైవేద్య పథకానికి తెలంగాణ దేవాదాయశాఖ దరఖాస్తులకు ఆహ్వానం పలికింది. గ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగిన దేవాలయాల నుంచి ఈ దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ పథకం ద్వారా ఎంపిక చేసిన ఆలయాలకు నెలకు రూ.4000, అర్చకునికి నెలకు రూ.6000 దేవాదాయ శాఖ చెల్లిస్తుందని ఆ శాఖ డైరెక్టర్ వెంకటరావు తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని ఓ ప్రకటనలో కోరారు. కాగా సదరు ఆలయం కనీసం 15 యేళ్ల కింద నిర్మితమై ఉండాలన్నారు.

# సర్వే వందకు వందశాతం సక్సెస్



శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

## రాబోయే రోజుల్లో దేశ ప్రధానిగా రాహుల్

## పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** దేశంలో కాంగ్రెస్ పాలన కోరుకుంటుండటంతో రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా రాబోయే ఎన్నికల్లో ప్రజలు చేస్తారని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడి యాతో మాట్లాడుతూ ప్రజలు రాహుల్ గాంధీ హయంలో కుల మతా లకు అతీతంగా పాలన సాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దేశం సుఖశాంతితో ఉండాలి అంటే రాహుల్ గాంధీ ప్రధాని కావాలి, ఇందిరమ్మ రాజ్యం రావాలి అని ఆయన అన్నారు. సీఎం రేవంత్ కుల గణన చేసిన నెల రోజులపాటు కిషన్‌రెడ్డి తెలంగాణలో లేడు కాబట్టి ఆయనకు అవగాహన లేదు,అందుకే కుల గణన పై విమర్శలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణనపై చర్చకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సిద్ధమా అని ఆయన అన్నారు. రేవంత్‌రెడ్డి నిర్ణయం మేరకు కుల గణన కమిటీ చైర్మన్‌గా ఉత్తమ్, సభ్యులుగా పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహా, సీతక్క, శ్రీధర్‌బాబు, మల్లు రవి సర్వేను సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేశారని ఆయన అన్నారు. క్షేత్ర స్థాయికి సర్వే బృందం ఇంటింటికి వెళ్లింది. కిషన్‌రెడ్డికి విషయం తెలుసుకోవాలి అని ఆయన అన్నారు. రేవంత్ సక్సెస్ అయ్యాడు కాబట్టి డైవర్ట్ చేసి బురద జల్లే ప్రయత్నం చేయకండి అని అన్నారు. 100 శాతం సర్వే సక్సెస్ ఫుల్ గా జరిగింది. గవర్నర్ కూడా ఆమోదముద్ర వేశారు అంటే సర్వే సరిగా జరిగింది అనే కదా..? సర్వే జరిగిన నెల రోజుకు కిషన్ రెడ్డి తెలంగాణ లో లేరు అనుకుంట అందుకే ఆయనకు కుల గణన మీద పూర్తిస్థాయిలో అవగాహన లేదని ఎకసెక్కాలు పలికారు. ప్రజలకు మేలు జరగాలి అనేదే రాహుల్ గాంధీ అజెండా అందులో భాగమే తెలంగాణ లో కుల గణన చేయించారని ఆయన అన్నారు. కిషన్ రెడ్డి మీ బిజెపి పాలిత రాష్ట్రాల్లో కుల గణన సంగతి చూసుకో అని సలహా ఇచ్చారు. తెలంగాణ లో ఉరికే గుర్రం ఉంది ఉరికే గుర్రాన్ని ఎందుకు పొడుస్తున్నావు కిషన్ రెడ్డి అని జగ్గారెడ్డి నిలదీశారు.

# మోడల్ స్కూళ్లలో ఇంటర్ అడ్మిషన్లకు 5 నుంచి దరఖాస్తులు

## 26న స్కూల్ వారీగా జాబితా ప్రకటన

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లకు నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ నెల 5 నుంచి దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరక్టర్ శ్రీనివాసాచారి తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 5 నుంచి 20వ వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. 22న పాఠశాల వారీగా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ప్రకటిస్తారు. ఈ నెల 26న సెలెక్షన్ లిస్టును ప్రకటించనున్నారు. సెలెక్ట్ అయిన విద్యార్థులకి ఈ నెల 27 నుంచి 31 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తారు. జూన్ 2 నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు క్లాసులను ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఇంగ్లీష్ మీడియంలో ఎంపిసి, బైపిసి, సిఈసి గ్రూపులో ప్రతి గ్రూప్‌లో 40 మంది చొప్పున అడ్మిషన్లు తీసుకోనున్నట్టు తెలిపారు.



# మున్సిపల్ ఛాంబర్స్‌లో షార్ట్‌సర్క్యూట్.. రూ.కోటి నష్టం

## ప్రభుత్వం ఆదుకోవాలి : ఛాంబర్స్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** రాష్ట్ర మున్సిపల్ చైర్మన్ ఛాంబర్స్ భవనంలో విద్యుత్ షాట్‌సర్క్యూట్ అయింది. హిమాయత్‌నగర్‌లో ఉన్న కార్యాలయంలో ఫర్నిచర్, సంబంధిత ఫైల్స్, తదితర సామాగ్రి విద్యుత్ షాట్‌తో పూర్తిగా దగ్ధం కాగా, భారీగా పెద్ద నష్టం జరిగింది. అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపులోకి తీసుకుని వచ్చారు. విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన మున్సిపల్ ఛాంబర్ రాష్ట్ర చైర్మన్ వెన్‌రెడ్డి రాజు భవనాన్ని సందర్శించారు. షాక్ సర్క్యూట్‌కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో చైర్మన్లు సొంతం నిధులతో నిర్మించుకున్న భవనం అన్నారు. పురపాలికలో విప్లవాత్మక మార్పునకు వేదిక అయిందన్నారు. సమర్ధవంతమైన పాలన అవగాహన చైర్‌పర్సన్ల సమస్యలు మెరుగైన పురపాలికకు సంబంధించి అనేక అంశాలకు దిక్సూచిగా నిలవడమే కాకుండా పూర్తిస్థాయిలో పురపాలక సంఘాలు పటిష్టవంతం చేయడంలో పలు సమస్యలను పరిష్కరించడంలో సమర్థంగా పనిచేసిందన్నారు. ఎంతో చారిత్రత్మకమైనటు వంటి ఈ ఛాంబర్‌లో విద్యుత్ షాట్ సంభవించడం బాదేసిందన్నారు. ఈ భవన పున:నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు.

# గొర్రెల పంపిణీ కుంభకోణంలో మళ్లీ కదలిక

## యేడాదిన్నర తర్వాత పట్టుబడిన కాంట్రాక్టర్ మొయినుద్దీన్

## ఇంట్లో సోదాలు చేసిన ఎసిబి

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన గొర్రెల పంపిణీ కుంభ కోణం కేసులో ఏడాదిన్నర తరువాత మళ్లీ కదలిక వచ్చింది. ఈ కేసులో 18 నెలలుగా పరారీలో వున్న కాంట్రాక్టర్ మొయినుద్దీన్‌ను ఎసిబి అధికారులు శుక్రవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్టు చేశారు. 2023 డిసెంబర్ నెలలో వెలుగు చూసిన ఈ స్కాంలో ఇప్పటి వరకు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఓఎస్‌డి కల్యాణ్ సహా 17 మంది అరెస్టవడం తెలిసిందే. అ రెస్టయిన వారిలో పశుసంవర్ధక శాఖ అధికారులతో పాటు దళారులు వున్నారు. అయితే ఇందులో ప్రధాన కాంట్రాక్టర్ మొయినుద్దీన్ ఈ స్కాం వెలుగులోకి వచ్చి ంది మొదలుకుని పరారీలో వున్నాడు. అతనితో పాటు మరో ఇద్దరు కీలక నిందితులు ఇంకా పరారీలోనే వున్నారు. మొయినుద్దీన్ దుబాయ్‌లో తలదాచుకోగా అతని కోసం లుకవుట్ నోటీసులు కూడా జారీ అయ్యాయి. శుక్రవారం ఉదయం అతను దుబాయ్ నుంచి హైదరాబాద్ రాగా దీనిపై సమాచారం అందుకున్న ఎ సిబి అధికారులు అతని విమానాశ్రయంలోనే అరెస్టు చేశారు. కాగా అంతకు ముందు గురువారం రాత్రి కోకాపేట్‌లోని మూవీ టవర్స్‌లో వున్న మొయినుద్దీన్ నివాసంలో ఎసిబి అధికారులు సోదాలు చేశారు. ఈ సందర్భంగా ఇంట్లో వున్న మొయినుద్దీన్ సతీమణి దీనిని అడ్డుకోగా ఎసిబి అధికారులు దీనిని పట్టించుకోలే దు. అనం తరం ఇంట్లోని పత్రాలను తనిఖీ చేసి కొన్నింటిని జప్తు చేశారు. గొర్రెల పంపిణీ స్కాంలో నిం దితుడుగా వున్న మొయినుద్దీన్ తన ఖాతా నుంచి భా రీగా నగదును భార్య ఖాతాకు బదిలీ చేసినట్లు ఎసిబి అధికారులు గుర్తించారు. ఈ స్కాంలో 700 కోట్ల రూపాయలు గోల్‌మాల్ జరిగినట్లు ఎసిబి గుర్తించింది. ఇదే కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) కూడా రంగంలో దిగి విచారణ చేబట్టింది.

# ఎసిబి దూకుడు..

## ఏప్రిల్‌లో 21 కేసులు నమోదు

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అవినీతి అధికారులను ఎసిబి హడలెత్తిస్తోంది. ఏప్రిల్ నెలలో మొత్తం మీద 21 కేసులను నమోదు చేయగా ఇం దులో 13 లంచాలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయినవి వున్నాయి. అక్రమాస్తులకు సంబంధించిన కేసులు రెండు వుండగా, దుష్ప్రవర్తన కేసులు మ రో రెండు, సాధారణ విచారణ కేసులు ఇంకో రెండు, తనిఖీలకు సంబంధించినవి మరో రెండు వున్నాయి. కాగా ఎసిబి దాడుల్లో మొత్తం 20 మంది లంచావ తారులు పట్టుబడగా వీరిని రిమాండుకు తరలించారు. ఇక అక్రమాస్తుల కేసుల్లో ఇద్దరు అధికారుల ఇళ్లలో సోదాలు చేయగా ఒకరి వద్ద 3.51 కోట్ల రూపాయల ఆస్తులు, మరో అధికారి వద్ద 200 కోట్ల రూపాయల ఆస్తులు పట్టుబడ్డాయి. కాగా ఎసిబి అధికారుల దాడుల్లో నలుగురు పోలీసు అధికారులు కూడా అరెస్టయా ్యరు. వీరిలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, మరో ఇద్దరు ఎస్‌ఐలు వున్నారు. ఎసిబికి దొరికిపోయిన పోలీసుల్లో భద్రాచలం టౌన్ సిఐ బరపాటి రమేష్, మంచిర్యాల జిల్లా నస్పూర్ ఎస్‌ఐ నెల్కి సుగుణాకర్ వున్నారు. శామీర్‌పేట్ ఎస్‌ఐ పరశురాం కూడా ఎసిబికి దొరికిపోయిన వారిలో వున్నారు. అక్రమాస్తుల కేసులో అరెస్టయిన వా రిలో కాళేశ్వరం ఈఎన్‌సి హారీరాంతో పాటు మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి మహమ్మద్ గౌస్ పాషా వున్నారు. ఇందులో హారిరాం వద్ద 200 కోట్ల రూపాయల ఆస్తులు వెలుగు చూడా గౌస్ పాషా వద్ద 3.51 కోట్ల రూపాయల ఆస్తులు రట్టయ్యాయి.

# కగార్ ఆపరేషన్ నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలి

## రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామని సదస్సు తీర్మానం

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 2, ప్రభాతవార్త:** కగార్ ఆపరేషన్‌ను నిలిపివేసి మావోయిస్టులతో తక్షణమే చర్చలు జరపాలని కోరుతూ గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ద్వారా కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలను అంద జేయాలని సదస్సు తీర్మానించింది. కగార్ ఆపరే షన్‌కు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలో ఈ నెల 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు సభలు, సమావేశాలు, సదస్సులు, మానవ హారాలు తదితర కార్యక్రమాలు నిర్వహించాలని సదస్సు నిర్ణయించింది. వామ పక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో బేషరుతుగా శాంతి చర్చలు జరపాలని-ఆదివాసీలను హననం చేసే ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని' డిమాండ్ చేస్తూ నిర్వహించిన సదస్సులో చేసిన వామపక్షాల నేతలు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సదస్సులో తీర్మానాలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టారు. ఈ సదస్సులో పాల్గొన్న విశ్రాంత హైకోర్టు జడ్జి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ కాల్పుల్లో పోలీసులు, మావోయిస్టులు, ఆది వాసీలు ఎవరూ చని పోయినా వారి కుటుంబ సభ్యులకే కాకుండా సమా జానికి బాధాకర మని ఆవేదన వ్యక్తం చేశారు. మేధావులంతా కలిసి చర్చించుకుని 'ఒక శాంతి కమిటీ'ని ఏర్పాటు చేసుకుని చర్చలు జరపాలని విజ్ఞప్తి చేశామని, తమ విజ్ఞప్తికి స్పందిస్తూ మావోయిస్టులు తాము చర్చలకు సిద్దంగా ఉన్నామని, ఆయుధాలు ఉపయో గించబోమని ప్రకటించడమే కాకుండా అప్పటి నుంచి ఎక్కడ కాల్పులు జరపలేదన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం కర్రెగుట్టలను వేలాది మంది సాయుధ పోలీస్ బలగాలతో చుట్టుముట్టాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో సమాధానం చెప్పాలని చంద్రకుమార్ కే ంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ



సదస్సులో తీర్మానాలు ప్రవేశపెడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కర్రెగుట్ట వద్ద జాతీయ జెండాను ఎగరవేయడం ఏమిటని, ఆది భారతదేశంలో లేదా?, ఆ ప్రాంతాన్ని ఏదేశమైన అక్రమిస్తే కేంద్ర సాయుధ బలగాలు యుద్ధం చేసి విముక్తి చేశాయా? సరైనా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో వామపక్షాల నేతలు, ప్రజా సంఘాల నేతలు వేములపల్లి వెంకట్రామయ్య, విమలక్క, సి. హెచ్.మురహరి, జానికిరాములు, గాదగోని రవి, విశ్వనాథ్, ప్రసాద్, రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులకు రుణమాఫీ

## మార్గదర్శకాలను జారీ చేసిన చేనేత శాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** తెలంగాణలోని చేనేత కార్మికులకు అసలు, వడ్డీ కలిపి రూ.లక్ష వరకు ప్రభుత్వం రుణమాఫీ చేయనుంది. ఈ పథకంలో భాగంగా 2017 ఏప్రిల్1వ తేదీ నుంచి 2024 మార్చి 31 వరకు అన్ని బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో వ్యక్తిగతంగా చేనేత వస్త్రాల ఉత్పత్తి, కార్యనిర్వహణ మూలధనం, ఇతర వృత్తి సంబంధిత కార్యకలాపాల కోసం రుణాలు తీసుకున్న వారికే వర్తిస్తుందని రాష్ట్ర చేనేత శాఖ వెల్లడించింది. ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన, చేనేత క్రెడిట్ కార్డుల కింద తీసుకున్న రుణాలను సైతం మాఫీ చేయనున్నట్లు వివరించింది. దీనిపై రుణమాఫీ అమలుపై రాష్ట్ర చేనేతశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉండే జిల్లాస్థాయి కమిటీలో డీసీసీబీ సీఈవో, చేనేతశాఖ ఆర్‌డీడీ, లీడ్ బ్యాంక్ మేనేజర్, నాబార్డు డీజీఎం, పరిశ్రమల శాఖ జీఎం, జిల్లా సహకార అధికారి సభ్యులుగా ఉంటారు. చేనేతశాఖ ఏడీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. జిల్లా పరిధిలో చేనేత కార్మికులు నిర్దిష్టకాలంలో రుణాలు పొందిన వివరాలను శాఖ ఏడీలు బ్యాంకర్ల నుంచి తీసుకోవాలి. వాటి ఆధారంగా కార్మికులవారీగా క్లెయిమ్‌లను తయారుచేసి జిల్లాస్థాయి కమిటీ ఆమోదం కోసం పంపించాలి. జిల్లాస్థాయి కమిటీ ఆమోదం తర్వాత రాష్ట్ర స్థాయి కమిటీకి ప్రతిపాదనలు పంపిస్తారు. చేనేతశాఖ డైరెక్టర్ అధ్యక్షత వహించే ఈ కమిటీలో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ, టెస్కాబ్,నాబార్డు రాష్ట్రస్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారు. అదనపు డైరెక్టర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.రుణమాఫీ అనంతరం కార్మికులు కోరుకుంటే మళ్లీ ఆమేరకు రుణాన్ని బ్యాంకులు మం జూరు చేస్తాయి. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి సత్వరమే అర్హులైన చేనేత కార్మికుల రుణమాఫీకి జిల్లాల ఏడీలు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

# కేబుల్ వైర్లను తొలగిస్తుండగా యువకుడికి విద్యుత్ షాక్

**హైదరాబాద్ (శేరిలింగంపల్లి), మే 2, ప్రభాతవార్త:** మిస్‌వరల్డ్ అందాల పోటీలు ఓ యువకుడి ప్రాణాల మీదకు తెచ్చాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రధాన రహదారుల వెంబడి అనవసరంగా ఉన్న కేబుల్ వైర్లను తొలగించే క్రమంలో విద్యుత్ శాఖలో కాంట్రాక్టర్ వద్ద ఎలక్ట్రికల్ వర్క్ చేస్తున్న యువకుడికి విద్యుత్ షాక్ తగిలింది. 40శాతం కాలిన గాయాలతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం రుంకు హనుమంతపురం గ్రామానికి చెందిన కృష్ణారావు కుమారుడు వై.ఉపేందర్ (23) మూసాపేట్ ప్రగతినగర్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఉపేందర్ గత మూడు సంవత్సరాలుగా టీజీఎస్‌పిడీసీఎల్‌లో కాంట్రాక్ట్ డ్రైవర్ అండ్ ఎలక్ట్రికల్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. హైదరాబాద్ వేదికగా ఈనెల 7వ తేది నుంచి మిస్ వరల్డ్ పోటీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది. దీనిలో భాగంగా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, ప్రధాన రహదారుల వెంబడి చిందర వందరగా ఉన్న కేబుల్,విద్యుత్ వైర్లను తొలగించాలని ఆదేశాలు అందటంతో శుక్రవారం గచ్చిబౌలి ఫ్లైఓవర్ సమీపంలో ఉన్న జీప్ షోరూం వద్ద విద్యుత్ కాంట్రాక్టర్ సిబ్బందితో కేబుల్ వైర్లను తొలగించే పనిచేస్తున్నారు. ఉపేందర్ కూడా ఈ కేబుల్ వైర్లను తొలగించే పని చేస్తుండగా మధ్యాహ్నం 12గంటల సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే తోటి కార్మికులు విద్యుత్ శాఖ అధికారుల సహాయంతో సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపతికి తరలించారు. ఉపేందర్ రెండు చేతులు, తల, కుడి కాలికి 40శాతం గాయాలయ్యాయని వైద్యులు తెలిపారు. ఈమేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# భూదాన్ భూముల వ్యవహారంలో కర్నూలు బిల్డర్ హస్తం

## సదరు రియల్టర్‌ను నమ్మి మోసపోయిన బ్యూరోక్రాట్లు?

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన భూదాన్ భూముల వ్యవహారంలో కర్నూలుకు చెందిన బిల్డర్ హస్తం వున్నట్లు తెలిసింది. ఈ గోల్‌మాల్ వ్యవహారంలో భూములుకొని ఇబ్బందులు పడుతున్న సీనియర్ ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లను కూడా సదరు బిల్డర్ మోసం చేసినట్లుగా పోలీసులు అనుమా నిస్తున్నారు. తాము ఖరీదు చేసిన భూములు భూదాన్ భూములు కావని, దాని పక్కనే వున్న పట్టా భూములని బ్యూరోక్రాట్లు వాదిస్తుండడం తెలిసిందే. అయితే వీరి వాదనలను హైకోర్టు సింగిల్ బెంచ్ పట్టించుకోకుండా ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని రంగారెడ్డి కలెక్టర్‌ను ఆదేశించడం విదితమే. దీనిపై బ్యూరోక్రాట్లు డివిజన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేయగా ఈ విషయంలో సింగిల్ బెంచ్ వద్దే తేల్చుకోవాలని ధర్మాసనం పేర్కొనడంతో అసలు భూదాన్ భూ ముల విషయంలో ఏం జరిగిందనే దానిపై సచివాలయంతో పాటు ప్రభుత్వ విభాగాల్లో చర్చ మొదలయ్యింది. దీనికంతటికి కర్నూలుకు చెందిన ఓ బడా బిల్డర్ కారణంగా కొందరు చెబుతున్నారు. మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో సర్వే నంబర్ 181, 182, 194, 195లో గల భూమున్నీ భూదాన్ భూములని స్థానికులు చెబుతున్నారు. ఈ భూముల్లో దశాబ్దాలుగా రైతులు సాగుచేస్తుండగా అమోయ్ కుమార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా వున్నపుడు వున్నట్లుండి 50 ఎకరా లను రైతుల నుంచి బలవంతంగా తీసుకుని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. ఇందులో కొంత భూమిని ఐఎఎస్, ఐపిఎస్‌లు మధ్యవర్తుల ద్వారా ఖరీదు చేశా రని అభియోగం ఎదుర్కొంటున్నారు. అయితే తాము కొన్న భూములు భూదాన్ భూములు కావని, దాని పక్కనే వున్న ప్రైవేటు భూములని బ్యూరోక్రాట్లు వాది స్తున్నారు. ఈ అంశం ఇప్పుడు కోర్టు పరిధిలో వుంది. అయితే భూదాన్ భూముల్లో కొంత భాగాన్ని కర్నూలుకు చెందిన ఓ బిల్డర్ తనకు తెలిసిన దళారుల ద్వా రా కొని పలు దఫాలు విక్రయించి చివరగా బ్యూరోక్రాట్లకు అమ్మాడని సచివాలయంలో ప్రచారం జరుగుతోంది. గచ్చిబౌలిలో నివసించే సదరు బిల్డర్‌ను నమ్మిన ందుకు బ్యూరోక్రాట్లు నిండా మునిగారని పోలీసు శాఖలోనూ ప్రచారం జరుగుతోంది. సదరు బిల్డర్ ఉమ్మడి ఎపిలోనే బాగా పలుకుబడి, పరపతి కలిగిన వ్యక్తిగా పేరొందాదని చెప్పుకుంటున్నారు. తక్కువ ధరకు భూదాన్ భూములను కొన్న సదరు బిల్డర్, కొంత కమీషన్ తీసుకుని వాటినే బ్యూరోక్రాట్లకు అమ్మి చేతులు దు లుపుకున్నట్లు సచివాలయంలో చెప్పుకుంటున్నారు. బ్యూరోక్రాట్లకు అమ్మిన భూమిని కొన్ని సంవత్సరాల తరువాత వారి నుంచి పర్సంటేజి కింద తీసుకుని విల్లాలు నిర్మించేందుకు సదరు బిల్డర్ ప్రయత్నించాడని చెప్పుకుంటున్నారు. ఉమ్మడి ఎపిలో ఇలా అనేకచోట్ల అమాయకులను నిండా ముంచిన ఘనత సదరు బిల్డర్‌కు వుందని సచివాలయంలో ప్రచారం జరుగుతోం ది. బ్యూరోక్రాట్లతో పాటు అనేక మందిని ఇతను మోసం చేశాడని వార్తలు వస్తున్నాయి. దీనిపై పోలీసు శా ఖ విచారణ చేబట్టినట్లు సమాచారం.

# సింగరేణి ఉద్యోగాల గనిగా మారాలి

## యువతకు ఉపాధి కల్పనే మా లక్ష్యం

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** సింగరేణి కాలరీస్ ఇక ముందు కూడా అభివృద్ధి పథంలో ముందుకు వెళుతూ వేల మందికి ఉపాధి చూపే ఉద్యోగాల గనిగా రూపుదిద్దుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. సింగరేణి సంస్థ ప్రయోజనాల దృష్ట్యా కఠినమైన నిబంధనలు అమలు చేస్తూ ముందుకెళ్లాలన్నారు. ఉద్యోగులకు కష్టంగా ఉంటుందని ఉదాసీనంగా వ్యవహరించడం వల్ల రాబోయే రోజుల్లో ఇబ్బందుల పాలవు తామని, నిబంధనలతో, క్రమశిక్షణతో కూడిన అడుగులు వేయాలని హెచ్చరించారు. హైదరాబాద్‌లో శుక్రవారం సాయంత్రం ఆయన సింగరేణిలో కారుణ్య నియామకం పొందిన 21 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవతా దృక్పథంతో కారుణ్య ఉద్యోగాలలో గరిష్ట వయోపరిమితిని 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచేందుకు అనుమతినిచ్చినట్టు చెప్పారు. దీనివల్ల వయో పరిమితి దాటిన అనేక వందల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం దక్కిందన్నారు. నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించడమే తమ లక్ష్య ప్రయత్నం. సింగరేణి సంస్థ నేడు పోటీ మార్కెట్లో ఇతరులతో పోటీపడి నిలబడాల్సిన పరిస్థితి ఉందని, కనుక సింగరేణి కార్మికులు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుంటూ పూర్తి పనిగంటలు పనిచేస్తూ కంపెనీని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణిని ఇతర రంగాల్లోకి, ఇతర రాష్ట్రాల్లోకి కూడా విస్తరిస్తున్నామని, ఈ ప్రణాళికలు విజయవంతం కావాలంటే ప్రతి ఒక్కరూ శ్రమ శక్తిని చాటాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు పెద్ద ఎత్తున స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో 9 వేల కోట్ల రూపాయలతో చేపట్టిన రాజీవ్ యువ వికాసం కింద లబ్దిదారులకు జూన్ 2న మంజూరు పత్రాలను అందజేస్తున్నట్లు వివరించారు. ఇది లక్షల మందికి ఉపాధి లభించే బృహత్ పథకంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా వయోపరిమితి సడలింపుకు అంగీకరించి, అనేక కుటుంబాల్లో వెలుగు నింపిన ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ కె.వెంకటేశ్వర్లు, అధికారుల సంఘం అధ్యక్షులు లక్షీ ప్రతిగౌడ్ , జీఎం

# ఇందిరమ్మ ఇళ్లు 600 చదరపు అడుగులకు మించవద్దు

## ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతంలో 500 ఇళ్లు

## 5 నుంచి 20వ తేదీ వరకు 28 మండలాల్లో భూభారతి..

## నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

## కలెక్టర్లు, ఎస్పీలతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇండ్లకు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. లబ్దిదారుల ఎంపిక ఎంతవరకు పూర్తయితే అంతవరకు ఏరోజుకారోజు ఇన్‌ఛార్జి మంత్రుల నుంచి లబ్దిదారుల జాబితాకు ఆమోదం తీసుకోవాలని అలాగే ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతంలో కనీసం 500 ఇండ్లను కేటాయించి లబ్దిదారులను ఎంపిక చేయాలని సూచించారు. శుక్రవారం ఆయన సచివాలయంలో చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావుతో కలిసి భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్లు, ఎస్.పి లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణం 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మాణం జరిగేలా కలెక్టర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.అనర్హులని తేలితే ఇండ్ల నిర్మాణం మధ్యలో ఉన్నాకూడా రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు.లిస్ట్1, లిస్ట్2 , లిస్ట్3 లతో సంబంధం లేకుండా నిరుపేదలను ఎంపిక చేయాలన్నారు.

**5 నుంచి 20వ తేదీవరకు..**

గత నెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో నిర్వహించిన మాదిరిగానే ఈనెల 5వ తేదీ నుంచి 20వ తేదీవరకు జిల్లాకొక మండలం చొప్పున 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని,పైలట్ మండలాల్లో వచ్చిన దరఖాస్తులను ఈనెల 31వ తేదీవరకు పరిష్కరించాలన్నారు. పరిష్కారం కాని వాటికి ఎందుకు పరిష్కరించడం లేదనే విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేస్తూ దరఖాస్తుదారులకు తెలియజేయాలని కలెక్టర్లకు సూచించారు.605 మండలాలకు గాను ఇప్పటి వరకు 590 మండలాల్లో అవగాహనా సదస్సులను నిర్వహించడం జరిగిందని ఇందులో 85,527 మంది పౌరులు, 1,62, 577 మంది రైతులు పాల్గొన్నారని తెలిపారు.ప్రభుత్వ భూముల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని, అసైన్డ్ ల్యాండ్స్ కు సంబంధించి పొజిషన్ మీద ఉండి పట్టా లేనివారు, పట్టాఉండి పొజిషన్ మీద లేనివారి వివరాలను సేకరించాలని సూచించారు.



**నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు**

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈనెల 4వ తేదీన జరగనున్న నీట్ పరీక్షకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.ఈ ఏడాది రాష్ట్రం నుండి 72,572 మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరవుతున్నారని ఇందుకోసం 24 జిల్లాల్లో 190 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరుతోపాటు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్ లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన సూచనలను ముందుగానే ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం చేయాలని సూచించారు.ఈ సమావేశం లో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, సి.సి. ఎల్. ఎ డైరెక్టర్ మకరంద్, హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి, వి. పి. గౌతమ్ , లా ఆర్డర్ డిఐజి మహేష్ భగవత్ తదితరులు పాల్గొన్నారు.

# బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించండి

## కేంద్రానికి రాష్ట్ర బిసి కమిషన్ లేఖ

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన బిసి రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని రాష్ట్ర బీసీ కమిషన్ కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ కేంద్ర ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం శాసన సభ ఆమోదించిన బిల్లుకు చట్ట రూపం కల్పించాలని అందులో కోరారు. అంతే కాకుండా రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం సైతం చొరవ తీసుకుని అఖిల పక్షంతో ప్రధాని మోదీని కలిసి ఒప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలనే లక్ష్యంతో 2024, జనవరి నుంచి ఎన్నికలు నిర్వహించలేదని తెలిపారు. జనాభా లెక్కలతోపాటు కుల గణన చేయాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు.

# రంగస్థల ప్రముఖుడు ఉదయభాను కన్నుమూత

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మే 2, ప్రభాతవార్త:** రంగస్థల ప్రముఖుడు గరికిపాటి ఉదయ భాను శుక్రవారం అనారోగ్యంతో ముషీరాబాద్ లోని హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన వయస్సు 78 యేళ్లు. భార్య ఇద్దరు కుమారులు. అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. చిన్న తనం నుంచి నాటకాలుపై ఆసక్తితో భూమిక సంస్థలో క్రియాశీలకంగా పాల్గొని పలు ప్రదర్శనలో పాలుపంచుకున్నారు. ఆధునిక థియేటర్‌లో పలు ప్రయోగాలు అంతర్జాతీయ థియేటర్‌కు అనుగుణం చేస్తూ తెలుగు నాటకానికి మరో దిశకు మార్చే కృషి చేశారు తెలుగు హిందీ నాటకాలు డెభై కి పైగా దర్శకత్వం వహించి పలు అవార్డ్స్ రివార్డ్ లు అందుకొన్నారు.



ఉదయ్‌భాను (ఫైల్)

నాటక రచయిత గా దర్శకుని గా రాష్ట్ర ప్రభుత్వం నంది అవార్డ్స్ భారత్ ప్రభుత్వం నుంచి సీనియర్ ఫెలో షిప్ పొందారు. కాగా యువత, విద్యార్థులలో నాటకంపై ఆసక్తి పెంపొందించి ఎందరినో నటనా కళలో ప్రోత్స హించారు! మర్యాద రామన్న, ఉడుత రామా యణం, అంజిగాడు, మూడో కన్ను, బుల్లి పిట్ట బూచోడు, రాచ కూడు, గోపాత్రుడు ఇలా వందల నాటకాలకు తనదైన ఆలోచనలతో ప్రాణం పోసి, తెలంగాణ జానపద సంగీతంతో కొత్తదనం అద్ది అద్భుత ప్రయోగాలుచేశారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాతో కలసి అనేక నాటక ప్రాజెక్టులు చేశారు! పిల్లల కోసం అనేక నాటకోత్స వాలు నిర్వహించారు! ఉత్తమ దర్శకుడు, ఉత్తమ రచయిత, ఉత్తమ సాం కేతిక నిపుణులుగా ప్రభుత్వ గుర్తింపు పొంది మూడుసార్లు నంది అవార్డులు గెలుచుకున్నారు! ఆయన అంత్య క్రియలు జూబ్లీ హిల్స్ లోని స్మశాన వాటిక లో జరిగాయి. విజయ బాను మృతికి పలువురు నాటక రంగ ప్రముఖులు నివాళి అర్పించారు.

# న్యాయవాదుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

## మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 2:** న్యాయవాదుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అన్ని విధాలా కట్టుబడి ఉందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. శుక్రవారం నాడు లక్డీకాపూల్ లోని ఓ హోటల్ లో జరిగిన అడ్వొకేట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ రజతోత్స వాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. న్యాయవాదుల భద్రత కోసం ఇటీవలే ప్రొటెక్షన్ యాక్టును చట్టం చేసామని శ్రీధర్ బాబు వెల్లడించారు. త్వరలోనే దానిని అమలులోకి తెస్తామని చెప్పారు.

న్యాయవాదుల సంక్షేమం కోసం అదనంగా మరో రూ.100 కోట్లు కేటాయించే విషయమై న్యాయశాఖను కూడా నిర్వహిస్తున్న సిఎం రేవంత్ రెడ్డిని కోరతామని ఆయన భరోసా ఇచ్చారు. వెయ్యి కోట్ల డిపాజిట్లతో న్యాయవాదుల సొసైటీ ఆర్థికంగా తమ ప్రభుత్వం కంటే బలంగా ఉందని ఆయన చమత్కరించారు. అనారోగ్యం పాలైన వారికి, చనిపోయిన లాయర్ల కుటుంబాలకు సొసైటీ అండగా నిలుస్తుండటాన్ని శ్రీధర్ బాబు ప్రశంసించారు.

తాను కొన్ని అనివార్య పరిస్థితుల్లో రాజకీయాల్లోకి రావాల్సి వచ్చిందని లేకపోతే హైకోర్టులో అడ్వొకేట్ గా ప్రాక్టీసు చేస్తుండేవాడినని అన్నారు. ఢిల్లీ యూనివర్సిటీలో లా పూర్తి చేసిన తర్వాత అక్కడి తీస్ హజారీ కోర్టుల్లో కొన్నాళ్లు, ఉమ్మడి రాష్ట్ర హైకోర్టులో మూడేళ్లు ప్రాక్టీసు చేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. సహచర ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్ (అంబర్ పేట), జి.మధుసూదన్ రెడ్డి (దేవరకద్ర)లతో కలిసి న్యాయవాదుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.

గత ప్రభుత్వం తీసు కొచ్చిన జిఓ నం. 28 కారణంగా ఎదురవు తున్న ఇబ్బందులు పరిష్కరిస్తామని తెలిపారు. అంతకు ముందు ఆయన ఎమ్మెల్యేలతో కలిసి సొసైటీ సిల్వర్ జూబ్లీ సావనీర్ ను ఆవిష్కరిం చారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక సభ్యులు సునీల్ గాను, అధ్యక్షుడు శ్రీనాథ్, కార్యదర్శి శ్రీధర్ తదితరులు ప్రసంగించారు. సీనియర్ అడ్వొకేట్లు, బార్ అసోసియన్ల ప్రతినిధులు కార్యక్రమానికి హాజరయ్యారు.

# తెలంగాణ హైకోర్టుకు సెలవులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 2:** తెలంగాణ హైకోర్టుకు వేసవి సెలవులు ప్రకటించారు. సోమవారం(మే5) నుంచి జూన్6(శుక్రవారం) వరకు సెలవులు ఉండనున్నాయి. ఈ నేపథ్యంలో స్పెషల్ బెంచ్‌లు ఏర్పాటు చేయ నున్నారు. అత్యవసర కేసుల నిమిత్తం హైకోర్టులో జస్టిస్ సూరెపల్లి నందా, జస్టిస్ జె.శ్రీనివాసరావు, జస్టిస్ పుల్లాకార్తీక్, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు, జస్టిస్ నగేశ్ భీమపాక, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, జస్టిస్ కె.శరత్, జస్టిస్ బిఆర్.మధుసూదన్‌రావులతో కూడిన (సింగిల్,డివిజన్)5 బెంచ్‌లు సేవలందిస్తాయని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

# ఐపిఎల్ మ్యాచ్‌లకు అందాల తారలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 2:** మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొనే సుందరీమణులు ఈనెల 20 లేదా 21 తేదీలలో హైదరాబాద్ జరిగే ఐపిఎల్ ప్లే ఆఫ్స్ మ్యాచ్‌ను తిలకించనున్నారు. రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రదేశాలను సందర్శించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వారి షెడ్యూల్‌ను విడుదల చేసింది. ప్రపంచ కళ్లన్నీ తెలంగాణ వైపే అనే స్లోగన్‌తో ఈ పోటీలు జరగనున్నాయి. మే 7 నుంచి 31 వరకు జరిగే ఈ పోటీలలో ప్రపంచ దేశాల సుందరీమణులు పాల్గొంటారు.

# పహల్గాం ఘటన.. పాక్‌పై భారత్ ఫైనాన్షియల్ స్ట్రైక్స్?

**ఇస్లామాబాద్, మే 2:** పహల్గాం ఉగ్రదాడితో భారత్–పాకిస్థాన్ మధ్య సంబంధాలు భగ్గుమంటు న్నాయి. సీమాంతర ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న దాయాది ఆర్థిక మూలాలను దెబ్బతీయడమే లక్ష్యంగా భారత ప్రభుత్వం యోచన చేస్తోంది. ఆ మేరకు రెండు ఫైనాన్షియల్ స్ట్రైక్స్‌కు ప్రణాళికలు రచిస్తోంది. వాటిలో భాగంగా ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఎటిఎఫ్) గ్రేలిస్టులోకి పాకిస్థాన్‌ను తీసుకువచ్చేలా ప్రయత్నించే అవకాశాలు ఉన్నాయి. ఐఎంఎఫ్ నుంచి పాకిస్థాన్‌కు అందే 7 బిలియన్ డాలర్ల సాయంపై ఆందోళనలు వ్యక్తం చేయనుంది. ఇవే జరిగితే ఇప్పటికే ఆర్థికంగా చతికిలపడిన పాక్‌కు శరాఘాతమే.

**అసలు ఎఫ్ఎటిఎఫ్ అంటే ఏమిటి?**

అక్రమ మార్గాల్లో వచ్చే నగదు చీకటి కార్యకలాపాలకు, ఉగ్రవాదానికి ఊతం ఇస్తాయి. చాలా వెనకబడిన దేశాలు, అవినీతి పెరిగిపోయిన దేశాల్లో బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థలు వీటికి ఊతమిచ్చేవిధంగా ఉంటాయి. ఇటువంటి పనులను నిరోధించడానికి ఆర్థిక చర్యల కార్యదళాన్ని ఏర్పాటు చేశారు. ఇది ఐక్యరాజ్యసమితి అనుబంధ విభాగం కాదు. పారిస్ కేంద్రంగా జి–7దేశాలు, ఐరోపా కమిషన్ కలిసి 1989లో దీనిని ప్రారంభించాయి. ప్రపంచవ్యాప్తంగా ఉగ్ర కార్యకలాపాలకు నిధులు వెళ్లకుండా ఇవి కొన్ని నిబంధనలు ప్రవేశపెట్టాయి. జి–7 దేశాలు సంపన్నమైనవి కావడంతో ప్రపంచంలోని మిగిలిన దేశాలు ఈ నిబంధనలు అనుసరించాల్సిన పరిస్థితి నెలకొంది. వీటి అమలు, నిర్వహణ లోపాలకు ఆయా దేశాలు బాధ్యత స్వీకరించేలా చేయడం ఆర్థిక చర్యల కార్యదళం (ఎఫ్ఎటిఎఫ్) విధి. ఇక, ఎఫ్ఎటిఎఫ్ అనుమానాస్పద దేశాల జాబితా(గ్రే లిస్టు)లో ఉండటం ఇస్లామాబాద్‌కు కొత్తేమీ కాదు. నిషేధిత జాబితా (బ్లాక్‌లిస్ట్)లో ప్రవేశిస్తే పాకిస్థాన్‌కు విదేశీ పెట్టుబడులు రావడం గగనంగా మారుతుంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) సంస్థ నుంచి వచ్చే రుణాలూ కష్టతరం కానున్నాయి.

ఆర్థికంగా దివాళా తీసి ఐఎంఎఫ్ రుణం కోసం దేహీ అంటోంది. నిత్యావసరాలతోపాటు అన్ని వస్తువుల ధరలు పెరిగి పాక్ ప్రజలు సతమతమవుతున్నారు. ఆర్థిక అస్థిరతకు తోడు రాజకీయంగా కూడా కల్లోల పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఉగ్రవాద సంబంధిత కార్యకలాపాలకు పాకిస్థాన్ నిధులు దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తూ.. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) ప్రకటించిన ఏడు బిలియన్ డాలర్ల సహాయ ప్యాకేజీపై భారతదేశం ఆందోళనలను లేవనెత్తుతుందని భావిస్తున్నారు. పహల్గాంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు.

# కృష్ణా జలాల్లో రాష్ట్రానికి న్యాయమైన వాటా కోసం పోరాడాలి

## 90శాతం పూర్తయిన పాలమూరు రంగారెడ్డి

## ప్రాజెక్ట్‌పై నిర్లక్ష్యం తగదు: మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 2:** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ 90 శాతం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పూర్తయిందని బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. పాలమూరు ప్రాజెక్ట్ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. పాలమూరు వారైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్ట్‌కు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఉద్దండపూర్‌లో కొద్దిగా మినహా మిగిలిన నాలుగు పంప్ హౌస్‌లు, రిజర్వాయర్లు, సబ్ స్టేషన్‌లు, టన్నెళ్లు, సర్జ్ పూల్స్ బీఆర్ఎస్ హయాంలోనే పూర్తి చేశాం. నార్లాపూర్‌లో వెట్ రన్ పూర్తి చేశాం.. మిగిలినవి డ్రై రన్ కూడా పూర్తి చేశాం. ప్యాకేజీ 3లో 8 కిలోమీటర్ల కాలువ మాత్రమే మిగిలిపోయింది.. దాని కాంట్రాక్టు ఆన్‌లైన్‌లో ఆంధ్రా ప్రాంతానికి చెందిన టీడీపీ ప్రముఖ నాయకుడు ఉన్నాడు.. ఆయన కుమారుడు అక్కడ ఎమ్మెల్యే. దానిని చేయకపోవడానికి అక్కడి ప్రముఖుల ఒత్తిడి ఏమైనా ఉందేమో అన్నది మాకు తెలియదు అని పేర్కొన్నారు.



ప్రాజెక్టు కోసం 27 వేల ఎకరాలకు గాను వందెకరాలు మినహా మిగిలిన భూసేకరణ చేశాం. కేవలం పాలమూరు ఫలితాలు త్వరగా అందకూడదనే ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. ఈ ప్రాజెక్ట్ మీద సమగ్ర సమీక్ష చేయకుండా ఉద్దేశపూర్వకంగా పక్కన పెడుతున్నారు అని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. 12.30 లక్షల ఎకరాలకు ఈ పథకం కింద సాగునీరు నల్లగొండ, పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు అందుతుంది. నల్లగొండకు డిండి లిఫ్ట్ ద్వారా దీని నుండి సాగునీరు అందుతుంది. ఏదుల నుండి నీళ్లివ్వడం ఖర్చుతో కూడుకున్నది అని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాం.. దానికి బదులు తక్కువ ఖర్చుతో వట్టెం రిజర్వాయర్ నుండి అఫ్ టెక్ ద్వారా గ్రావిటీ కింద నీళ్లు తీసుకెళ్లవచ్చని ప్రభుత్వానికి సూచించాం. దీనికి రూ.80 నుండి రూ.100 కోట్లు మాత్రమే ఖర్చు అవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏదుల నుండే నీళ్లు తీసుకెళ్లాలని రూ.1800 కోట్ల ఖర్చుకు సిద్దం అవుతుంది. దీనిలో రూ.1300 కోట్లు టెండర్లు కూడా పూర్తి చేశారు. రూ.80 కోట్లతో అయ్యే పనులను రూ.1800 కోట్లు ఎందుకు ఖర్చు చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం నిపుణుల కమిటీని వేయాలని ప్రభుత్వాన్ని నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ రిపోర్ట్ గెజిట్ నోటిపై చేయటం కోసం మే 7వ తేదీ సమావేశం ఉందని నిరంజన్ రెడ్డి తెలిపారు. ట్రిబ్యునల్ రిపోర్ట్‌లో ఉమ్మడి రాష్ట్రాలకు 1,050 టీఎంసీల నీళ్లు కేటాయించినట్టుగా తెలుస్తోందని నిరంజన్ రెడ్డి అన్నారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ రిపోర్టును ప్రభుత్వం యథాతథంగా ఆమోదిస్తే తెలంగాణకు గొడ్డలి పెట్టు అని చెప్పారు. జూరాల ప్రాజెక్టు ద్వారా కొడంగల్ నారాయణపేట లిఫ్ట్‌కు నీళ్లు వచ్చే పరిస్థితి ఉండదని అన్నారు. ఈ ఏడాది ధాన్యం ఎంత సేకరించారు?బోనస్ ఎంత ఇచ్చారని ప్రశ్నించారు. అన్ని రంగాల్లో ఈ ప్రభుత్వం దారుణంగా వైఫల్యం చెందిందని అన్నారు. రేవంత్ ప్రభుత్వాన్ని భరించటం రాష్ట్ర ప్రజలకు శిక్ష అని చెప్పారు. కృష్ణా జలాల విషయంలో అనుసరించాల్సిన వ్యూహంపై అఖిల పక్షాన్ని బ్రిజేష్‌కుమార్ సమావేశానికి పిలవాలని నిరంజన్ రెడ్డి కోరారు

# ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక సరఫరా

## నాలుగు త్రైమాసికాల వారీగా సరఫరా అందించనున్న ప్రభుత్వం

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** మే మొదటి వారం నుంచి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఎంపిక చేయనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రాష్ట్రంలో అందించే 4.50 లక్షల ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. 2025-26సంవత్సరంలో మొత్తం 112 క్యూబిక్ మీటర్లు ఇసుకను లబ్ధిదారులకు అందించడంతోపాటు వారిపై ఎటువంటి సీవరేజీ ఛార్జీలు, రవాణాభారం పడకుండా అధికారులు ఇసుకను అందించనున్నారు.ఈ మార్గదర్శకాలకు సంబంధించి ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు అంతర్గత ఉత్తర్వులను జారీ చేసింది.నాలుగు త్రైమాసికాల వారీగా జిల్లాలకు ఎంత ఇసుక అవసరమో మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఏ ప్రాంతం నుంచి ఇసుకను సరఫరా చేయాలో వివరించారు. గతేడాదికి సంబంధించి నాలుగో త్రైమాసికానికి సంబంధించి 25 లక్షల టన్నుల ఇసుక సరఫరా చేస్తున్నారు. అలాగే 2025-26లో మొదటి 3 త్రైమాసికాల్లో 25 లక్షల టన్నులు చొప్పున, నాలుగో త్రైమాసికంలో 12 వేల టన్నులు చొప్పున ఇసుకను లబ్ధిదారులకు సరఫరా చేస్తారు. హైదరాబాద్‌లో 13.06 లక్షల టన్నుల ఇసుక అవసరమని ప్రభుత్వ గుర్తించగా, ఈ ఇసుకను మహబూబ్‌నగర్, నల్గొండ, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి సరఫరా చేస్తారు. మిగతా జిల్లాల్లో ఆయా ప్రాంత వనరుల నుంచి ఇసుకను అందిస్తారు. ఒక్కో ఇందిరమ్మ ఇంటికి 25 క్యూబిక్ మీటర్లు చొప్పున ఇసుకను సరఫరా చేయనున్నారు.

# జిన్నారం మదర్సాలో విద్యార్థులు ఎక్కడి నుంచి వచ్చారు?

## బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారు శిక్షణ పొందుతున్నారని అనుమానాలు

## హిందువులు నిలదీస్తే అరెస్టులు చేయడం, రిమాండ్‌లకు పంపడం ఏమిటి?

## సిఎంకు బిజెపి ఎంపి రఘునందన్‌రావు లేఖ

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** మెదక్ పార్లమెంట్ పరిధిలోనే జిన్నారంలోని శివనగర్‌లో ఒక మదర్సా ఉంది, అలాగే సంగారెడ్డి నుంచి సదాశివపేటకు వెళ్లే హైవే పైన మరో మదర్సా ఉంది ఈ మదర్సాల్లో జరుగుతున్న కార్యకలాపాలపై అనుమానాలున్నాయని బిజెపి ఎంపి రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మదర్సాలకు సంబంధించిన వాటిపై డిజిపి వివరించి వాటి అసలు వివరాలపై విచారణ జరపాలని విజ్ఞప్తి చేశానన్నారు. ఆ మదర్సాలో ఎవరు ఉన్నారు? మదర్సాలో ఉన్న 70 మంది విద్యార్థులు ఎక్కడి వారు? వారు ఏ ఊర్ల నుంచి వచ్చారు? మదర్సా ఎప్పుడు స్థాపించారు? మదర్సా ఏర్పాటుకు అనుమతులు తీసుకున్నారా? ఇది ఎవరి కోసం నిర్మించారు? ఏ జాతీయుల కోసం నిర్మించారు? ఈ విషయాలపై విచారణ జరపాలని కోరానన్నారు. జిన్నారం మదర్సాలో 70 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 65 మంది బిహార్ రాష్ట్రంలోని కిషన్‌గంజ్ జిల్లాకు చెందినవారిగా చెప్పారు. వారి తల్లిదండ్రులు బిహార్‌లోనే ఉన్నారని చెప్తుంటే, మరి వీరు ఏ ప్రాంతానికి చెందిన వారు అంటూ ప్రశ్నించారు. కిషన్‌గంజ్ ప్రాంతం బంగ్లాదేశ్ సరిహద్దుకు సమీపంగా ఉంది. ఈ నేపథ్యంలో ఆ 65 మంది విద్యార్థులు బంగ్లాదేశ్ నుంచి వచ్చి శిక్షణ పొందుతున్నట్లుగా అనుమానం కలుగుతుందన్నారు. విద్యార్థులకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు కూడా కిషన్ గంజ్ నుంచే వచ్చారని, కిషన్‌గంజ్ ప్రాంతంలో బంగ్లాదేశ్ నుంచి వచ్చిన చొరబాటుదారులు హిందువులను బెదిరించి భూములు ఆక్రమిస్తున్నారన్నారు. అక్కడ ల్యాండ్ జిహాద్ జరుగుతుందన్నారు. ఎండోమెంట్‌కు చెందిన భూమిలో మదర్సా ఎలా నిర్మించబడింది? కోదండ రామాలయానికి సంబంధించిన సర్వే నంబర్లు 1, 2పై విచారణ జరపాలని తహశీల్దార్‌ను కోరినప్పటికీ, ఆయన స్పందన తగిన స్థాయిలో లేదన్నారు. ఈ అంశాన్ని డిజిపి దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవన్నారు. మదర్సా అనుమతులు, అక్కడ జరుగుతున్న కార్యకలాపాలపై ఎలాంటి విచారణ జరపలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజల సాక్షిగా లేఖ రాస్తున్నానన్నారు. ఈ రాష్ట్రంలో మదర్సాల వివరాలు ఏమిటి? ఎన్ని మదర్సాలకు అనుమతి ఇచ్చారు? మదర్సాలు ఎవరు నిర్వహిస్తున్నారు? ఎవరు చదువుతున్నారు? అనుమతిలేని మదర్సాలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోంది? ఇంతకు ముందు ఈ మదర్సాల్లో చదువుతున్న పిల్లలు ఇప్పుడు ఎక్కడున్నారు? వారు ఏం చేస్తున్నారు? వారికి మదర్సాల్లో ఇచ్చే సర్టిఫికెట్లకు ఎంతవరకు గౌరవం ఉంది? ఈ ప్రశ్నలపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం ఇవ్వాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలన్నారు. మదర్సాల్లో పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి రోహింగ్యాలను తీసుకురావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. మదర్సాల్లో తప్పుడు ధృవపత్రాల ద్వారా ఉగ్రవాద కార్యకలాపాలకు శిక్షణ ఇచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న అనుమానం ఉందన్నారు. ఈ మదర్సాల్లో ఉండే పిల్లల గుర్తింపుపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరపాలన్నారు. సదాశివపేట మున్సిపాలిటీ పరిధిలో బంగ్లాదేశీయులకు ఓటర్ కార్డులు, ఆధార్ కార్డులు జారీ చేశారు. ఇస్నాపూర్ వద్ద 247 మంది నేపాల్ దేశస్థులకు ఆధార్ కార్డులు మంజూరు చేశారు. ఇది అన్యాయం అన్నారు. ప్రశాంతంగా ఉన్న మెదక్ పార్లమెంటు పరిధిలో హిందువులను భయభ్రాంతులకు గురిచేస్తూ కొన్ని సంఘటనలు జరుగుతున్నాయన్నారు. సదాశివపేటలో వినాయకుడి విగ్రహం ధ్వంసం, బక్రీద్ సందర్భంగా జరిగిన గొర్రెల పోటీలు, ముత్యాలమ్మ గుడి ధ్వంసం వంటి ఘటనలు ఇవన్నీ స్థానికంగా ఉన్న కొంతమంది దుర్మార్గులతో కలిసి బయట నుంచి వచ్చిన వలసదారులు కలిసి, తప్పుడు ధృవ పత్రాలతో దేశవాతావరణాన్ని కలుషితం చేయడమే లక్ష్యంగా చేస్తూ జరుగుతున్నాయన్నారు. కేంద్రహోంమంత్రి అమిత్‌షా రాష్ట్రంలో అక్రమంగా నివాసముంటున్న బంగ్లా దేశీయులను, రోహింగ్యాలను గుర్తించి వెనక్కి పంపించాలని ఇప్పటికే ముఖ్యమంత్రికి సూచించారు. దీనిపై హోంమంత్రిత్వ శాఖ నుంచి రాష్ట్ర ప్రభు త్వానికి లేఖ కూడా అందిందన్నారు. జిన్నారం మదర్సాలో జరుగు తున్న వ్యవహారంపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరపాలన్నారు.

# మిస్‌వరల్డ్ పోటీలకు పటిష్ట భద్రత

## డిజిపి జితేందర్ వెల్లడి

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:** రాష్ట్ర సర్కారు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీలకు పటిష్టమైన భద్రతను కల్పించాలని డిజిపి జితేందర్ ఆదేశించారు. ఈ విషయంలో ఇతర విభాగాల అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆయన పోలీసు అధికారులను కోరారు. డిజిపి కార్యాలయంలో మిస్ వ రల్డ్ పోటీలకు చేబట్టాల్సిన భద్రతకు సంబంధించి డిజిపి జితేందర్ ఉన్నతాధికారులతో సమీక్షించారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా మిస్ వరల్డ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి వెల్లడించారని, ఈ నేపథ్యంలో భద్రతకు సంబంధించి ఎక్కడా చిన్నపాటి లోటుపాట్లు కూడా వుండరాదని ఆయన కోరారు. 120 దేశాల నుంచి పోటీదారులు ఇందులో పాల్గొంటున్నారని, ఇప్పటి వరకు 116 దేశాలకు సంబంధించిన వారు వస్తున్నట్లు సమాచారం అందిందని, వీరం తా రాష్ట్రంలో నెల రోజుల పాటు వివిధ ప్రాంతాలలో గ్రూపుల వారిగా పర్యటిస్తారని డిజిపి తెలిపారు. అతిథుల రాక శుక్రవారం నుండే మొదలయ్యిందని, మి స్ వరల్డ్ ప్రారంభ వేడుక ఈ నెల పదవ తేదీన గచ్చిబౌలి స్టేడియంలో జరుగుతుందని ఆయన తెలిపారు. మిస్ వరల్డ్ కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా లోని రామప్ప దేవా లయం, నల్లగొండ జిల్లాలోని బుద్ధవనం, మహబూబ్‌నగర్‌లోని పిల్లల మర్రి దేవాలయం, హైదరాబాద్‌లోని లాల్‌బజార్, సచివాలయం, యాదగిరిగుట్ట, ఉప్పల్ స్టేడియం, పోచంపల్లి, రామోజి ఫిలిం సిటీ తదితర ప్రాంతాలను పోటీదారులు సందర్శించనున్నారని డిజిపి తెలిపారు. ఈ ప్రాంతాల ను అనుసంధానం చేస్తూ కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నామని, ఫైనల్ పోటీలు ఈ నెల 31వ తేదీన హైటెక్స్‌లో వుందని ఆయన తెలిపారు. ఈ పోటీలకు భద్రత విషయంలో పోలీసులు మరింత పక్కాగా వుండాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, మిస్ వరల్డ్ పోటీలకు నోడల్ ఆఫీసర్‌గా వున్న అదనపు డిజి స్టీఫెన్ రవీంద్ర, ఫైర్ సర్వీస్ డిజి నాగిరెడ్డి, నగర అదనపు పోలీసు కమిషనర్ (శాంతి భద్రతలు) విక్రం సింగ్ మాన్, సైబరాబాద్ కొత్వాల్ అవినాష్ మొహంతి, రాచకొండ కొత్వాల్ సుధీర్ బాబు, ఇంటెలిజెన్స్ ఐజి కార్తికేయ, హైడ్రా కమిషనర్ రంగనాథ్, పర్యాటక శాఖ ఎండి ప్రకాష్ రెడ్డి, మల్టీ జోన్ ఐజిలు చంద్రశేఖర్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వరంగల్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, ములుగు, నల్లగొండ, మహబూబ్ నగర్ జిల్లాల ఎస్‌పిలతో డిజిపి మాట్లాడి సూచనలు చేశారు.

తెర

# దాదాఫాల్కే ఫిలిం ఫెస్టివల్ 2025లో బెస్ట్ ఫిలిం 'క'



కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన సూపర్ హిట్ మూవీ "క" మరో అరుదైన గౌరవం సొంతం చేసుకుంది. ఈ సినిమా ప్రతిష్టాత్మక 15వ దాదాఫాల్కే ఫిలిం ఫెస్టివల్‌లో ఉత్తమ చిత్రంగా అవార్డ్ గెల్చుకుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మూవీ టీమ్ తమ హ్యాపీనెస్ సోషల్ మీడియా ద్వారా షేర్ చేసింది. ప్రేక్షకులు "క" సినిమా టీమ్ కు తమ శుభాకాంక్షలు తెలియజేస్తు న్నారు. ఈ సినిమాకు డెబ్యూ డైరెక్టర్స్ సుజీత్, సందీప్ రాసిన స్ట్రాంగ్ స్టోరీ, మ్యాజికల్ స్క్రీన్ ప్లే, సరికొత్త బ్యాక్ డ్రాప్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. గతేడాది దీపావళికి రిలీజైన "క" సినిమా పెద్ద చిత్రాల పోటీని తట్టుకుని బాక్సాఫీస్ విన్నర్‌గా నిలిచింది. ఈ సినిమాలో తన్వీ రామ్, నయన్ సారిక హీరోయిన్స్‌గా నటించారు. "క" సినిమాను శ్రీమతి చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్ టైన్ మెంట్స్‌తో బ్యానర్‌పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో నిర్మించారు. తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి రిలీజ్ చేశారు.

## 'హిట్: థర్డ్ కేస్'తో 'మే' అంతా హిట్ 3నే

నేచురల్ స్టార్ నాని సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ హిట్: థర్డ్ కేస్. శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించింది. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వాల్ పోస్టర్ సినిమా, నాని యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. హ్యూజ్ బజ్, ట్రెమండస్ బుకింగ్స్‌తో మే 1న పాన్ ఇండియా గ్రాండ్‌గా రిలీజ్ అయినహిట్: థర్డ్ కేస్ అందరినీ ఆకట్టుకొని బ్లాక్ బస్టర్ సక్సెస్‌ని అందుకొంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో నేచురల్ స్టార్ నాని మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఇది ఒక అద్భుతమైన రిలీజ్ డే. పొద్దున లేచి చూస్తే నా ఫోను మెసేజ్లతో నిండిపోయింది. ఇండస్ట్రీ, అభిమానులు, శ్రేయోభిలాషులు అందరూ సినిమా గురించి అద్భుతంగా చెబుతున్నారు. చాలా రిలీజ్ డేస్ చూసాను. కానీ ఈ రిలీజ్ డేట్ వైబ్ అదిరిపోయింది. సినిమా బుకింగ్స్ అదిరిపోయాయి. సినిమా సూపర్ హిట్.. ఇవన్నీ పక్కన పెడితే ఇది జస్ట్ బిగినింగ్ ఆఫ్ హిట్ 3 జర్నీ.. ప్రతి రోజు కూడా ఒక సెలబ్రేషన్ లాగా ఉండబోతుంది. ఇది ఎక్కడికెళ్లి ల్యాండ్ అవుతుందనేది మా టీంఅంచనాలకి అందడం లేదు. అందుకే ఎలాంటి స్టేట్మెంటు ఇవ్వదల్చుకోలేదు. మీ అందరి ప్రేమని ఎక్స్పీరియన్స్ చేస్తున్నాం. ఈ సినిమాకు వచ్చిన రెస్పాన్స్ గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. ఇది ఇప్పుడిప్పుడే ఆగదు. ఈ సినిమాకి కనీసం నాలుగైదు సెలబ్రేషన్స్ చేయాలి. ఈసారి నేను ప్రొడ్యూసర్ కూడా కాబట్టి ఎక్స్ట్రా రెస్పాన్సిబిలిటీ ఉంది. ప్రతిసారి నాకు ఒక నమ్మకం ఉంటుంది. నేను మీరు ఒకటేనని నమ్మిన ప్రతిసారి మీరు నేను కరెక్ట్ అని ప్రూవ్ చేసినందుకు మీ అందరికీ పేరుపేరునా థాంక్యూ సో మచ్. సినిమాని ఇంత అద్భుతంగా సపోర్ట్ చేసి మీడియాకి థాంక్యూ సో మచ్. మీ సపోర్ట్ వలనే ఈ బ్లాక్ బస్టర్ సాధ్యమైంది. మే ఫస్ట్ స్టార్ట్ అయింది. మే అంత ఇది సెలబ్రేషన్స్ లాగా ఉండాలని కోరుకుంటున్నాను. ఈరోజు రాత్రికి అమెరికా వెళుతున్నాను. నాలుగైదు రోజులు అందుబాటులో ఉండను. వచ్చిన వెంటనే మీ అందరిని కలుసుకొని గ్రాండ్‌గా సక్సెస్‌ని సెలబ్రేట్ చేసుకుందాం. శైలేష్ విషయంలో చాలా ప్రౌడ్‌గా ఫీల్ అవుతున్నాను. ఇది తన విజన్‌కి ఒక టీజర్ ట్రైలర్ మాత్రమే. మాకు ఎప్పుడూ సపోర్ట్ చేసే దిల్ రాజుకి థాంక్యూ సో మచ్. టికెట్ విషయంలో సపోర్ట్ చేసిన ఏపీ గవర్నమెంట్, ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికి, అందరికీ కృతజ్ఞతలు. ఇది తెలుగు సినిమా సక్సెస్. రాబోయే సినిమాలు కూడా ఇదే సక్సెస్‌ని కంటిన్యూ చేయాలని కోరుకుంటున్నాను. ప్రేక్షకులందరు ప్రతి సినిమాని ఇలాగే ఆదరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. థాంక్యూ సో మచ్. నిర్మాత దిల్ రాజ్ మాట్లాడుతూ నిర్మాత.. మే1న మళ్ళీ తెలుగు సినిమా ఇండస్ట్రీ బ్రీతింగ్ తీసుకుంది. లాస్ట్ మంత్ అంతా సినిమాలో వస్తున్నాయి కానీ ఆడియన్స్ థియేటర్స్‌కి రావడం లేదు, సమ్మర్ అయిపోతుంది అనుకుంటున్న తరుణం. ఏప్రిల్ నెలలో సరైన సినిమాలు లేక చాలా సింగిల్ స్క్రీన్స్ ఏపీ, తెలంగాణలో క్లోజ్ చేయడం కూడా జరిగింది. ఇలాంటి సమయంలో మా హోప్స్ అన్నీ కూడా హిట్ 3 సినిమా మీదే ఉన్నాయి. ఆడియన్స్ సినిమాకి ఏ రేంజ్‌లో ఫుల్స్ ఇస్తారని బ్రీతింగ్ హోల్డ్ చేసుకుని ఉన్నాము. అలాంటిది ఈ సినిమాకి మూడు రోజులు ముందుగానే ఆన్లైన్ బుకింగ్ చూసి జనాలు థియేటర్స్‌కి వస్తున్నారని హ్యాపీగా ఫీలయ్యా. ఈ సినిమాకి ఎక్కడ చూసినా యునానమస్‌గా లాస్ట్ హాఫ్ అండ్ అవర్ ఎక్స్ట్రార్డినరీ అనే మాట వినిపిస్తుంది. సినిమా అదిరిపోయింది. దీంతో తెలుగు సినిమా ఇండస్ట్రీ ఊపిరి పీల్చుకున్నట్టు అయింది. ట్రెమండస్ ఓపెనింగ్స్ వచ్చాయి. నానికి ఓవర్సీస్ దసరా హైయెస్ట్ ఉండే ఈ సినిమా క్రాస్ చేసింది. నానికి అక్కడ ఓవర్సీస్ హైయెస్ట్ గ్రాఫర్ అయ్యింది. అలాగే తెలంగాణలో కూడా మేము ఎక్స్పెక్ట్ చేస్తున్నాము. నానికి డే వన్ కలెక్షన్ హైయెస్ట్ కాబోతుంది. నాని థాంక్యూ వెరీ మచ్.



## సోనుది ఫిలిమ్ ఫ్యాక్టరీ 'ప్రొడక్షన్ నం01'

సోను ది ఫిలిమ్ ఫ్యాక్టరీ అధినేత ఆర్.యు రెడ్డి అన్నమాట ప్రకారం తాను ప్రారంభించిన ప్రొడక్షన్ నం1 సినిమా దిగ్విజయంగా షూటింగ్ పూర్తి చేసుకుందన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఇదొక కొత్త రకమైన సినిమా. అనేక ఎమో షన్స్ కలగలిసిన కథ. మంచి కథ కావటంతో మా నటీనటులు ఆశిష్‌గాంధీ, మానస రాధా కృష్ణన్‌ల నుండి ఎంతో చక్కని సహకారం లభించటంతో సినిమాను అనుకున్న సమయానికి షూటింగ్ పూర్తి చేయగలిగాం. మా దర్శకులు కిరణ్ కిట్టి, లక్ష్మీ చైతన్యలు కొత్త వారైనా కథను చెప్పి నట్లు తెరకెక్కించారు. ఒక్క పాట మినహా షూటింగ్ పార్టంతా పూర్త యింది. ఆ పాటను ప్రముఖ కొరియో గ్రాఫర్ జానీ మాస్టర్ చేయనున్నారు. త్వరలోనే సినిమా టైటిల్‌ను, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తాం. సినిమాను రెండు నెలల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తాం. ప్రముఖ సంగీత దర్శకుడు గోపిసుందర్ అందించిన ఆరు పాటలు మా సినిమాకు హైలెట్‌గా నిలుస్తాయి. మా బ్యానర్ నుండి మరి కొన్ని సినిమాలు ఈ ఏడాదిలో ప్రారంభిస్తాం అన్నారు.



## 'భోగి' విడుదలకు రెడీ

పీసీ క్రియేషన్స్ పతాకంపై వరుణ్.కె దర్శకత్వంలో ప్రదీప్ చంద్ర నిర్మాతగా రూపొందుతున్న చిత్రం భోగి. సస్పెన్స్ కథాంశంతో, యూత్ ఎంటర్టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం, షూటింగ్ పూర్తి చేసుకుని నిర్మాణానంతర కార్యక్రమాలను శరవేగంగా జరుపుకుంటోంది. ఆగస్టు నెలలో విడుదలకు సిద్ధం అవుతున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ ఇదివరకే విడుదలయ్యి మంచి ప్రజాదరణ పొందింది విషయం తెలిసిందే. ఈ సందర్భంగా డైరెక్టర్ వరుణ్.కె మాట్లాడుతూ, నేను కెరీర్ తొలినాళ్లలో 15కు పైగా షార్ట్ ఫిలిమ్స్ డైరెక్ట్ చేశానని, 2 సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా వర్క్ చేశానని చెప్పారు, అప్పుడు నాతో కలిసి పనిచేసిన ప్రదీప్ చంద్రతో కలిసి ఒక సినిమాను ప్లాన్ చేసానని. నేను అనుకున్న లైన్ బాగా నచ్చడంతో 2022లో ఈ భోగి చిత్రాన్ని ప్రారంభించామని తెలిపారు. కథకు తగ్గట్లుగానే భోగి అనే పవర్ఫుల్ టైటిల్‌తో మీముందుకు వస్తున్నాం అని అన్నారు. త్వరలోనే పోస్ట్ ప్రడక్షన్ పూర్తి చేసి విడుదల చేస్తామన్నారు.



## సిలంబరసన్ నటించిన 'పత్తు తల' నాకిష్టం

ఇండియన్ స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఇటీవల ఓ చాట్ షోలో మాట్లాడుతూ, సిలంబరసన్ టీఆర్ నటించిన "పత్తు తల" సినిమా నుంచి "నీ సింహం దాన్" పాటను చాలా ఇష్టపడతానని చెప్పారు. ఈ పాటను సోషల్ మీడియా రీల్స్ లో, క్రికెట్ వీడియోల్లో చాలా సార్లు వాడుతున్నారు కూడా. ఆర్‌సీబీ పోస్టులో విరాట్ కోహ్లీని ట్యాగ్ చేయడంతో ఎస్‌ఆర్‌టి కూడా స్పందించి, "నీ సింహం దాన్" అంటే "నువ్వు నిజమైన సింహం" అని వ్యాఖ్యానించారు. ఎస్‌టిఆర్ మరియు విరాట్ అభిమానులు ఈ అరుదైన కలయికను తెరపై కాదు గానీ తెర వెలుపల ఆస్వాదిస్తున్నారు. ఇక్కడితో అయిపోలేదు, ఈ ఇద్దరు తమ ప్రత్యేకమైన బియర్డ్ స్టైల్‌లో ఆకట్టుకున్నారు. ఎస్‌టిఆర్ తన ఫిట్‌నెస్‌ను పెంచుకోవడంతో, అతని లుక్ కొంతవరకు విరాట్ కోహ్లీని తలపిస్తోంది. ఎస్‌టిఆర్, విరాట్ చెప్పిన కోహ్లీ బయోపిక్ లో అతడి పాత్ర పోషించబోతున్నాడా అని ముంబయి వర్గాల్లో ప్రస్తుతం చర్చ నడుస్తోంది. ఇటీవల వీరి మధ్య సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న సంభాషణల ప్రకారం చూస్తే, విరాట్, అనుష్క ప్రొడ్యూసర్లకు ఒకే అంటే, ఎస్‌టిఆర్ ఈ బయోపిక్‌కు ఎంపిక అయ్యే అవకాశముంది. ఒకవైపు విరాట్ ఐపీఎల్‌లో విజృంభిస్తుండగా, మరోవైపు స్టీఆర్ "థగ్ లైఫ్", "ఎస్‌టిఆర్ 49", "ఎస్‌టిఆర్ 50", "ఎస్‌టిఆర్ 51" సినిమాలతో ఇండస్ట్రీలో దూసుకెళ్తున్నారు. దీనికి విరాట్ కోహ్లీ బయోపిక్ కూడా చేరితే, ఇది పాన్ ఇండియా స్థాయిలో ఓ పండుగ అవుతుంది.



## ట్రెడిషనల్ టచ్‌తో నభా నటేష్

సౌత్ ఇండస్ట్రీలో మాస్ గ్లామరస్ బ్యూటీగా తనకంటూ ఒక ప్రత్యేకమైన క్రేజ్ అందుకున్న బ్యూటీ నభా నటేష్. కర్ణాటక నుంచి వచ్చిన ఈ బ్యూటీ 2015లో కన్నడ సినిమా వజ్రకాయతో యాక్టింగ్ లోకి అడుగుపెట్టింది. తెలుగులో నన్ను దోచుకుందువటే సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత అదుగో డబుల్ ఇస్మార్ట్, డిస్కో రాజా, సోలో బ్రతుకే సో బెటర్, మాస్ట్రో వంటి సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. నభా నటనతో పాటు ఆమె అందం, గ్లామర్‌తో కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన అభిమానులతో టచ్‌లో ఉంటుంది. నభా నటేష్ ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఫోటోలు చూస్తే ఆమె గ్లామరస్ లుక్స్‌కు ఫిదా అవ్వాల్సిందే. ఎరుపు రంగు లెహంగా చోలీలో ఆమె చాలా అందంగా కనిపిస్తుంది. ఆ ఎరుపు దుపట్టా, బంగారు నగలు ఆమె అందానికి మరింత ఒప్పుగా ఉన్నాయి. ఆ డ్రెస్‌పై బంగారు బార్డర్, చిన్న చిన్న డిజైన్లు ఆమె లుక్‌ను మరింత స్పెషల్‌గా చేశాయి. నభా స్టైల్‌లో ఎప్పుడూ ఒక ట్రెడిషనల్ టచ్ ఉంటుంది. ఆమె లెహంగాలో కూర్చున్న ఫోటోలు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయి. అలాగే బంగారు నగలు, చేతుల్లో బంగారు గాజులు చాలా అందంగా ఉన్నాయి. నభా ఎప్పుడూ తన డ్రెస్సింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఆమె సింపుల్‌గా ఉంటూనే గ్లామరస్‌గా కనిపిస్తుంది. ఇక ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.






## సినిమాల్లో పాపులర్ అయిన శ్రీలీల

సౌత్ సినీ ఇండస్ట్రీలో ఇప్పుడు ఓ యంగ్ బ్యూటీ సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. అందం, టాలెంట్ మాత్రమే కాదు.. అంతకు మించిన మంచి మనసుతో అందరినీ ఆకట్టుకుంటోంది. అద్భుతమైన డ్యాన్సులతో, క్రేజీ యాక్టింగ్ స్టైల్‌తో తెలుగు, కన్నడ ప్రేక్షకులకు పిచ్చెక్కిస్తున్న ఈ బ్యూటీ.. ఆమె ఎవరో కాదు, శ్రీలీల. శ్రీలీల 2001, జూన్ 14న అమెరికాలో పుట్టింది. కానీ పెరిగింది మాత్రం బెంగళూరులోనే. వాళ్ల అమ్మ డాక్టర్ స్వర్ణలత బెంగళూరులో ఫేమస్ గైనకాలజిస్ట్. ఆమె చాలా సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చినా, శ్రీలీల సినిమాల వైపు అడుగులేసింది. ఎంబిబిఎస్ చదువుతూనే ఇండస్ట్రీకి వచ్చింది. 2021లో తన మెడికల్ స్టడీస్ కూడా పూర్తి చేసింది. చిన్నప్పటి నుంచే భరతనాట్యంలో ట్రైనింగ్ తీసుకున్న శ్రీలీల, 2019లో కన్నడ సినిమా కిస్‌తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత భరాటే, బై టూ లవ్ లాంటి కన్నడ సినిమాలు చేసింది. తెలుగులో మాత్రం పెళ్లి సందీద సినిమాతో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చి, ఇక్కడి కుర్రాళ్ల మనసు దోచేసింది. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. ధమాకా, స్కందా, భగవంత్ కేసరి, ఆదికేశవ, ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్, గుంటూరు కారం లాంటి సినిమాలతో దూసుకుపోతోంది. నటన, డ్యాన్స్ మాత్రమే కాదు.. శ్రీలీలకు సేవా గుణం కూడా ఎక్కువే. 2022, ఫిబ్రవరిలో, అంటే కేవలం 21 ఏళ్ల వయసులోనే, ఓ అనాథాశ్రమాన్ని సందర్శించినప్పుడు అక్కడ ఉన్న ఇద్దరు ప్రత్యేక అవసరాలున్న పిల్లలు గురు, శోభితను దత్తత తీసుకుని పెద్ద మనసు చాటుకుంది.



## 'బకాసుర రెస్టారెంట్' ఫస్ట్ లుక్

ప్రముఖ కమెడియన్, నటుడు ప్రవీణ్ త్వరలోనే భకాసుర అనే రెస్టారెంట్‌ను ప్రారంభించబోతున్నారు.. అనే న్యూస్ అందరిలోనూ కాస్త ఆసక్తి కలిగించి వైరల్‌గా మారింది. అయితే ప్రవీణ్ నటుడిగా బిజీగానే ఉన్నాడు కదా.. మరీ వ్యాపారంలోకి ఎందుకు వెళ్లుతున్నాడు అనే సందేహం కూడా అందరిలో కలిగింది. అయితే ఎట్టకేలకు ఇప్పుడు ఈ న్యూస్‌పై ఓ క్లారిటీ వచ్చింది. ప్రవీణ్ ఎటువంటి రెస్టారెంట్‌ను పెట్టడం లేదు.. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం పేరు భకాసుర రెస్టారెంట్. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ప్రవీణ్ పెద్ద గరిటెతో వంట చేస్తుండటం, ఆ పక్కనే ఇతర పాత్రలు ఆ పోస్టర్‌లో కనిపిస్తున్నాయి. ఆ పోస్టర్‌లోనే గమనిస్తే వైవా హర్ష, షైనింగ్ ఫణి మరో వైపు విచిత్రంగా సమ్‌థింగ్ స్పెషల్ పాత్రలుగా కనిపిస్తున్నారు. ఎన్నో విజయవంతమైన చిత్రాలతో మంచి నటుడిగా, కమెడియన్‌గా అందరికి సుపరిచితుడైన ప్రవీణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. కృష్ణభగవాన్ ,షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడ రామ్, ఇతర ముఖ్య పాత్రలో యాక్ట్ చేస్తున్నారు. ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ప్రమోషనల్ భాగంగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. పూర్తి వినోదాత్మకంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నేటి యువతరంతో పాటు అన్ని వర్గాలు అలరించే అంశాలున్నాయి. ప్రతి సన్నివేశం అందరికి ఎంతో థ్రిల్ల్‌ను పంచుతుంది. ప్రవీణ్ కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమాగా ఇది ఉండబో తుంది. నటుడిగా ఆయనలోని మరో కోణాన్ని ఈ చిత్రంలో చూడబోతున్నారు. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు మా చిత్రం తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది అన్నారు. ప్రవీణ్, వైవా హర్ష, షైనింగ్ ఫణి (బమ్‌చిక్ బంటి), కేజీఎఫ్ గరుడ రామ్, కృష్ణభగవాన్, శ్రీకాంత్ అయ్యంగార్, ఉప్పెన జయ కృష్ణ, వివేక్ దండు, అమర్, రామ్‌పటాస్ తదితరులు.



# సమ్మర్ క్యాంప్స్

వేసవి సెలవులు .. ఒత్తిడి వాతావరణం నుండి ఒక విరామం. పరీక్షలు అయిపోగానే వచ్చే వేసవి సెలవులు పిల్లలకు ఒక ఆటవిడుపు. పల్లెల్లో పిల్లలయితే చెరువుగట్లు, కాలువగట్లు, పొలాల వెంట తిరుగుతూ ఆడుకుంటారు. చెట్లు, గుట్టలు ఎక్కుతూ ప్రకృతితో మమేకమవుతారు. ఇక నగరాల్లో అయితే ఇలా సెలవులు వస్తాయో లేదో అలా సమ్మర్‌క్యాంపులకు పరుగు తీస్తారు. సాంకేతిక పరిజ్ఞానం నుంచి సృజనాత్మక రంగాల వరకూ, శారీరక దృఢత్వం నుంచి వ్యక్తిత్వ వికాసం వరకూ విస్తరించి ఉన్న ఈ క్యాంపులు, విద్యా జీవితానికి వెలకట్టలేని అనుభవాలను అందిస్తున్నాయి. రెండు నెలల కాలాన్ని ఇంటిపట్టునే ఉండి వృధా చేయకుండా ఇటు విజ్ఞానం, అటు వినోదం సమ్మిళితంగా సమ్మర్‌క్యాంపులు ఏర్పాటు చేయడం విశేషం. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడు మారుతున్న అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి టెక్నికల్ స్కిల్స్ నేర్చుకోవడానికి ఈ తరం ఎక్కువ ఆసక్తి చూపిస్తుందనేది నమ్మదగ్గ విషయం. విద్య, వృత్తిపరమైన నైపుణ్యాలు ఎన్ని ఉన్నా



ఏదో ఒక కళలో ప్రావీణ్యముండటం ఈ తరంలో సెలబ్రిటీ హోదాగా మారింది. నగరవాసుల సక్సెస్‌మంత్ర ఏదైనా ఉందంటే అది ఆరోగ్యం, ఫిట్నెస్ అని చెప్పవచ్చు. ఆరోగ్యశిక్షణ, క్రీడలు, ఫిట్నెస్ రంగాలకు ప్రస్తుతం మంచి ఆదరణ ఉంది. ఈ శిక్షణల ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, క్రమశిక్షణ, టీం వర్క్, ఫోకస్ వంటి విలువలు పెంపొందుతాయి. కేవలం చదువులు మాత్రమే కాదు, క్రీడలతో అంతర్జాతీయ గుర్తింపు, ఉన్నతస్థాయి జీవితానికి నాంది పలకవచ్చని చెపుతున్నాయి. సమ్మర్ క్యాంపుల ద్వారా విద్యార్థులు, యువత కొత్త ప్రపంచాన్ని అన్వేషించే అవకాశం పొందుతున్నారు.

తల్లిదండ్రులు తమ పిల్లల్లోని ఆసక్తి గుర్తించి, అనుగుణమైన శిక్షణలను ప్రోత్సహించగలిగితే భవిష్యత్తులో విశ్వాసంతో ముందుకు సాగుతారు.

# పల్మోనరీ టి.బి -2

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

కోయాగ్యోపతీ, ప్రోతాంబిన్ ఇండెక్స్ తక్కువుగా ఉన్నవారిలో, ఊపిరితిత్తుల్లో మచ్చలు, కేషియేషన్ ఎక్కువుగా ఉన్నవారిలో, బిలియరీ సిర్రోసిస్, లివర్ కణాల్లో ఆక్సిజన్ టెన్షన్ తక్కువుగా ఉన్న క్షయ మందుల వల్ల లివర్ డామేజ్ కావడం వల్ల హెపటోటాక్సిసిటీ ఏర్పడినప్పుడు (ఐసోనియా జెడ్, రిఫాంపిసిన్, పైరజినా మైడ్ మందుల వల్ల, సూక్ష జీవుల మల్టీ డ్రగ్ రెసిస్టెన్స్ వల్ల, స్థూల కాయం వల్ల, కొన్ని రకాల వైరస్‌ల వల్ల వస్తుంది.

అంతే కాకుండా నాన్ కమ్యూనికబుల్ కారణాలు, ప్రైమరీ సిర్రోసిస్, వైరల్ హెపటైటీస్, విటమిన్ ఎ,డి, జింక్ లోపం, పోషకాహార లోపం ఉన్నవారిలో, కలుషిత ఆహారం తీసుకున్నవారిలో, రోగ నిరోధక శక్తి లేని ఎయిడ్స్ కేన్సర్, కరోనా రోగులు, క్రానిక్, కాలేయ వ్యాధులు, ఇన్ఫెక్టివ్ హైపాటిక్ గ్రాన్యులోమాటస్ రోగులు, లివర్ సిర్రోసిస్‌తో బాధ పడుతున్న రోగులు ఎక్స్‌ట్రా పల్మోనరీ క్షయవ్యాధికి గురవుతారు. అంతేగాకుండా కిడ్నీ రోగులు, హామోలిసిస్, పిత్తవాహికలు దెబ్బతిన్నప్పుడు పిత్తాశయం, ప్రాంకియాజ్ వ్యాధులున్న వారిలో కన్పిస్తుంది.

ఫాస్ట్ ఫుడ్ సంస్కృతి, మానవ జీవన విధానంలో అనేక మార్పులు రావడం, ఆహార అలవాట్లలో మార్పులు, కొవ్వు, చక్కెర, నూనె అధికంగా ఉన్న (పిజ్జా, బర్గర్‌లు) ఆహార పదార్థాల్ని తీసుకోవడం వల్ల ఫ్యాటీ లివర్‌తో బాధపడేవారిలో స్థూలకాయం, హెపాటో టాక్సిక్ మందుల వల్ల, హెపటైటిస్ వైరస్ వల్ల కాలేయ వ్యాధుల చరిత్ర ఉన్నవారిలో, గుండె జబ్బులున్న వారిలో హెపాటిక్ క్షయ వచ్చే అవకాశం ఉంది.

రకాలు: 1905లో రోలెస్టన్, మాక్‌నీ హెపాటిక్ క్షయలో అనేక రకాలున్నాయని గుర్తించారు.

1. ప్రైమరీ హెపాటిక్ క్షయ : ఇది అరుదుగా వస్తుంది. ఎందుకంటే లివర్‌లో ఆక్సిజన్ టెన్షన్ తక్కువుగా ఉండడం వల్ల క్షయ బాక్టీరియా లివర్‌కి చేరే అవకాశం తక్కువగా ఉంటుంది.

2. సెకండరీ హైపాటిక్ క్షయ : ఇది పల్మోనరీ ఉదరక్షయ వల్ల వస్తుంది. లివర్‌లో గ్రాన్యులోమాటస్, నెక్రోసిస్, ఫైబ్రోసిస్, కాల్సిఫికేషన్ వంటి స్టేజెస్‌కి గురికావడం వల్ల అనేక మార్పులు ఏర్పడతాయి. దాని ప్రకారం ఇది అనేకరకాలుగా కన్పిస్తుంది.

3. ట్యూబర్ క్యులోమా- దీన్నే గ్రాన్యులోమాటస్ డిసీజ్ అంటారు. ఇది 1-4 సెం.మీ మిలియరీ ట్యూబర్ క్యుల్స్ వల్ల వస్తుంది. లివర్‌కి అధిక రక్త సరఫరా ఉండడం, ఎక్కువ రెటిక్యులో ఎండోథీలియం కణాలుండటం పోర్టల్ సిరల ద్వారా రక్త ప్రసరణ అధికంగా ఉండడం వల్ల గ్రాన్యులోమాలు ఏర్పడడానికి అవకాశం ఉంది.

ఎ. లోకల్ (స్థానిక)హైపాటిక్ క్షయ : దీన్నే ట్యూబర్ క్యులోమా, మాక్రోనోడ్యులార్ హెపాటిక్ టి.బి, సూడోట్యూమరల్ హెపాటిక్ టి.బి అని అంటారు. ఇది 20% మందిలో కన్పిస్తుంది. ఇది జీర్ణాశయాంతర వ్యవస్థ ద్వారా వ్యాపిస్తుంది. ఇది పోర్టల్ సిర ద్వారా వ్యాపిస్తుంది. 1-3 సెం.మీ ట్యూబర్ క్యుల్స్ పోర్టులో సిర దగ్గర ఏర్పడతాయి.వీరిలో కాల్సిఫికేషన్ తక్కువగా ఉన్న ఎక్కువ సాంద్రత కల్గిన నోద్యుల్స్ ఏర్పడతాయి. హెపాటిక్‌సెల్యులార్ డామేజ్ అవుతుంది. ఇది కాంప్లెక్స్ ప్రాసెస్ అనే చెప్పవచ్చు లివర్ టి.బి అబ్సెస్ సాధారణంగా లోకల్ హెపాటిక్ టి.బి. నుండి పుడుతుంది. దాని తర్వాతనే మిలియరీ హెపాటిక్ క్షయ కంటే స్థానిక హెపాటిక్ టిప.బి హెపా విరుద్ధంగా స్థానిక హెపాటిక్ క్షయ ఉన్నవారు సాధారణంగా ఆక్టివ్ పల్మోనరీ డిసాజ్‌ని కల్గి ఉండరు.

మిలియరీ హెపాటిక్ క్షయ : ఇది ఊపిరి తిత్తుల ఇన్ఫెక్షన్ వల్ల వ్యాపిస్తుంది. దీన్నే జనరలైజ్‌నడ క్షయ లేదా మెక్రోనొడ్యులార్ మిలియరీ టి.బి అని అంటారు. ఇది 80% మందిలో కన్పిస్తుంది. ఇది హెపాటిక్ ఆర్టరీ వ్యాపిస్తుంది.

ఆధ్యాత్మికం

# శ్రీ వాసవీ కన్యకాదేవి

కుసుమశ్రేష్టి, కుసుమాంబ దంపతులకు పుత్రకామేష్టి యజ్ఞఫలంగా జన్మించింది వాసవి. మూడేండ్ల ప్రాయంలో బాలవాసవి ఒకనాడు అన్నము తినక మారాము చేసింది. తల్లి కుసుమాంబ ఆమెతో అన్నాన్ని తినిపించాలని, 'ఏయ్ బుజ్జీ! నోరు తెరు, నోరు తెరు' అని గద్దించింది. వాసవి నోరు తెరిచింది. బ్రహ్మాండమంతా గోచరించింది ఆ చిన్న నోటిలో! వాసవాంబను తన హృదయానికి హత్తుకొంది కుసుమాంబ. ఆమె కళ్లవెంట ఆనందభాష్పాలు జలజలరాలాయి. బాలవాసవికి ఐదేండ్ల వయసు వచ్చింది. పూజగదిలోని దేవీపీఠంమీద ఆశీనురాలై అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. తాను పరమేశ్వరియేనని సూచనప్రాయంగా తెలిపింది. కన్యగా వాసవి 'త్రిలోకైక సౌందర్యవారాశిగ రూపొందినది'. చెలులతో కలిసిఉన్న వాసవిని వైశ్యరాజ్యాన్ని ప్రజాను రంజకంగా పరిపాలిస్తుండిన ధర్మమూర్తి పట్టపురాజు చూసి, 'ఔరా! చుక్కలనడుమచందురునట్లు వెలిగెడు కన్నె ముందర వన్నె కాంచిన నగరుసుందరలందరొక లెక్కా' అనుకొన్నాడు. (పుట 352 'కన్యక' గురజాడ సాహిత్య సర్వస్వం) అది కేవలం ఆమె దేహసౌందర్యంకాదు, దైవీగుణసౌందర్యం. మానవునిలో సత్యము, శాంతము, కరుణ, అహింస, త్యాగము అను అయిదు గుణాలు పంచప్రాణములై వృద్ధి చెందాలన్నది ఆమె బోధ. వివాహ విషయమున వ్యక్తికి గల స్వాతంత్ర్యమును హరించు అధికారము ఎవ్వరికీ లేదనునది ఆమె అభిప్రాయము. ఆమె 'కన్యక'గానే జీవించాలనుకొంది. విష్ణువర్ధన మహారాజు ఆమెను బలాత్కారముగా వివాహమాడదలిచాడు. అలా జరగకుండా ఉండటానికి వాసవి అగ్నిగుండ ప్రవేశం చేసింది. తాను ప్రాణత్యాగాన్ని చేసింది. కానీ ఆ రాజును దూషించలేదు. రాజును శపించినది కదా అని కొందరంటారు. ఆమె శపించలేదని, 'విష్ణువర్ధనుని తలవేయి వ్రయ్యలుగ వ్రీలి పోగలదు' అని ఆకసము నుండి ఒక వాణి వినపడిందని శ్రీవాసవీ కన్యకాదేవి పురాణము (కొల్లిపర పాండురంగారావు) చెబుతుంది.

- రాచమడుగు శ్రీనివాసులు

# వయసు ఆటంకం కాదు..

'నేనేమన్నా చిన్న పిల్లనా.. చెప్పగానే ఇట్టే పట్టేయడానికి!' వయసుపై బడ్డ వాళ్లు ఇలాంటి మాటలు అనడం వింటూ ఉంటాం. కానీ ఒక కళో, నైపుణ్యమో నేర్చుకోవడానికి మనం చిన్నపిల్లలుగానే ఉండక్కర్లేదదు. నాట్యం, సంగీతం.. ఇలా నైపుణ్యం ఏదైనా సరే. చిన్న వయసు లోనే ఒంట పడతాయి. అన్న భావన మనలో ఉంటుంది. ఆ వయసుని గోల్డెన్ పీరియడ్ అంటుంటారు. కానీ ఒక విద్యని నేర్చుకోవడానికి గోల్డెన్ పీరియెడ్ అంటూ ఏదీ ఉండదు. చిన్న పిల్లలు ఎలా నేర్చుకుంటారో అంతేవేగంగా పెద్దవాళ్లు నేర్చుకుంటారు. ఆ నైపుణ్యాలని మర్చిపోతారు. పెద్ద వాళ్లకుండే బాధ్యతలు, నిద్రలేమి కారణంగా వాళ్లకే సమస్యాలేదని నిర్ణయించారు. కాబట్టి శ్రద్ధా, సాధనా తోడైతే ఎంత పెద్ద వయసు వాళ్లైయినా కొత్త అంశాలు నేర్చుకోవచ్చు.


# అల్లం దివ్యౌషధం

మన వంటగదిలో సులభంగా లభించే అల్లం కేవలం వంటకాలకు రుచిని అందించడమే కాదు, ఆరోగ్యానికి ఓ దివ్యౌషధంలా పనిచేస్తుంది. నెలరోజుల పాటు రోజూ చిన్న అల్లం ముక్కను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరానికి ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అల్లంలో అద్భుత గుణాలు దాగి ఉన్నవి. అల్లం ఘాటైన రుచిని కలిగి ఉండటమే కాకుండ, ఎన్నో ఔషధ గుణాలను తనలో నింపుకుంది. ఇందులో జింజెరాల్, షోగావోల్, జింజిబెరీన్‌వంటి శక్తివంతమైన బయోయాక్టివ్ సమ్మేళనాలతో పాటు విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. శతాబ్దాలుగా అనేక రకాల అనారోగ్యాలను నయం చేయడానికి అల్లం సంప్రదాయ వైద్యంలో విరివిగా ఉపయోగిస్తున్నారు. అల్లంలో ఉండే 'జింజెరాల్' అనే పదార్థం వికారం, వాంతులు వంటి లక్షణాలను తగ్గించడానికి కూడా ఇది సహాయపడుతుంది. అలాగే 'షోగావోల్' అనే సమ్మేళనానికి నొప్పిని నివారించే గుణం ఉంది. ఇది కాన్సర్, గుండెజబ్బుల నివారణలోనూ తోడ్పడుతుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇక అల్లంలోని 'జింజిబెరీన్' జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో ముఖ్య భూమిక పోషిస్తుంది. ఇవే



కాకుండా అల్లానికి యాంటీ, డయామెటిక్ గుణాలు ఉన్నాయని, మెదడు పనితీరును మెరుగుపరుస్తుందని, రోగనిరోధకశక్తిని పెంచుతుందని పలు పరిశోధనల్లో వెల్లడైంది. రోజూ దాదాపు 1.5 సెంటీమీటర్ల అల్లం ముక్కను చిన్న చిన్న ముక్కలుగా చేసి టీ, స్మూతీ లేదా కూరల్లో కలుపుకుని తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని సూచిస్తున్నారు.

# గుత్తిగన్నేరు

మొక్కను పింక్ గార్డేనియా, ష్రబ్ వింకా, గుత్తిగన్నేరు అని చాలా పేర్లతో పిలుస్తారు. రంగు, సువాసనలతో ఆకర్షించే ఇది అలంకరణ మొక్కగా పాపులర్. 

మొగ్గలు పింక్‌కలర్‌లో వచ్చినా విచ్చుకున్నాక లేత గులాబీ, తెలుపు ఛాయలోకి మారతాయి. ఆకులు ముదురాకుపచ్చ రంగులో లెదర్ లుక్‌లో మెరిసిపోతాయి. పింక్ గార్డేనియాకు ఔషధ గుణాలతో పాటు గాలిని శుద్ధి చేసే శక్తి ఉంది. ముఖ్యంగా హానికారక రసాయనాలు, టాక్సిన్లను తొలగిస్తుంది. ఈ మొక్కకు సూర్యకాంతి అందాలి. నీళ్లు రోజూ పోయాలి. వేపనూనెను పిచికారీ చేస్తే మొక్కకు చీడపీడల ప్రమాదం ఉండదు.

# తిరుమల భద్రత మరింత పటిష్టం!

## అలిపిరిలో ప్రత్యేకంగా ఎపిఎస్‌పి చెక్‌పోస్టు

## కొండకొచ్చే అన్ని మార్గాల్లో నిరంతర తనిఖీలు

**తిరుమల,మే 2 ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ యాత్రాస్థలంగా, ఆధ్యాత్మిక్షేత్రంగా విరాజిల్లుతున్న తిరుపతినగరంతోబాటు హిందూ పుణ్యక్షేత్రం తిరుమలలో భద్రతను మరింతగా పటిష్టంచేసేదిశగా తిరుపతి జిల్లా పోలీసు యంత్రాంగం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా తిరుమలకు వచ్చే అన్ని ప్రవేశ మార్గాల్లో వాహనాలను, భక్తును క్షుణ్ణంగా నిరంతరం తనిఖీ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే తిరుపతి అలిపిరిలో సప్తగిరి తనిఖీ కేంద్రం ఉండగా అదనంగా కొత్తగా ఏపిఎస్‌పి చెక్‌పోస్టును ఏర్పాటుచేయాలని కూలంకుషంగా చర్చించి నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల తిరుమలకు అసాంఘిక శక్తులు, నిషేధిత పదార్థాలు తీసుకురాకుండా నియంత్రించడమేగాక పూర్తిగా తిరుమలను భద్రతావలయంలో ఉంచేందుకు దోహదపడుతుంది. ప్రస్తుత పరిణామాలు, పరిస్థితుల్లో తిరుపతి,తిరుమల భద్రతపై జిల్లా పోలీసుయంత్రాంగం కఠినమైన నిర్ణయాలు తీసుకుని అమలుచేయాలని భావించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆధ్వర్యంలో అదనపు ఎస్పీలు ఐ.రామకృష్ణ, రవిమనోహరాచారి, డిఎస్పీలు , సిఐలు , ఇంటెలిజెన్స్,విజిలెన్స్ అధికారులుతో ఎస్పీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అందరి అభిప్రాయాలుతో భద్రతావిషయంలో ముందుకు వెళ్ళనున్నారు. ఇప్పటికే తిరుమల,తిరుపతిలో భద్రతను పటిష్టం చేసి 24గంటలూ డేగకళ్ళతో పహరాకాస్తున్నారు. ఇంకా తిరుపతిలో 24గంటలూ యాత్రికుల రాకపోకలతో కిటకిటలాడుతోంది. అయితే ఇకపై అర్ధరాత్రి దాటిన తరువాత అనుమానాస్పదంగా సంచరించే, కొత్తవ్యక్తులపై మరింత నిఘా ఉంచి వారి వేలిముద్రలు తీసుకునేందుకు పోలీసులు అడుగులు వేస్తున్నారు. తిరుపతి,తిరుమలలో నిత్యం తనిఖీలు చేయాలని, అనధికారిహాకర్ల భరతం పట్టాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. తిరుమలకొండదిగువన 3 సిసికెమెరాలు, కొండకు వేళ్ళేమార్గంలో 3 సిసికెమెరాలు ఏర్పాటుచేసి 24గంటలూ పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లాల మధ్య సమాచారం ఉంటే నేరస్తుల కదలికలను పసిగట్టి పట్టుకోవడం సులభమవుతుందన్నారు. కీలక ప్రదేశాల్లో నిరంతరం తనిఖీలు తప్పవన్నారు. ఇతర రాష్ట్రాలవారిని గుర్తించి వారివద్ద ఉన్న గుర్తింపుకార్డులతోబాటు వారి చిరునామాలు నిరంతరం తనికీ చేయాలన్నారు. ప్రతిరోజూ హోంస్టేలు, లాడ్జీలు,.హోటళ్ళలో తనిఖీలు చేయాలని ఎస్పీ స్పష్టంచేశారు. తిరుమలలో నిర్మాణంలో భవనాల వద్ద పనిచేసే కార్మికులపై పోలీసులు నిఘా ఉంచాలని, ప్రైవేటు కాంట్రాక్టు పెళ్ళిళ్ళ బ్రోకర్లు, లేబర్‌కాంట్రాక్టర్లను తనిఖీచేయాలన్నారు. ఒక్కో సెక్టార్‌లో హాకర్లను తనిఖీచేసి వివరాలు సేకరించాలన్నారు. వారివారి ఆధార్‌కార్డులను తరచూ తనిఖీ చేయాలన్నారు. కీలక ప్రాంతాల్లో 24గంటలూ తనిఖీలు, అలర్టుగా ఉండాలన్నారు.



తిరుమల ఘాట్‌లో లింకురోడ్డువద్ద భద్రత సిబ్బంది ఆకస్మిక తనిఖీలు

# కులగణన అంశంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే దిక్సూచి

## కేంద్రం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.మే2:** కులగణన అంశంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే దిక్సూచిగా నిలిచిందని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ స్పష్టం చేశారు. జనాభా లెక్కలు,కులగణనపై కేంద్రం తీసుకున్న నిర్ణయంపై ట్విట్టర్ వేదికగా శుక్రవారం స్పందించారు. ఈ సందర్భంగా స్పీకర్... దేశంలో జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం అని,కులగణనతో దేశంలో మెజారిటీగా ఉన్న దళిత,గిరిజన,వెనుకబడిన వర్గాలకు సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. అంతేగాక పెరిగిన జనాభాకు అనుగుణంగా వారికి విద్యా,ఉద్యోగం, రాజకీయ పదవులలో న్యాయమైన వాటా లభిస్తుందని అన్నారు. జనాభా లెక్కించడం ద్వారా నిధులు,సంక్షేమ పథకాలు అందుతాయని,రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ కన్న కలలు నిజం అవుతాయని స్పష్టం చేశారు. అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కులగణన పూర్తి చేసి, తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలిచిందని వివరించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని శాసనసభ ఏకగ్రీవంగా తీర్మాణం చేసిందని, రాష్ట్ర శాసనసభలో ఆమోదం పొందిన బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి పంపినందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ధన్యవాదాలు తెలిపారు. శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించి అమలు చేస్తున్న మొదటి రాష్ట్రం తెలంగాణ అని, తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వంలో వెనుకబడిన తరగతులకు పెద్దపీట వేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి,మంత్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇక కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా త్వరగా కులగణన పూర్తి చేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కోరారు.





డిప్యూటీ సిఎం పవన్‌ను ప్రధాని మోడీ దగ్గరకు పిలిచి చాక్లెట్ ఇవ్వడంతో నవ్వుతున్న సిఎం చంద్రబాబు

# పవన్‌ను ప్రత్యేకంగా పిలిచి చాక్లెట్ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ

## మీ హృదయం మాదిరి ఇది తియ్యనది అంటూ చమత్కరించిన పిఎం

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి పున:ప్రారంభ కార్యక్రమంలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. సభా వేదికపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ప్రధాని మోదీ తన దగ్గరకు ప్రత్యేకంగా పిలిచారు.ఆయనకు ప్రత్యేక బహుమతి( స్పెషల్ గిఫ్ట్)ఇచ్చారు.అత్యంత ఆసక్తికరమైన ఈ పరిణామంలో నవ్వులు విరిసాయి. పవన్ ప్రసంగం తర్వాత స్వయంగా ప్రధాని మోదీ . పవన్‌ను తన వద్దకు రమ్మని ఆహ్వానించారు. ఆపై డిప్యూటీ సీఎంకు అత్యంత ఖరీదైన చాక్లెట్‌ను గిఫ్ట్‌గా ఇచ్చారు.మీ హృదయం మాదిరిగా ఇది తియ్యనది అంటూ చమత్కరించారు. ప్రధాన మంత్రి చాక్లెట్‌ను తీసుకున్న పవన్ ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. పవన్‌కు మోదీ చాక్లెట్ ఇవ్వడంతో పక్కనే ఉన్న సీఎం చంద్రబాబు కూడా నవ్వులు పూయించారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై సిఎం నాన్చుడు ధోరణి సరికాదు: ఎఐఎస్‌ఎఫ్

## పరీక్షలు నిర్వహించలేని పరిస్థితి నెలకొందంటూ ఆవేదన

**హైదరాబాద్, మే 02, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాన్చుడు దోరణితో వ్యవహారించడం సరైంది కాదని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కమిటీ మండిపడింది. రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సంఘం రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో రాష్ట్రం లోని డిగ్రీ కళాశాల యాజమాన్యాలు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించడం లేదని తెలిపారు. కాకతీయ యూనివర్సిటీతోపాటు పాలమూరు, తెలంగాణ, మహాత్మా గాంధీ, శాతవాహన యూనివర్సిటీల పరిధిలోని ఫీజు బకాయిల విడుదల లేక, కళాశాలల నిర్వహణ జరగడం లేదన్నారు. అప్పులు తెచ్చి మరి కళాశాలలు నిర్వహిస్తున్నామని .. ఫీజు బకా యిలు విడుదల చేసే వరకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించమని కాలేజీ యాజమాన్యాలు ప్రకటిం చాయన్నారు. ఇప్పటికే అనేక యూనివర్సిటీల్లో పరీక్షలు వాయిదా పడ్డప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని.. ప్రభుత్వ నిర్ణయంతో డిగ్రీ మూడో సంవత్సరం 6వ సెమిస్టర్ పరీక్షలు రాసే విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిల విడుదలపై ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల చదువులకు ఆటంకాలు కలుగుతున్నాయన్నారు. విద్యాశాఖను తన దగ్గరే పెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి బకాయిలు విడుదల చేసి.. పరీక్షల నిర్వహణ జరిగేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# అవసరమైతే ఇండియా కోసం చనిపోవడానికి సిద్ధం

## సినీ కొరియోగ్రాఫర్ జానీమాస్టర్

**కావలి, (నెల్లూరు)మే 2 ప్రభాతవార్త** ఇండియన్ ఫ్లాగ్‌లో మూడు రంగులు ఎలా ఉన్నాయో ఇండియాపై దాడిచేసేవారికి హిందూ, ముస్లిం, క్రిష్టియన్ ఏకమై ఎదుర్కొంటామని అవసరమైతే ఇండియాకోసం చనిపోవడానికైనా సిద్ధమేనని ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ జానీమాస్టర్ తెలిపారు. కావలి ఆనాలవారివీధిలో నివసిస్తున్న ఉగ్రవాదుల దాడుల్లో మృతిచెందిన మధుసూధన్ కుటుంబాన్ని జానీమాస్టర్ కలిశారు. చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు. ఎన్ని కుట్రలు పన్నినా ఇండియాలో అందరం కలిసి ఉంటామని హెచ్చరికలు చేశారు. ఉగ్రవాదులు ఇలాంటి దాడులకు పాల్పడడం దారుణమన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మధుసూధన్ కుటుంబసభ్యులను ఆదుకోవడం ఆ కుటుంబానికి ధైర్యాన్నిచ్చిందన్నారు. ఉగ్రవాదుల దాడుల్లో మృతిచెందిన 26 మంది కుటుంబాలను అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. కొందరు కులాలు, ప్రాంతాల మధ్య కూడా చిచ్చుపెట్టాలని చూస్తున్నా రన్నారు. ఇది మంచి పద్దతి కాదన్నారు. మేమందరం భారతీయులమని అవసరమైతే ఇండియా కోసం ప్రాణాలర్పించడానికైనా సిద్ధమేనంటు కుటుంబసభ్యులకు ధైర్యాన్నిచ్చారు.



# మధుసూధన్ కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటాం!

## వారి బిడ్డలకు ఉచితంగా మా కళాశాలల్లో చదివిస్తాం :సినీ హీరో మంచు విష్ణు

**కావలి, (నెల్లూరు)మే2 ప్రభాతవార్త** ఉగ్రవాదుల చేతుల్లో బలైన మధుసూధన్ కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని సినీ హీరో మంచువిష్ణు తెలిపారు. కావలి పట్టణ ఆనాలవారి వీధిలో నివసిస్తున్న మధుసూధన్ కుటుంబసభ్యులను శుక్రవారం పరామర్శించారు. చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులతో ఆయన మాట్లాడారు. మధుసూధన్ కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. ఆయన బిడ్డలకు తమ పాఠశాలల్లో, కళాశాలల్లో ఉచితంగా విద్యనందిస్తామన్నారు. ఏ సహాయం కావాలన్నా అండగా ఉంటామన్నారు.

# డెన్‌లో డాన్‌గా ముంబై



**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 2025 పాయింట్స్ టేబుల్‌లో ముంబై ఇండియన్స్ తొలిసారి టాప్ ప్లేస్‌కు చేరుకుంది. ఐపిఎల్ ప్లే ఆఫ్స్‌కు దగ్గరవుతున్న కొద్దీ ముంబై ఇండియన్స్ తన తడాఖాతో పాయింట్స్ టేబుల్ టాప్‌లో తొడగొట్టింది. సీజన్ ఆరంభంలో అట్టడుగు స్థానాలతో పోటీపడిన ముంబై ఇండియన్స్ ఇప్పుడు టాప్ ప్లేస్‌లో కింగ్‌లా కూర్చుంది. మొదటి ఐదు మ్యాచ్‌లలో కేవలం ఒక్కటే గెలిచి హార్దిక్ సేన, ఆ తర్వాత వరుసగా ఆరు విజయాలతో ముంబై ఈజ్ బ్యాక్ అని చాటిచెప్పింది. ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడిన ముంబై ఇండియన్స్ ఏడు విజయాలతో టేబుల్ టాప్‌లో నిలిచింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కంటే నెట్ రన్‌రేట్ ఎక్కువ ఉండటంతో ముంబై ఫస్ట్ ప్లేస్‌కి చేరుకుంది. వరుసగా ఆరు మ్యాచ్‌లలో విజయం సాధించిన ముంబై ఇండియన్స్ 14 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచింది. ఆర్సీబీకి కూడా 14 పాయింట్లు ఉన్నప్పటికీ నెట్ రన్‌రేట్ కారణంగా రెండో స్థానానికి వెళ్లాల్సి వచ్చింది. పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో జట్లు ప్లేఆఫ్ బెర్త్ కోసం పోటీ పడుతున్నాయి. సీఎస్కే, రాజస్థాన్ టోర్నీ నుంచి ఎలిమినేట్ అయ్యాయి. ఇక ఢిల్లీ క్యాపిటల్స్‌తో మొదలుపెట్టి వరుసగా సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్, రాజస్థాన్ రాయల్స్‌పై ముంబై ఇండియన్స్ వరుసగా ఆరు మ్యాచ్‌లు గెలిచింది. 14 పాయింట్లతో 1.274 నెట్ రన్‌రేట్‌తో టాప్ ప్లేస్‌లో నిలిచింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పది మ్యాచ్‌లలో ఏడు గెలిచి 0.521 రన్‌రేట్‌తో రెండో స్థానంలో కొనసాగుతోంది. మరో పక్క పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్టు ప్లే ఆఫ్ బెర్త్ కోసం పోటీపడుతున్నాయి. పంజాబ్ కింగ్స్ పది మ్యాచ్‌లలో ఆరు గెలిచి, మరో మ్యాచ్ డ్రా కావడంతో 13పాయింట్లతో 0.199 రన్‌రేట్‌తో మూడో స్థానంలో ఉంది. గుజరాత్ టైటాన్స్ తొమ్మిది మ్యాచ్‌లలో 12 పాయింట్లతో 0.748 నెట్ రన్‌రేట్‌తో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఢిల్లీ క్యాపిటల్స్ కూడా పది మ్యాచ్‌లు ఆడి 12 పాయింట్లతో 0.362 రన్‌రేట్‌తో ఐదో స్థానంలో ఉండగా, లక్నో పది పాయింట్లతో 0.325 రన్‌రేట్‌తో ఆరో స్థానానికి పడిపోయింది. కోల్‌కతా నైట్ రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లకు దాదాపు ప్లే ఆఫ్ ఆశలు లేనట్టే అని చెప్పొచ్చు. భారీ అద్భుతం జరిగితే తప్ప ఈ రెండు జట్లు ప్లే ఆఫ్‌కు చేరుకోలేవు. కేకేఆర్ తొమ్మిది పాయింట్లతో ఏడో స్థానంలో కొనసాగుతుండగా, సన్‌రైజర్స్ ఆరు పాయింట్లతో తొమ్మిదో స్థానంలో ఉంది. మాజీ ఛాంపియన్లు ఎలిమినేట్ ఐపీఎల్‌లో ఐదు ట్రోఫీలు గెలుచుకున్న చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్ నుంచి ఫస్ట్ ఎలిమినేట్ అయినజట్టుగా నిలవగా, ముంబైపై ఓటమి తర్వాత రాజస్థాన్ కూడా ఎలిమినేట్ అయింది. రాజస్థాన్ రాయల్స్ ఆరు పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉండగా, సీఎస్కే నాలుగు పాయింట్లతో అట్టడుగున పదో స్థానంలో ఉంది.

## కిందకి పడిపోయిన ఆర్సీబీ
## ప్లే ఆఫ్ బెర్త్ కోసం పోటీ
## మాజీ ఛాంపియన్లు ఎలిమినేట్స్



# ఫైనల్లో మలేషియా ఆశలు గల్లంతు
## భారత్‌కు ఓదార్పు విజయం

**న్యూఢిల్లీ:** క్వార్టర్ ఫైనల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాచేతిలో 0-3తేడాతో ఓడిపోవడంతో మలేషియా సుదిర్మాన్ కప్ ప్రచారం ముగిసింది. మొదటి సర్వ్‌కు ముందే, జియామెన్‌లోని ఫెంగ్‌హువాంగ్ జిమ్నాసియంలో 13 సార్లు ఛాంపియన్‌గా నిలిచిన మలేషియాతో తలపడటం చైనాకు పెద్ద సవాల్ అయినా, చివరకు దాన్ని అధిగమించింది. మిక్స్‌డ్ డబుల్స్ జోడీ చెన్ టాంగ్ జీతో ఈ వీ మలేషియాకు సానుకూల ఆరంభాన్ని అందించే ప్రయత్నంలో తమ సర్వస్వం అందించారు, కానీ ఫెంగ్ యాంజెహు వాంగ్ డాంగ్‌పింగ్‌ను నిర్వహించడం చాలా కష్టంగా అనిపించింది. ఎంత కష్టపడినా, టాంగ్ జీ మరియు ఈ వీ 49 నిమిషాల్లో 17-21, 17-21 తేడాతో ఓడిపోయారు. గ్రూప్ దశలో ప్రపంచ 8వ ర్యాంకర్ కోడై నరోకాను అద్భుతంగా ప్రదర్శించిన తర్వాత ఊపందుకున్న పురుషుల సింగిల్స్ షట్లర్ లియోంగ్ జున్ హావో, ప్రపంచ 1వ ర్యాంకర్ షి యుకిపై అదే ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయాడు. జున్ హావో అసాధారణంగా కనిపించాడు మరియు యుకికి సరితూగలేకపోయాడు, చైనా తన రెండవ పాయింట్‌ను 38 నిమిషాల్లో 6-21, 14-21 తేడాతో ఓడిపోయింది. మలేషియా ఫైనల్ ఆశాకిరణం కె. లెట్షానా కూడా టోక్యో 2020 ఒలింపిక్ బంగారు పతక విజేత చెన్ యుఫీపై కఠినంగా వ్యవహరించినా ఫలితం లేకపోయింది. కేవలం 30 నిమిషాల్లో 8-21, 7-21 తేడాతో ఓడిపోయింది. గత రెండు ఎడిషన్లలో వంటా (2021) మరియు సుజౌ (2023)లలో చేసినట్లుగా, కనీసం పతకంతో తిరిగి రావాలనే మలేషియా ఆశలకు ఈ ఓటమి ముగింపు పలికింది. ఇక ప్రతిష్టాత్మక సుదిర్మన్ బ్యాడ్మింటన్ ఫైనల్స్‌లో వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించిన భారత జట్టుకు ఓదార్పు విజయం. గ్రూప్ దశలో భాగంగా జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్.. 32తో ఇంగ్లండ్‌ను ఓడించింది. మహిళల సింగిల్స్‌లో అనుపమ 21-12, 21-16తో మియులిన్‌ను ఓడించి ఆరంభంలోనే ఆధిక్యం అందించింది. కరుణాకరన్ 18-21, 22-20, 21-13తో హ్యారీను చిత్తు చేశాడు.

# చెస్ టోర్నీలో ప్రజ్ఞాకు మూడో ప్లేస్



**న్యూఢిల్లీ:** ఇండియా గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద (20.5 పాయింట్లు) సూపర్బెట్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీలో మూడో స్థానంలో నిలిచాడు. పోలెండ్‌లోని వార్సా వేదికగా జరిగిన ఫైనల్ రౌండ్లో ప్రజ్ఞా తొలి ఐదు గేమ్‌ల్లో ఒక్క పాయింట్ మాత్రమే సాధించాడు. కానీ సెకండాఫ్‌లో ఇండియన్ మాస్టర్ వరుసగా డుడా, తపలోవ్, అరవింద్, గావ్రిలెసెక్‌ను ఓడించాడు. దీంతో తొమ్మిది గేమ్‌ల్లో ఐదు పాయింట్లను సాధించడంతో మూడో ప్లేస్ ఖాయమైంది. వ్లాదిమిర్ ఫడోసీవ్ (స్లోవేనియా) 26.5 పాయింట్లతో టైటిల్‌ను గెలుచుకోగా, మ్యాక్సీమ్ వాచిర్ లాగ్రెవ్ (ఫ్రాన్స్) 21.5 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఇండియాకు చెందిన అరవింద్ చిదంబరం 17 పాయింట్లతో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఈ నెల 7 నుంచి మొదలయ్యే క్లాసికల్ ఈవెంట్లో ప్రజ్ఞానందతో పాటు గుకేశ్ బరిలోకి దిగనున్నాడు. అమెరికన్ ద్వయం కరువానా, వెస్లీ సో, నోడిర్బెక్ అబ్దుసత్తారోవ్ (ఉజ్బెకిస్తాన్) పోటీలో ఉన్నారు. రొమేనియా రాజధాని బుకారెస్ట్లో ఈ టోర్నీ జరగనుంది.

## ఉమెన్స్ వన్డే ప్రపంచ కప్‌కు
# భారత్ ఆతిథ్యం

**న్యూఢిల్లీ:** భారత్‌లో జరిగే వన్డే ప్రపంచకప్-2025కి అర్హత సాధించిన పాకిస్తాన్‌తో హైబ్రిడ్ మోడ్‌లో టోర్నమెంట్ జరగనుంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఐసీసీ ఉమెన్స్ వన్డే ప్రపంచకప్ మెగా టోర్నీ జరగనుంది. సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 26 వరకు జరిగే ఈ మెగా టోర్నమెంట్‌కు భారతదేశం ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ మెగాటోర్నీకి ఫాతిమా సనా నేతృత్వంలోని పాకిస్తాన్ జట్టు అర్హత సాధించింది. ఇక పాక్ జట్టు వన్డే ప్రపంచ కప్ 2025 క్వాలిఫై కావడంతో ఈ మెగా టోర్నీని హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించనున్నారు. పాక్ ఆడే మ్యాచ్‌లను ఏ దేశంలో నిర్వహిస్తారు అన్న దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ మెగా టోర్నీలో ఆతిథ్య హోదాలో భారత్ ఆడనుండగా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, న్యూజిలాండ్ ర్యాంకింగ్స్‌లో తొలి ఆరు స్థానాల్లో నిలిచి అర్హత సాధించాయి. క్వాలిఫయర్స్‌లో ఆడి పాక్ అర్హత సాధించగా మరో స్థానం బంగ్లాదేశ్ సంపాదించింది. ఈ ఏడాది జరిగిన మెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీ-2025కు పాకిస్థాన్ ఆతిథ్యం ఇచ్చింది. అయితే భద్రతా కారణాల దృష్ట్యా భారత జట్టును పాక్‌కు పంపలేమని బిసిసిఐ ఐసిసికి తెలియజేసింది. ఈ క్రమంలో ఐసిసి సమక్షంలో బిసిసిఐ, పిసిబి బోర్డుల మధ్య హైబ్రిడ్ మోడ్‌కు అంగీకారం కుదిరింది. ఛాంపియన్స్ 2025తో పాటు భవిష్యత్తులో జరగనున్న అన్ని టోర్నీల్లో భారత్, పాక్ జట్లు తటస్థ వేదికల్లోనే ఆడతాయి.

## మాడ్రిడ్ ఓపెన్ టైటిల్ సెమీస్‌లో..
# కోకో గౌఫ్ సంచలన విజయం
## వరల్డ్ ఛాంపియన్ స్వియాటెక్ ఘోర పరాజయం



**న్యూఢిల్లీ:** పోలిష్ ప్రపంచ నంబర్ టూ మరియు ఐదు సార్లు గ్రాండ్ స్లామ్ విజేత, రెండవ ర్యాంక్‌లో ఉన్న ఇగా స్వియాటెక్ ఒక్క బ్రేక్ పాయింట్‌ను కూడా సాధించలేక పోయింది మరియు ఆమె ఎదుర్కొన్న ఏడు బ్రేక్ పాయింట్ లలో రెండింటిని ఒక గంటా ఆరు నిమిషా ల్లోనే కాపాడుకుంది. జరిగిన సెమీఫైనల్లో ప్రస్తుత ఛాంపియన్ ఇగా స్వియాటెక్ కోకో గౌఫ్ చేతిలో 6-1, 6-1 తేడాతో ఘోర పరాజయం పాలైంది. అమెరికన్ క్రీడాకారిణి మాడ్రిడ్ ఓపెన్ టైటిల్ కోసం ప్రపంచ నంబర్ వన్ అరినా సబలెంకాను ఎదుర్కోనుంది. సెమీఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించిన తర్వాత అమెరికాకు చెందిన కోకో గౌఫ్ సంబరాలు చేసుకుంటున్నారు. రెండవ ర్యాంకర్ స్వియాటెక్ గౌఫ్‌పై ఐదుసార్లు సర్వీస్‌ను వదులుకుంది. సాధారణంగా క్లే కోర్ట్ మీద అద్భుతంగాఉండే స్వియాటెక్, మాడ్రిడ్ టైటిల్ డిఫెన్స్ సమయంలో ఇబ్బంది పడింది. ఆమె అలెగ్జాండ్రా ఈలా మరియు డయానా ష్నైడర్‌లపై సెట్‌లను కోల్పోయింది, ఆపై కేవలం 24 నిమిషాల్లో మాడిసన్ కీస్ చేతిలో బాగెల్‌ను ఎదుర్కొంది. అయితే, 23ఏళ్ల పోల్ అమెరికన్‌ను ఓడించడా నికి బలంగా పుంజుకుని మొదటిసారి స్వియా టెక్‌ను ఓడించాడు. ఈ తాజా ఓటమితో, మేనెలలో తన ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను కాపాడుకునే ముందు, స్వియాటెక్‌కు రాబోయే ఇటాలియన్ ఓపెన్ మాత్రమే విజయాల బాటలో తిరిగి రావడానికి సహాయపడుతుంది.

# ఎయిరిండియాకు రూ.5వేల కోట్ల నష్టం!

**న్యూఢిల్లీ, మే 2:** పహల్గాం ఉగ్ర దాడితో తలెత్తిన ఉద్రిక్తతల వల్ల పాక్ గగనతలం ఏడాది పాటు మూసివేతతో ఎయిర్ ఇండియా సంస్థకు రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లనుంది. ఈ విషయాన్ని ఆంగ్ల వార్తా సంస్థ పీటీఐ వెల్లడించింది. పాక్ పై భారత్ తీసుకొన్న దౌత్యపరమైన చర్యలకు ప్రతిగా వారు ఈ నిర్ణయం తీసుకొన్నారు. ఎయిర్ ఇండియా సహా, ఇండిగో, స్పైస్‌జెట్ వంటి విమానయాన సంస్థలు తాజాగా సూచనలు, సలహాలను పౌర వైమానిక శాఖకు తెలియజేశాయి. ఈ నేపథ్యంలో వీటిని పరిశీలించి తగిన పరిష్కారం వెతికే పనిలో ఆ శాఖ తలమునకలైంది. ఈ క్రమంలో ఏడాదిపాటు పాక్ గగనతలం మూసివేస్తే తమకు సుమారు 600 మిలియన్ డాలర్లు (రూ.5 వేల కోట్లు) నష్టం వాటిల్లుతుందని ఎయిర్ ఇండియా పేర్కొంది. ఈనేపథ్యంలో ఆ వైమానిక సంస్థ పలు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టింది. ఈ విషయంపై ఆ సంస్థ నుంచి ఎటువంటి అధికారిక వ్యాఖ్యలు వెలువడలేదు. మనదేశంలో ఎయిర్ ఇండియా, ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, స్పైస్‌జెట్, ఆకాశా ఎయిర్ అంతర్జాతీయ సర్వీసులను నడుపుతున్నాయి. ఈ మేరకు ఏప్రిల్ 28న పౌర విమాన యాన శాఖ మంత్రి కె.




రామ్మోహన్ నాయుడు మన విమానయాన సంస్థలతో కలిసి ప్రత్యామ్నాయాలపై కసరత్తు చేస్తున్నారు. పాక్ నిర్ణయం ప్రభావం ఉత్తర భారత్‌లోని నగరాల నుంచి నడిచే సర్వీసులపై పడుతుంది. మన వైమానిక సంస్థలకు వారానికి రూ.77 కోట్ల అదనపు భారం పడొచ్చని అంచనా. ఇక భారత్ కూడా గత బుధవారం నుంచి పాకిస్థాన్ విమానాలకు మే 23వ తేదీ వరకు గగనతలం మూసివేసింది.

# టాటా ఆల్ట్రోజ్‌కు ఫేస్‌లిఫ్ట్

**ముంబై, మే 2:** ఆటోమొబైల్ ఇండస్ట్రీలో మే నెలలో సందడి వాతావరణం కనిపించనుంది. కొత్తగా అప్‌డేట్‌లు ఏవీ లేకపోవడంతో ఏప్రిల్ నెల చప్పగా సాగిపోయింది. ఈ నెలలో మాత్రం కార్లకు సంబంధించిన కొన్ని అప్‌డేట్స్ వాహన ప్రియులను అలరించనున్నాయి. ఆ వివరాలు ఇవీ..టాటా మోటార్స్‌కు చెందిన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ టాటా ఆల్ట్రోజ్ ఫేస్ లిఫ్ట్ ఈ నెల రాబోతోంది. ఎక్స్‌టీరియర్ పరంగా బంపర్లు, అలాయ్ వీల్స్ వంటి చిన్నచిన్న మార్పులతో రాబోతున్న ఈ కారులో ఇంటీరియర్ పరంగా చాలావరకు మార్పులు చేయనున్నట్లు సమాచారం. సీఎన్‌జీ, పెట్రోల్, టర్బో పెట్రోల్, డీజిల్ ఇంజిన్లతో లభించబోతోంది. మే 21న కొత్త ఫేస్‌లిఫ్ట్‌ను లాంచ్ చేసే అవకాశం ఉంది. కియా కరెన్స్ ఫేస్‌లిఫ్ట్ క్లావిస్‌గా మార్కెట్‌లోకి ఎంట్రీ ఇవ్వనుంది. మే 8న దీన్ని ఆన్‌లైన్‌లో ఆవిష్కరించనున్నారు. జూన్ 2న ధర వెల్లడికానుంది. 360 డిగ్రీల కెమెరా, ఆరు ఎయిర్ బ్యాగులతో పాటు లెవల్2 అడాస్ ఫీచర్లతో ఈ కారు రాబోతోంది. పనోరమిక్ సన్‌రూఫ్, 12.3 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌తో వస్తోంది. పెట్రోల్, టర్బో పెట్రోల్, డీజిల్ ఇంజిన్ ఆప్షన్లతో ఈ ఎంపీవీ లభించనుంది. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ తన విండ్‌సోర్ ఈవీని మరింత బిగ్ బ్యాటరీతో తీసుకురాబోతోంది. ప్రస్తుతం 38కెడబ్ల్యూహెచ్ బ్యాటరీతో లభిస్తున్న ఈ కారులో కొత్తగా 50.6 కెడబ్ల్యూహెచ్ సామర్థ్యం కలిగిన బ్యాటరీ ఇవ్వనున్నారు. దీంతో ఆ మేర రేంజ్ పెరగనుంది. ఎంజీ మాతృ సంస్థ సియాక్‌కు చెందిన వులింగ్ క్లౌడ్ ఈవీకి అనుగుణంగా బిగ్‌బ్యాటరీతో విండ్‌సోర్ కారును తీసుకురానున్నారు. ఇది మే నెలలోనే రాబోతున్నప్పటికీ.. తేదీ మాత్రం ఇంకా వెల్లడికాలేదు. జర్మన్ కార్ల తయారీ సంస్థ గోల్ఫ్ జీటీఐ మోడల్‌ను ఇదే నెలలో లాంచ్ చేయనుంది. పోలో జీటీఐ తర్వాత జీటీఐ బ్యాడ్జ్‌తో వస్తున్న రెండో మోడల్ ఇది. దీన్ని నేరుగా దిగుమతి చేసి దేశీయంగా విక్రయించనున్నారు. 2 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో వస్తున్న ఈ కారు 261 బీహెచ్‌పీ పవర్‌ను, 370 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. వీటితో పాటు మెర్సిడెస్‌బెంజ్, ఆడి, బీఎండబ్ల్యూ నుంచి కూడా అప్‌డేట్స్ ఉండొచ్చని ఆటోమొబైల్ వర్గాలు చెబుతున్నాయి.



# అలెంబిక్ జనరిక్‌కు యుఎస్‌ఎఫ్‌డిఎ ఆమోదం

**వాషింగ్టన్, మే 2:** గుండెపోటు, స్ట్రోక్ నివారణకు జనరిక్‌ఔషధాన్ని మార్కెట్ చేయడానికి యూఎస్ హెల్త్ రెగ్యులేటర్ నుంచి ఆమోదం లభించిందని అలెంబిక్ ఫార్మా శుక్రవారం తెలిపింది. టికాగ్రెలర్ టాబ్లెట్లు..90 ఎంజి, 60ఎంజి కొత్త ఔషధ అప్లికేషన్(ఎఎన్‌డిఎ) కోసం కంపెనీ యుఎస్‌ఎఫ్‌డిఎ నుంచి తుది ఆమోదం పొందిందని అలెంబిక్ ఫార్మా ఒక ప్రకటనలో తెలిపింది. కంపెనీ ఆమోదించిన ఆస్ట్రాజెన్ కా ఫార్మాకు సంబంధించిన బ్రిలింటా టాబ్లెట్లు 60ఎంజి, 90 ఎంజిలకు చికిత్సాపరంగా సమానం అని అలెంబిక్ ఫార్మా పేర్కొంది. టికాగ్రెలర్ మాత్రలు తీవ్రమైన కరోనరీ సిండ్రోమ్ ఉన్న రోగులలో కార్డియోవాస్కులర్ మరణం, మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్(ఎంఐ), స్ట్రోక్ నుంచి ప్రమాదాన్ని తగ్గించడానికి సూచించబడుతుంటాయి. ఐక్యూవిఐఎ ప్రకారం, 2025, మార్చితో ముగిసిన పన్నెండు నెలలకు టికాగ్రెలర్ ఔషధాలు(90 ఎంజి)..1,062 మిలియన్ డాలర్ల(రూ.8,920 కోట్లు) మార్కెట్ పరిమాణాన్ని కలిగి ఉన్నట్లు అంచనా. టికాగ్రెలర్ ఔషధాలు(60ఎంజి)..2025, మార్చితో ముగిసిన పన్నెండు నెలలకు 242 మిలియన్ డాలర్ల(రూ.2,032 కోట్లు) మార్కెట్ పరిమాణాన్ని కలిగి ఉన్నట్లు అంచనా.




# వాణిజ్యం

# టారిఫ్‌లతో ఆపిల్‌పై 900 మిలియన్ డాలర్ల ప్రభావం!

**వాషింగ్టన్, మే 2:** ఐఫోన్ తయారీ కంపెనీ ఆపిల్ ప్రస్తుత సంవత్సరం మొదటి త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. విశ్లేషకులు ఊహించిన దానికంటే మెరుగైన ఫలితాల్ని నమోదు చేసింది. అయితే రానున్న త్రైమాసికంలో అమెరికా సుంకాల కారణంగా కంపెనీకి నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపింది. తమ సప్లై చెయిన్‌ను ఇది దెబ్బతీసే అవకాశం ఉందని వెల్లడించింది. సుంకాల వల్ల కంపెనీపై 900 మిలియన్ డాలర్ల మేర ప్రభావం పడనున్నట్లు కంపెనీ సీఈఓ టిమ్ కుక్ తెలిపారు. అమెరికా, చైనా భారీస్థాయిలో పరస్పర సుంకాలు విధించుకోవడంతో ఇరుదేశాల మధ్య వాణిజ్య యుద్ధం రాజుకుంది. ఈ క్రమంలోనే టారిఫ్‌ల నుంచి తప్పించుకునేందుకు దిగ్గజ సంస్థ యాపిల్ ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. అయితే ప్రతీకార సుంకాల నుంచి ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, సెమీ కండక్టర్లను మినహాయించారు. ఈ నేపథ్యంలో యాపిల్ ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటూ భారత్‌లో ఉత్పత్తిని పెంచింది. రానున్న రోజుల్లో సుంకాలపై ఎలాంటి చర్యలు తీసుకొనే అవకాశం ఉందో తెలియదు. దీంతో సుంకాల ప్రభావాన్ని కచ్చితంగా అంచనా వేయలేకపోతున్నాం. ప్రస్తుత సుంకాల రేట్లు, విధానాలు మారకపోతే ఆపిల్‌పై 900 మిలియన్ డాలర్లు అధిక భారం పడే అవకాశం ఉంది అని టిమ్ కుక్ అన్నారు. భారత్‌లో ఉత్పత్తిని మరింత విస్తరించాలని చూస్తున్నట్లు కంపెనీ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. ఐప్యాడ్, మ్యాక్, ఆపిల్ వాచ్, ఎయిర్‌పాడ్ వంటి ఉత్పత్తులు దాదాపుగా వియత్నాంలో ఉత్పత్తి అవుతున్నాయని కుక్ తెలిపారు.



అమెరికా వెలుపలి మార్కెట్ కోసం చైనా ఇప్పటికీ ప్రధాన ఉత్పత్తి కేంద్రంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇక ప్రస్తుత సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఐఫోన్ విక్రయాలు జోరందుకున్నాయి. దీంతో ఆపిల్ 95.4 బిలియన్ డాలర్లుఆదాయం నమోదు చేసింది. ఇందులో చైనా నుంచే 17 బిలియన్ డాలర్లు వచ్చాయి. ఇక కంపెనీ లాభం 24.8 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మే 2:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నేడు ఒడుదొడుకులు ఎదుర్కొన్నాయి. ఆరంభంలో భారీ లాభాల్లో దూసుకెళ్లిన సూచీలు, ఇంట్రాడేలో ఆ లాభాలను కోల్పోయాయి. ముఖ్యంగా మెటల్, ఫార్మా షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. సెన్సెక్స్ ఓ మోస్తరు లాభాల్లో ముగియగా, నిఫ్టీ 24,300 ఎగువన ఫ్లాట్‌గా స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 80,300.19 పాయింట్ల వద్ద (లాభాల్లో ప్రారంభమై, ఇంట్రాడేలో దాదాపు 900 పాయింట్లకు పైగా లాభపడి 81,177.93



వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 259.75 పాయింట్ల లాభంతో 80,501.99 వద్ద ముగిసింది. నిఫ్టీ 12.50 పాయింట్ల లాభంతో 24,346.70 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.50గా ఉంది. అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, ఇండస్ ఇండ్ బ్యాంక్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. నెస్లే ఇండియా, ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టైటాన్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3270 డాలర్ల వద్ద కొనసాగింది.

# ఇంకా చలామణిలోనే రూ.2వేల నోట్లు

**న్యూఢిల్లీ, మే 2:** పెద్ద నోట్లు రద్దు తర్వాత తీసుకొచ్చిన రూ.2 వేల నోట్లను ఉపసంహరించుకుని దాదాపు రెండేళ్లవుతున్నా.. రూ.6266 కోట్ల విలువైన నోట్లు ఇంకా చలామణీలో ఉన్నాయి. ఇప్పటి వరకు 98.24 శాతం నోట్లు వెనక్కి వచ్చాయని.. మిగిలినవి ఇంకా రావాల్సి ఉన్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. నోట్లను వెనక్కి తీసుకున్నప్పటికీ.. అవి లీగల్ టెండర్ (చెల్లుబాటు)గా కొనసాగుతాయని తెలిపింది. 2023 మే 19 చలామణీలో ఉన్న రూ.2 వేల నోట్లను ఆర్‌బీఐ వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ప్రకటించే నాటికి రూ.3.56 లక్షల కోట్లు విలువైన నోట్లు చలామణీలో ఉన్నాయి. నోట్ల ఉపసంహరణ తర్వాత 2023 అక్టోబర్ 7 వరకు బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు పౌరులకు ఆర్‌బీఐ అవకాశం కల్పించింది. ఆపై రిజర్వ్ బ్యాంక్‌కు చెందిన 19 ప్రాంతీయ కార్యాలయాల్లో డిపాజిట్ చేసే వెసులుబాటు కల్పిస్తోంది. అలా ఏప్రిల్ 30 నాటికి రూ.6,266 కోట్లు విలువైన నోట్లు ఇంకా వెనక్కి రాలేదని ఆర్‌బీఐ పేర్కొంది. ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాలకు వెళ్లలేని వారు పోస్టాఫీసు సేవల్ని వినియోగించుకోవాలని సూచించింది. తమ వద్ద ఉన్న నోట్లను ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాలకు పంపిస్తే.. అందుకు సమానమైన మొత్తం బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.